నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA 15 Anniversary CELEBRATING వార్షికోత్సవ శుభాకాంక్షలు

శనివారం SATURDAY 6.6.2026 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 16 ‖ సంచిక (Issue): 1 ‖ వెల (Price) రూ.6.50

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

షష్ఠి

శనివారం, సూర్యోదయం: 5-41, సూర్యాస్తమయం: 6-49. శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం గ్రీష్మ రుతువు అధిక జ్యేష్ఠ మాసం కృష్ణ పక్షం తిథి: షష్ఠి రాత్రి 2-42 వరకు. నక్షత్రం: శ్రవణం ఉదయం 6-04 వరకు, తదుపరి ధనిష్ఠ. వర్జ్యం: ఉదయం 10-20 నుంచి పగలు 12-04 వరకు. రాహుకాలం: ఉదయం 8-58 నుంచి ఉదయం 10-36 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 5-41 నుంచి ఉదయం 6-34 వరకు. అమృతకాలం: రాత్రి 8-42 నుంచి రాత్రి 10-26 వరకు.



సీఎం డీకేకు ఎదురుదెబ్బ

సన్నిహితుడు రామలింగారెడ్డి మంత్రి పదవికి రాజీనామా

శాఖ కేటాయింపుపై అసంతృప్తి

మంత్రి మునియప్ప కూడా అలక

కర్ణాటక కాంగ్రెస్‌లో గడబిడ

› 7




ఇద్దరిలో ఎబోలా లక్షణాలు

గాంధీ ఐసోలేషన్ కేంద్రంలో సుడాన్ దేశస్తులకు చికిత్స

› 11

త్వరలో శుభవార్త చెప్తా!

త్వరలో తెలంగాణ ప్రజలకు శుభవార్త అందిస్తా. డిసెంబర్‌లోపు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు, 90 టీఎంసీలకు వాళ్లమీద ఒత్తిడి తెచ్చైనా, కొట్లాడైనా ఆంధ్రప్రదేశ్ నుంచి ఎన్‌వోసీ తెచ్చే బాధ్యత నాది. డిండి ప్రాజెక్టుకు 20-30 టీఎంసీలకు అనుమతి తెచ్చే బాధ్యత కూడా నాదే. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు చంద్రబాబు ఎన్‌వోసీ ఇస్తే బనకచర్లపై ఆలోచిస్తా!



అర్థమయ్యేందుకే రెండేండ్లు!

17 ఏండ్లుగా జడ్పీటీసీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ, పార్టీ నాయకుడిగా పనిచేసి పాలమూరులో తిరిగినా.. ఈ జిల్లాపై అవగాహన వచ్చేందుకు రెండేండ్లయింది. ఏది ఎక్కడున్నదో సరి చూసుకోవడానికి ఇన్ని రోజులు పట్టింది. వీటన్నింటినీ ఓ కొలిక్కి తీసుకొద్దామని అనుకుంటే.. రాజకీయ కార్యాచరణ చేస్తామని బీఆర్‌ఎస్ వాళ్లు బయలుదేరిండ్రు.

పక్కింట్లో కోడి.. మనకు పప్పన్నం!

ఏపీ వాళ్లు గోదావరి నుంచి నీళ్లు తీసుకువచ్చి బనకచర్లలో పోసుకుంటరా? నల్లమల సాగర్‌లో పోసుకుంటరా? అనేది మన సమస్య కాదు.. మన కేటాయింపులు మనకు కచ్చితంగా రావాలి. వాళ్లేం చేస్తున్నరో మనకెందుకు?.. పక్కింట్లో కోడిని కోసుకున్నరా? కుందేలు కోసుకున్నరా మనకెందుకు? మనకు పప్పన్నం అన్న సక్కగున్నదా.. లేదా? సక్కదిద్దుకోవాలి.. పక్కింట్లో కోడికూర వాసన వస్తున్నదని చెప్పి వాడి ఇంటి మీద బురద పోస్తరా?



జవాబు లేదు!

'కర్ణాటకలో ముఖ్యమంత్రి మారిండు. అక్కడ కొత్త క్యాబినెట్ వచ్చింది. ఇక్కడ కాంగ్రెస్ సర్కార్ పదవీకాలం ఇంకా రెండేండ్లే ఉన్నది. ట్రిబ్యునల్ విచారణ పూర్తికాలేదు. మరి నీటి వాటా సాధనకు ఎట్ల ముందుకుపోతరు?

– సీఎంకు ఓ విలేకరి ప్రశ్న

పూర్తయిన పాలమూరు-రంగారెడ్డికి ఎన్‌వోసీ అవసరమేంది? కృష్ణాలో నీటి వాటా వదిలేసి, ప్రాజెక్టుల వారీ దేబరింపులేంది?

ప్రాజెక్టులపై అవగాహన లేకపోవడం తప్పుకాదు.. ఉమ్మడి పాలమూరు జిల్లాకు నష్టం చేకూర్చే నిర్ణయాలు మాత్రం తప్పు!

సముద్రంలోకి వెళ్లే నీళ్లయినా ఎగువ రాష్ట్రాలకు హక్కులుంటయ్! ఏపీ కోసమే కాళేశ్వరాన్ని ఎండబెట్టినమని ఒప్పుకొంటున్నట్టేనా?

2034 దాకా తానే సీఎం అని పదే పదే చెప్పే రేవంత్.. రెండేండ్లలో ఏం చేస్తరంటే మాత్రం సమాధానం కరువు!

దక్షిణ తెలంగాణకు కాంగ్రెస్ ఉరి!

కర్ణాటక వైపు నుంచి నరుక్కొస్తున్న 'బనకచర్ల' బాబు

కృష్ణాను ఏపీకి ధారాదత్తం చేస్తున్న రేవంత్‌రెడ్డి సర్కార్

బనకచర్లకు ఒప్పుకొంటే పాలమూరు-రంగారెడ్డికి చంద్రబాబు ఎన్‌వోసీ ఇస్తాడని కేంద్రం ప్రతిపాదన

ఒప్పందానికి సిద్ధమైన రాష్ట్ర ప్రభుత్వం.. 'శుభవార్త' అంటూ సీఎం రేవంత్ హడావుడి

- బ్రిజేశ్ ట్రిబ్యునల్ విచారణ తుదిదశకు చేరుకున్న తరుణంలో డేంజర్‌గేమ్
- బనకచర్ల ఒప్పందం పూర్తికి తెరవెనుక వేగంగా కదులుతున్న పావులు
- రూ.80వేల కోట్ల ప్రాజెక్టు కోసం ఢిల్లీ కేంద్రంగా బాబు కీలుబొమ్మలాట
- తెలంగాణకు చుక్కనీరు దక్కకుండా జూరాల, శ్రీశైలం ఎగువన కుట్రలు
- కర్ణాటకలో బ్యారేజీ-కమ్-బరాజ్‌ల నిర్మాణానికి తెలంగాణ ఒప్పందం!
- తుంగభద్ర, కృష్ణా, భీమా జలాల్ని ఒడిసిపట్టేలా ఒక్కటైన ఏపీ, కర్ణాటక
- కర్ణాటకలో కీలక అనుమతుల సాధనకు పరోక్షంగా బాబు సహకారం
- ఇదే జరిగితే పాలమూరు ప్రాజెక్టులన్నీ పడావు.. దక్షిణ తెలంగాణ ఎడారి
- పాదయాత్రకు బీఆర్‌ఎస్ సిద్ధమవడంతో ఉన్నపళంగా సీఎం డైవర్షన్ టూర్

పాలమూరుకు ప్రాణాధారమైన జూరాలను, దక్షిణ తెలంగాణకు జలభాండమైన శ్రీశైలాన్ని ఒక్కదెబ్బతో బలిపెట్టే పన్నాగమిది! చిక్కుముడులతో తెలంగాణను శాశ్వత దుర్భిక్షంలోకి నెట్టే దుర్నీతి ఇది. కేంద్రంలోని బీజేపీ సర్కార్, కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఏపీలోని టీడీపీ సర్కార్.. మూడూ కలిసి కృష్ణాను చెరపట్టేందుకు, తెలంగాణకు ఉరి బిగించేందుకు సిద్ధమయ్యాయి. అందుకు తాడు పేనుతున్నది రేవంత్ సర్కార్. స్వయంగా కృష్ణాను ఏపీకి ధారాదత్తం చేస్తూ సొంత జిల్లాను బలిపెడ్తున్నది.. తాను పాలమూరు బిడ్డనని చెప్పుకొనే ముఖ్యమంత్రే!

బాబు కట్టాలనుకుంటున్న బనకచర్లకు కర్ణాటక ఒప్పుకోవాలి. కర్ణాటక కొత్త ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అనుమతులు కావాలి. అందుకు కేంద్ర ప్రభుత్వంలో చక్రం తిప్పుతున్న చంద్రబాబు అవసరం. ఒకరికోసం ఒకరు.. రాజకీయ వైరుధ్యాలను పక్కనబెట్టి, కృష్ణా నీటిని కొల్లగొట్టేందుకు చేతులు కలిపారు. ఇటు ఏపీ బాబు తరఫున రాజకీయం నెరపుతున్నదీ, అటు కర్ణాటక కాంగ్రెస్ సర్కార్ తరఫున రాయబారం నడుపుతున్నదీ రేవంత్ సర్కార్! పొరుగు రాష్ట్రాల కోసం తెలంగాణ జలహక్కుల్ని బలిపీఠం ఎక్కిస్తున్నది. తాను బుక్క తవుడు లేదుగని, పక్కనోడి నోట్లో పంచదార పోసిండట!

ఇటు జూరాలకు ఎగువన భీమాపై కర్ణాటక మూడు ప్రాజెక్టులు నిర్మిస్తున్నది. కృష్ణాపై కొల్పూర్ వద్ద ప్రాజెక్టుతోపాటు ఆల్మట్టి డ్యామ్ సామర్థ్యం పెంచేందుకు ప్రయత్నిస్తున్నది. అటు శ్రీశైలం రిజర్వాయర్‌కు ప్రధాన ఆధారమైన తుంగభద్ర మీద కూడా కర్ణాటక మూడు కొత్త ప్రాజెక్టులకు ముగ్గుపోస్తున్నది. మంత్రాలయం వద్ద ఏపీ-కర్ణాటక ఉమ్మడిగా ప్రాజెక్టును ప్రతిపాదిస్తున్నాయి. ఇది శ్రీశైలానికి రాకముందే నీటిని దొబ్బుకుపోయే కుట్ర! ఎవరికివారు బొక్కెనలేసి కృష్ణా, తుంగభద్ర జలాలను ఎగువనుంచే ఎత్తుకుపోయే పన్నాగం! తడిబట్టతో పాలమూరు గొంతుకోసి, తెలంగాణనోట్లో మట్టిగొట్టే.. కుతంత్రం!

మరి, శ్రీశైలానికి నీళ్లు రాకుండా పోతే.. ఏపీ ప్రయోజనాలు దెబ్బతినవా!? నీళ్లు తరలించుకుపోయేందుకు ఇప్పటికే పోతిరెడ్డిపాడు ఉండనే ఉన్నది. దానికితోడు బనకచర్ల పేరుతో గోదావరి నీటిని శ్రీశైలం పరీవాహకానికి తరలించేందుకు ఏపీ తహతహలాడుతున్నది. కేంద్రం సహకారంతో అందుకు రంగం సిద్ధం చేసింది కూడా. కాళేశ్వరాన్ని ఎండబెట్టి, గోదావరి జలాలను దిగువకు తరలిపోయేలా చేసిన రేవంత్ సర్కార్.. కృష్ణా జలాలను ఏపీ, కర్ణాటకలకు ధారాదత్తం చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నది. మన హక్కుల్ని కడతేర్చి, కర్ణాటక కట్టబోతున్న సాగునీటి ప్రాజెక్టులను స్వయంగా సీఎం రేవంత్ ఏరియల్ వ్యూలో దర్శించుకుని మరీ మురిసిపోయారు.


గట్లు గట్లు గాలికిపోతుంటే.. ఇస్తరాకు నాదే అన్నడట! కృష్ణా నీటిలో వాటా కోసం కొట్లాడాల్సిన ప్రభుత్వం.. ప్రాజెక్టుల వారీగా టీఎంసీల కోసం దేవులాడుతున్నది. నిరుడు బనకచర్ల విషయంలో వ్యవహరించినట్టుగానే ఇప్పుడూ చేస్తున్నది. పాలమూరు కోసం పాదయాత్ర చేస్తామని బీఆర్‌ఎస్ ప్రకటిస్తే.. చర్చలు, ఒప్పందాలంటూ డైవర్షన్‌ను మొదలుపెట్టింది.

జూరాలను జుర్రేసి, శ్రీశైలాన్ని నిర్జలభూమిగా మార్చే కుట్ర అమలైతే తెలంగాణ పరిస్థితి ఏమిటి? ఏండ్లకేండ్లు కరువులతో వలసలపాలైన తెలంగాణ బిడ్డల భవిష్యత్తు ఏమిటి? ఒక్క వేటుతో పాలమూరు-రంగారెడ్డి అవుట్! శ్రీశైలం అవుట్! జూరాల అవుట్! ఆర్డీఎస్, సుందిళ్ల, పాలమూరు ప్రాజెక్టులు అవుట్! తెలంగాణ గుక్కెడు నీటికి గుక్కపట్టి ఏడ్వాల్సి వస్తది! చుక్కనీటి కోసం పైకి, కిందికి వెర్రిచూపులు చూడాల్సి వస్తుంది. దక్షిణ తెలంగాణ శాశ్వత దుర్భిక్షంలోకి జారుకుంటుంది.

› 3

జూరాల, శ్రీశైలంపై కుతంత్రం.. రాజకీయ వైరుధ్యాలు పక్కకునెట్టి ఒక్కటైన కర్ణాటక, ఏపీ

కృష్ణా, తుంగభద్ర, భీమాపై కొత్త ప్రాజెక్టులకు పన్నాగం.. తలూపుతున్న తెలంగాణ ప్రభుత్వం



1 నావలి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్

పూడిక కారణంగా తుంగభద్ర డ్యామ్‌లో 55.28 టీఎంసీలు నష్టపోవాల్సి వస్తున్నదని చెప్తున్న కర్ణాటక.. లోలెవల్ కెనాల్‌కు సమాంతరంగా మరో కాలువ తవ్వేందుకు సిద్ధమైంది. ఇప్పటికే 31 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన నావలి రిజర్వాయర్‌ను 52టీఎంసీలకు విస్తరించి తుంగభద్ర బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా వినియోగించుకునేందుకు ప్రతిపాదనలు సిద్ధంచేసింది.

2 చిక్కాలపర్వి

తుంగభద్ర నదిపై చిక్కాలపర్వి వద్ద రూ.397.5 కోట్లతో 0.43టీఎంసీల నీటినిల్వ సామర్థ్యంతో రోడ్ కమ్ బరాజ్ నిర్మాణానికి కర్ణాటక ప్రతిపాదనలను సిద్ధం చేసింది. ఏపీలోని మంత్రాలయానికి రోడ్డు మార్గం ఏర్పడుతుంది. బ్రిడ్జి నిర్మాణ ప్రతిపాదనలకు కేంద్రం సైతం ఆమోదం తెలిపింది.

3 గుండ్రేవుల బరాజ్

తుంగభద్రపై కర్నూలు జిల్లా గుండ్రేవుల వద్ద ఏపీ ప్రభుత్వం 10టీఎంసీలతో బ్రిడ్జి కమ్ బరాజ్ నిర్మాణానికి ప్రతిపాదించింది. అందులో 4టీఎంసీలను వాడుకునే అవకాశమిస్తామని తెలంగాణకు సైతం ఆశజూపింది. కేసీఆర్ ప్రభుత్వం అప్పట్లో ఈ ప్రతిపాదనలను తోసిపుచ్చింది. తెలంగాణకు తీరని నష్టమని తేల్చిచెప్పింది. ఏపీ ప్రతిపాదనలను పక్కకునెట్టి ఆర్డీఎస్ కోసం తుమ్మిళ్ల లిఫ్టును నిర్మించింది.

4 ఆల్మట్టి ఫేజ్-3

కర్ణాటక ప్రతిపాదించిన యూకేపీ ఆల్మట్టి ఫేజ్-3 (అప్పర్ కృష్ణా ప్రాజెక్టు)కు బ్రిజేశ్ ట్రిబ్యునల్ 130 టీఎంసీలను కేటాయించింది. ఆ జలాల వినియోగానికి ఆల్మట్టి ఎత్తును 519.6మీటర్ల నుంచి 524.256మీటర్లకు పెంచుకునేందుకు అనుమతిచ్చింది. తద్వారా ఆల్మట్టి ప్రస్తుత నీటిమట్టం 123.08టీఎంసీలకు అదనంగా మరో 100టీఎంసీల స్టోరేజీ కెపాసిటీ పెరుగుతుంది. అయితే ట్రిబ్యునల్ అవార్డు అమల్లోకి రాకముందే ఆల్మట్టి ఎత్తుపెంపును చేపట్టేందుకు కర్ణాటక సిద్ధమైంది.

5 కొల్పూర్ వద్ద బరాజ్..

కర్ణాటక ప్రభుత్వం నారాయణపూర్ స్పిల్‌వేకు దిగువన కొల్పూర్ వద్ద 1 టీఎంసీ నీటినిల్వ సామర్థ్యంతో కొత్తగా బరాజ్‌ను ప్రతిపాదించింది. తాగు, సాగునీరు, లిఫ్ట్ చేపట్టాలనేది ప్లాన్. 332 మీటర్ల పూర్తిస్థాయి జలాశయ మట్టం వద్ద నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధంచేసింది. సంయుక్తంగా నిర్మించేందుకు తెలంగాణ సర్కార్‌తో కలిసి సన్నాహాలు చేస్తున్నది.

6 కురుమర్తి బరాజ్

కృష్ణా, భీమా నదులు తంగిడి వద్ద కలుస్తాయి. దాని ఎగువన భీమా నదిపై కురుమర్తి గ్రామం వద్ద తెలంగాణతో కలిసి సంయుక్తంగా బరాజ్ నిర్మాణానికి కర్ణాటక తాజాగా ప్రతిపాదనలు సిద్ధం చేసింది. సంప్రదింపులు కొనసాగుతున్నాయి.

7 హర్యాల్ బ్రిడ్జ్-కమ్-బరాజ్

కర్ణాటక లోని కలబురిగి జిల్లా జేవర్గి తాలూకాలో భీమా నదిపై హర్యాల్ వద్ద బ్రిడ్జి కమ్ బరాజ్‌ను ప్రతిపాదించింది. రూ. 104కోట్ల నిర్మాణ అంచనా బ్రిడ్జి కమ్ బరాజ్ నిర్మాణానికి టెండర్‌ను సైతం జారీ చేసింది.

8 గుర్జాపూర్ గేటెడ్ బరాజ్

భీమా నదిపై కొల్పూర్ బరాజ్‌కు సుమారు 10నుంచి 15 కిలోమీటర్ల ఎగువన రాయచూర్ తాలూకాలో గుర్జాపూర్ గ్రామం సమీపంలో 336మీటర్ల ఎఫ్‌ఆర్‌ఎల్‌తో బరాజ్ నిర్మాణానికి ప్రతిపాదన. రాయచూర్ థర్మల్ పవర్ స్టేషన్‌కు నిరంతర నీటి సరఫరా దీని లక్ష్యం.

9 సొన్నా బరాజ్

కర్ణాటకలోని కలబురిగి జిల్లాలో భీమా నదిపై 3.6 టీఎంసీల నిల్వసామర్థ్యంతో బరాజ్ నిర్మాణానికి ప్రతిపాదన. సాగు, తాగునీరు, పారిశ్రామిక అవసరాల కోసం మొత్తంగా బరాజ్ నుంచి 6 టీఎంసీలు వాడుకునే అవకాశమివ్వాలంటూ కేంద్రం ముందు ప్రతిపాదించిన కర్ణాటక.

కోస్గి కాలేజీపై హ్యాండ్సప్!

సీఎం ఇలాకాలో ఇంజినీరింగ్ కాలేజీ నడుపలేని వైనం

రెండేండ్లకే చేతులెత్తేసిన సర్కార్

జేఎన్‌టీయూహెచ్‌కి కళాశాల బదలాయింపు

› 8

బీఆర్‌ఎస్‌కు డిపాజిట్ వస్తే నా పేరు మార్చుకుంటా

పాలమూరులో ఆ పార్టీని బొందపెడుతా

మా రెండేండ్ల పాలన.. మీ పదేండ్ల పాలనపై కేసీఆర్ చర్చకు రావాలి.. ఓడితే క్షమాపణ చెప్తా

జడ్చర్ల సభలో నోరుపారేసుకున్న సీఎం రేవంత్

బీఆర్‌ఎస్ జెండా దిమ్మెలు కూల్చాలంటూ మరోసారి రాజకీయ విద్వేషకర వ్యాఖ్యలు

మహబూబ్‌నగర్, జూన్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/హైదరాబాద్ (నమస్తే తెలంగాణ) : కృష్ణా నదిలో మన వాటాను వినియోగించుకోకుండా నీటిని ఏపీకి ధారాదత్తం చేయడం, తెలంగాణ నీటి హక్కులను ఏపీకి తాకట్టు పెట్టడం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలను పూర్తిచేయకుండా సొంత జిల్లా పాలమూరును పడావు పెట్టిన తీరుపై విమర్శలు వెల్లువెత్తుతుండటంతో

› 2వ పేజీలో



రెబల్స్‌లో చీలిక

మమతనే చైర్‌పర్సన్‌గా ఉండాలని పలువురు టీఎంసీ తిరుగుబాటు ఎమ్మెల్యేల డిమాండ్

› 7

రితబ్రత భేటీకి 32 మందే హాజరు

రెబల్స్‌కు మమత బుజ్జగింపులు

నేరుగా ఎమ్మెల్యేలతో మంతనాలు

ఎంపీల్లో రాజుకుంటున్న అసమ్మతి

వేతనాలేవి మహాప్రభో!



5 నెలల నుంచి 12,702 మంది పంచాయతీ సర్పంచుల ఎదురుచూపు

› 6

62 వేల మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకూ 2 నెలలుగా అందని జీతాలు

ఉపాధి సిబ్బందికీ 2 నెలలుగా పెండింగ్

రాష్ట్ర కాంగ్రెస్ సర్కార్‌పై సర్పంచులు, ఆయా విభాగాల ఉద్యోగుల మండిపాటు

సోషల్ మీడియా వేదికల్లో రేవంత్ సర్కార్ తీరును తూర్పారపడుతున్న నెటిజన్లు



మలేషియాలో నేడు రాష్ట్రావతరణ వేడుకలు

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఘనస్వాగతం

› 5

కౌలాలంపూర్ ఎయిర్‌పోర్ట్‌కు భారీగా తరలివచ్చిన ఎన్నారైలు

40 లక్షల టన్నుల బొగ్గు మింగిందెవరు?

- రేవంత్ పాలనలో స్కామ్‌లకు కేరాఫ్‌గా సింగరేణి
- నిజాలు నిగ్గుతేల్చడంలో కేంద్రం నిర్లక్ష్యమెందుకు?
- కోల్ స్కామ్‌పై విచారణ జరుపకపోతే ఉద్యమం
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ

› 5



కర్ణాటకలో రేవంత్ ఏరియల్ వ్యూ మర్మమేమిటి?

- తెలంగాణ ప్రయోజనాలు తాకట్టు పెట్టే ప్రయత్నమేనా?
- బనకచర్ల, నల్లమల్లసాగర్ ప్రాజెక్టులపై దాటవేత ధోరణి
- ఒకవైపు రాష్ట్ర ప్రయోజనాలు అంటూనే మరోవైపు కృష్ణా జలాలను ఆంధ్రాకు ధారాదత్తం చేసే ప్రయత్నం
- పంచాయితీనా? పరిష్కారమా? అనే సూత్రం మతలబు ఏమిటో?
- రేవంత్‌ది రెండు నాలుకల ధోరణి

మహబూబ్‌నగర్, జూన్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): గోదావరి, కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను కాపాడుతామని చెప్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. పొరుగు రాష్ట్రాలు నిర్మిస్తున్న ప్రాజెక్టులకు పరిశీలించడం వెనుక మర్మం ఏమిటో అంతుచిక్కడం లేదు. తాజాగా కృష్ణా, భీమా నదులపై కర్ణాటక ప్రభుత్వం సరిహద్దుల్లో అక్రమంగా నిర్మిస్తున్న బ్రిడ్జి కం బరాజ్‌లపై ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు రెండు హెలికాప్టర్లలో వెళ్లి ఏరియల్ వ్యూ చేయడం వెనుక ఉద్దేశమేమిటో అర్థం కావడం లేదు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా, గోదావరి నదులను చెరబడుతూ.. కేంద్రాన్ని అడ్డం పెట్టుకొని బనకచర్ల-నల్లమల్లసాగర్ పేరుతో భారీ జలదోపిడీకి రంగం సిద్ధం చేస్తుండగా, సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం రాష్ట్ర, పాలమూరు ప్రయోజనాలు అంటూ దీర్ఘాలు తీస్తున్నారు. త్వరలో తీపి కబురు చెబుతానంటూనే పక్కింట్లో కోడికూర చేస్తే.. ఎందుకు కోడికూర చేశావని అడుగుతామా? అని పరోక్షంగా చంద్రబాబును వెనుకేసుకొచ్చే ప్రయత్నం చేశారు. మరోవైపు, కర్ణాటకలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటంతో ఆ రాష్ట్రం అక్రమంగా కడుతున్న ప్రాజెక్టులను అడ్డుకోకుండా, కలిసి కడితే వాటాలు వస్తాయని కొత్త భాష్యం చెప్తున్నారు. ఇప్పటికే జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి చుక్కనీరు రాకుండా ఎక్కడికక్కడే కర్ణాటక ప్రభుత్వం బ్రిడ్జి కం బరాజ్‌ల పేరుతో అక్రమంగా, అడ్డగోలుగా అడ్డుకట్టలు వేసింది. తాజాగా తెలంగాణ-కర్ణాటక సరిహద్దు చివరి కిలోమీటర్ దగ్గర కూడా బ్రిడ్జి కం బరాజ్‌లను నిర్మిస్తూ జూరాల ప్రాజెక్టు ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నది. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి వంత పాడటం, వాటిని చేపట్టే చోట ఏకంగా హెలికాప్టర్‌లో నుంచి తొంగిచూడటం వెనుక మతలబు ఏమిటో అర్థం కావడం లేదు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరు జిల్లాలో రెండ్రోజుల ప్రాజెక్టుల పర్యటన నేపథ్యంలో ఇటు కృష్ణా, గోదావరి, అటు తుంగభద్రా నదుల జలవినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి అనుమానాస్పదంగా మారింది. ఇందుకు బలం చేకూరుస్తూ.. 'ముందుగా మన ప్రాజెక్టులకు అనుమతులు, నికర జలాలు కేటాయించుకున్న తర్వాతే సముద్రంలోకి వెళ్లే జలాలపై మీ ఇష్టం అంటూ కరాఖండిగా చెబుతాం' అంటూనే 'వాళ్లు వాళ్ల ఇష్టం.. వాళ్ల ప్రాజెక్టులు' అంటూ పరోక్షంగా గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారు. ఒకవేళ నిజంగా పాలమూరు-రంగారెడ్డికి 90 టీఎంసీలు.. బచావత్ ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉన్న నికర జలాలన్నిటికీ ఒప్పుకొంటేనే చర్చలు జరుపుతామని.. దానికి సంబంధించి ఎన్వోసీ ఇస్తేనే ముందుకు వెళ్తామని అంటున్నారు. ఇలా అంటూనే పంచాయితీ కావాలా? పరిష్కారం కావాలా? అనే దానిపై కూడా పరిష్కారమే కావాలని ఒకవేళ పంచాయితీతోనే పరిష్కారం అయితే దానికి కూడా సిద్ధమని అంటున్నారు. ఈ రెండు నాలుకల ధోరణితో రాష్ట్ర ప్రయోజనాలు ఏ మేరకు సిద్ధిస్తాయో? వేచి చూడాల్సిందే. ఇదిలా ఉండగా రాష్ట్రంలో ప్రాజెక్టులు చేపట్టి.. నిధులు తీసుకొచ్చి పూర్తి చేసే పరిస్థితి ప్రభుత్వంలో కనిపించడం లేదు.. అలాంటప్పుడు ఇటు గురువు ప్రయోజనాల కోసం ఆంధ్రాకు.. అటు సొంత పార్టీ అధికారంలో ఉన్నది కాబట్టి కర్ణాటకకు రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టే ప్రయత్నం జరుగుతున్నదా? అనే అనుమానాలు కలుగుతున్నాయి.

తుంగభద్ర రాదు.. శ్రీశైలం నిండదు

జూరాల ప్రాజెక్టు ఇక పడావే..

- కర్ణాటక.. ఏపీ రాష్ట్రాల ఎత్తులతో దక్షిణ తెలంగాణకు పొంచి ఉన్న ముప్పు
- రెండు రాష్ట్రాల్లో అనేక ప్రాజెక్టుల నిర్మాణానికి, విస్తరణకు ప్రణాళికలు
- బాబు కోసం ఆయా ఒప్పందాలకు ఇక్కడ సైఅంటున్న రేవంత్ సర్కార్



హైదరాబాద్, జూన్ 5 (నమస్తే తెలంగాణ): ముమ్ముందు తుంగభద్ర పరవళ్లు ఉండవా.. కృష్ణమ్మ ఉరుకులు ఇక కనబడవా? ఫలితంగా దక్షిణ తెలంగాణకు ముప్పు పొంచి ఉన్నదా? అంటే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు రచిస్తున్న ప్రణాళికలు అమలైతే అదే జరుగుతుంది. దిగువ జూరాల పడావు పడక తప్పదు. శ్రీశైలం ఎల్లకాలం ఎండుడూ తప్పదు. కృష్ణా నదికి తుంగ, భద్ర ఉప నదులు. ఆ రెండింటి నుంచే ఏటా దాదాపు 500 టీఎంసీల మేరకు జలాలు కృష్ణా నదిలో కలుస్తుంటాయి. ఈ నేపథ్యంలోనే బచావత్ ట్రిబ్యునల్ తుంగభద్ర నదిపై ఎక్కడ పడితే అక్కడ, ఎలాపడితే అలా ప్రాజెక్టులు నిర్మించకుండా అనేక ఆంక్షలు విధించింది. షరతులు కూడా పెట్టింది. కానీ కర్ణాటక సర్కార్ ఇప్పటికే ఆ నిబంధనలను తుంగలోకి తొక్కుతూ అనేక నిర్మాణాలు చేపడుతున్నది. ఇప్పటికే అరకొరగానే జలాలు వచ్చే భీమా నదిపై బరాజ్‌ల నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నది. ఇక ఏపీ సైతం వరదజలాల పేరిటే ప్రాజెక్టులు చేపడుతామని పేర్కొంటూ ఆ తర్వాత అనేక కుట్రలకు తెరలేపింది. ప్రస్తుతం ఆ రెండు రాష్ట్రాలు చేస్తున్న ప్రణాళికలు అమలైతే భవిష్యత్తులో తుంగభద్ర నుంచి కృష్ణా నదిలోకి వచ్చే జలాలు పూర్తిగా తగ్గిపోతాయి. దిగువ ప్రాజెక్టులకు నీళ్లు రాకుండా పోతాయి. అంతిమంగా భవిష్యత్తులో ప్రస్తుతం వస్తున్న ఆ కొద్ది నదీజలాలు తెలంగాణకు దక్కకుండా పోయే ప్రమాదం పొంచి ఉన్నది. బాబు కోసం రేవంత్ సర్కార్ సైతం సదరు ప్రణాళికలకు సై అంటున్నది. ఒప్పందాలకు సిద్ధమవుతున్నది. దక్షిణ తెలంగాణను ఉరివేయ పూనుకున్నది.

నావలి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్!

230 టీఎంసీల నీటిని వినియోగించుకొనే లక్ష్యంతో తుంగభద్ర డ్యామ్ నిర్మించారు. ఆ డ్యామ్‌లో పూడిక పెరుగడం, వరద ప్రవాహాల్లో వచ్చిన మార్పుల ఫలితంగా ప్రస్తుతం 174.72 టీఎంసీలను వినియోగించుకొనే పరిస్థితే ఉన్నదని, 55.28 టీఎంసీలను నష్టపోవాల్సి వస్తున్నదని కర్ణాటక చెప్తున్నది. దానినే సాకుగా చూపి తుంగభద్ర లోలెవల్ కెనాల్ (ఎల్‌ఎల్‌సీ)కి సమాంతరంగా మరో కాలువను తవ్వేందుకు ఆ రాష్ట్ర సర్కార్ సిద్ధమైంది. కొప్పల్ జిల్లా గంగావతి తాలుకాలో ఇప్పటికే 31 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన నావలి రిజర్వాయర్‌ను 52 టీఎంసీలకు విస్తరించి తుంగభద్ర డ్యామ్‌కు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా వినియోగించుకొనేందుకు ప్రతిపాదనలు సిద్ధంచేసింది. ప్రాజెక్టును ఎట్టిపరిస్థితుల్లోనూ చేపడుతామంటూ ఆ దిశగా ప్రస్తుతం వేగంగా అడుగులు వేస్తున్నది.

వరద జలాల పేరిట ఏపీ కుట్రలు

తుంగభద్ర డ్యామ్ హైలెవల్ కెనాల్ మొత్తం పొడవు 189 కి.మీ. కర్ణాటక రాష్ట్రంలో 105 కి.మీ వరకు, అక్కడి నుంచి 189 కి.మీ. వరకు ఏపీ రాష్ట్రం అనంతపురం జిల్లా గుండా పోతుంది. ఆ కాలువ నుంచి ఆ జిల్లాలోని మిడ్ పెన్నార్ రిజర్వాయర్, పెన్నార్ అహోబిలం రిజర్వాయర్లు కూడా ఉన్నాయి. ఈ హెచ్‌ఎల్‌సీ ద్వారా ఏపీకి 32 టీఎంసీల జలాల కేటాయింపులు ఉన్నాయి. ఇదిలా ఉంటే కేవలం కృష్ణాకు వరదలు వచ్చిన క్రమంలో వాటిని తక్కువ సమయంలోనే తరలించి అనంతపురం జిల్లాకు అందిస్తామని చెబుతూ ఏపీ సర్కార్ కుట్రకు తెరతీసింది. అందులో భాగంగా హెచ్‌ఎల్‌సీ కెనాల్‌కు సమాంతరంగా మరో కాలువను తవ్వేందుకు ప్రణాళికలను రూపొందించడమే కాదు ఏపీలో కొలువైన టీడీపీ సర్కార్ ఆ ప్రణాళికలను శరవేగంగా ముందుకు తీసుకుపోతున్నది. అందుకు కర్ణాటక కూడా అంగీకారం తెలిపేందుకు సిద్ధంగా ఉన్నది.

ఆల్మట్టి ఎత్తు పెంపునకు శరవేగంగా అడుగులు

బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ కర్ణాటక ప్రతిపాదించిన యూకేపీ ఆల్మట్టి ఫేజ్-3 (అప్పర్ కృష్ణా ప్రాజెక్టు)కి 130 టీఎంసీలు కేటాయించింది. ఆ జలాల వినియోగానికి ఆల్మట్టి ఎత్తును 519.6 మీటర్ల నుంచి 524.256 మీటర్లకు పెంచుకొనేందుకు అనుమతిచ్చింది. తద్వారా ఆల్మట్టి ప్రస్తుత నీటిమట్టం 123.08 టీఎంసీలకు అదనంగా మరో 100 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. అయితే ట్రిబ్యునల్ అవార్డు ఇప్పటికీ అమలులోకి రాలేదు. పెండింగ్‌లోనే ఉన్నది. కానీ, అవార్డు అమల్లోకి రాకముందే ఆల్మట్టి ఎత్తుపెంపును చేపట్టేందుకు కర్ణాటక సిద్ధమైంది. ఎత్తు పెంచి నీటినిల్వ సామర్థ్యం పెంపునకు దాదాపు 1.33 లక్షల ఎకరాల భూమిని సేకరించాల్సి ఉన్నది. అందుకు రూ.70 వేల కోట్ల మేరకు అవసరమవుతాయని అంచనా వేయడంతోపాటు, ఆ ప్రతిపాదనలకు కర్ణాటక ప్రభుత్వం ఇటీవలే ఆమోదం తెలిపింది. అంతేకాదు ఏటా భూసేకరణకు రూ.15 వేల నుంచి రూ.20 వేల కోట్లను వెచ్చించేందుకు నిర్ణయించింది. అవార్డును పాక్షికంగా అమలు చేసేలా చూడాలని కేంద్రంపైనా ఒత్తిడి పెంచుతున్నది.

కర్ణాటకలో వడివడిగా ప్రాజెక్టులు.. దిక్కులు చూస్తున్న రేవంత్

కర్ణాటక రాష్ట్రంలో వివిధ నీటి ప్రాజెక్టులు, బరాజ్‌ల నిర్మాణాలకు వడివడిగా సిద్ధపడుతుంటే.. తెలంగాణలోని రేవంత్ సర్కార్ దిక్కులు చూస్తున్నది. కర్ణాటక ప్రభుత్వం నారాయణపూర్ స్పిల్‌వేకు దిగువన కొల్హార్ వద్ద 1 టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యంతో బరాజ్‌ను ప్రతిపాదించగా, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సైతం సూత్రప్రాయంగా అంగీకారం తెలుపుతున్నారు. కృష్ణా, భీమా నదులు కలిసే తంగిడికి ఎగువన భీమా నదిపై కుసుమూర్తి గ్రామం వద్ద తెలంగాణతో కలిసి సంయుక్తంగా బరాజ్ నిర్మాణానికి కర్ణాటక తాజాగా ప్రతిపాదనలు సిద్ధం చేసింది. సంప్రదింపులు కొనసాగుతున్నాయి. అదే భీమా నదిపై రాయచూర్ గుర్జాపూర్ గ్రామ సమీపంలో బరాజ్ నిర్మాణానికి ప్రతిపాదనల దశలో ఉన్నది. భీమా నదిపై హర్యాల్ వద్ద బ్రిడ్జి కమ్ బరాజ్ నిర్మాణానికీ కర్ణాటక సర్కార్ టెండర్‌ను సైతం జారీ చేసింది. భీమా నదిపైనే కలబురిగి జిల్లాలో 3.6 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యంతో మరో బరాజ్ నిర్మాణానికి కర్ణాటక ప్రభుత్వం సిద్ధమైంది. తుంగభద్రా నదిపై చిక్కాలపర్వి వద్ద బరాజ్ నిర్మాణానికి కర్ణాటక ప్రతిపాదనలకు కేంద్రం సైతం ఆమోదం తెలిపింది.

..నా పేరు మార్చుకుంటా

మొదటిపేజీ తరువాయి...



వాటి నుంచి ప్రజల దృష్టిమళ్లించేందుకు సీఎం మళ్లీ బీఆర్‌ఎస్‌పై విమర్శలు చేస్తూ శివాలూగారు. రెండున్నరేండ్ల నుంచి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పండబెట్టి తట్టెడు మట్టి ఎత్తని సీఎం రేవంత్ శుక్రవారం ఆదరాబాదరగా పాలమూరులో పర్యటించారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గం ఉద్దండాపూర్‌లో నిర్వహించిన 'ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక' బహిరంగ సభలో ఎప్పటిలానే కేసీఆర్‌పై అక్కసు వెళ్లగక్కారు. కర్ణాటకలో సీఎం పదవి మార్పిడి జరిగినట్టే తెలంగాణలోనూ సీఎంను మారుస్తారని ఊహాగానాలు.. ఢిల్లీకి వెళ్లి మంత్రులు అధిష్ఠానాన్ని కలిసి రావడంతో ఫ్రస్ట్రేషన్‌కు గురైన రేవంత్ మరోసారి బీఆర్‌ఎస్ అధినేతపై తన అక్కసు వెళ్లగక్కారు. ముఖ్యమంత్రై 30 నెలల్లో సొంత జిల్లా పాలమూరుకు ఏం చేశాడో చెప్పకుండా విమర్శలు, సవాళ్లతో సరిపెట్టారు. రెండు రోజులు కాలికి బలపం కట్టుకొని హెలికాప్టర్లలో చక్కర్లు కొట్టినా ఇక్కడ ప్రజల నుంచి స్పందన రాకపోవడంతో నిరాశకు గురైన రేవంత్ మళ్లీ పాత పాట పాడారు.

బీఆర్‌ఎస్ దిమ్మెలు కూలాలి

'పాలమూరు ప్రజలకు మట్టి తీసుడే కాదు.. మట్టితో కప్పడం కూడా తెలుసు.. పాలమూరు జిల్లాలో బీఆర్‌ఎస్‌ను బొంద పెడుతా.. ఏ ఒక్కరినీ ఎమ్మెల్యేగా గెలువనియ్య.. బీఆర్‌ఎస్ దిమ్మెలు కూలాలి. గద్దెలు దిగాలి.. వచ్చే ఎన్నికల్లో పాలమూరులో బీఆర్‌ఎస్‌కు డిపాజిట్ వస్తే.. నా పేరు మార్చుకుంటా' అని సవాల్ చేశారు. 'మీ పదేండ్ల పాలన, మా రెండున్నరేండ్ల పాలనపై చర్చిద్దాం.. కేసీఆర్ అసెంబ్లీకి రావాలె.. నాది తప్పయితే క్షమాపణ చెప్తా'నంటూ రెచ్చిపోయారు. పాలమూరులో ఊరు లేకపోయినా, పార్లమెంటులో నోరు లేకపోయినా రాజకీయంగా వలస వచ్చిన కేసీఆర్‌ను ఇక్కడి ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని చెప్పారు. బీఆర్‌ఎస్ పదేండ్లలో పాలమూరు జిల్లాలోని ఏ ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని అబద్ధాలు వల్లె వేశారు. '2034 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్‌దే అధికారం.. కేసీఆర్‌కు ఇదే నా సవాల్' అంటూ ఊగిపోయారు. కేటీఆర్ పాలమూరు నుంచే తన పాదయాత్ర మొదలు పెడుతారన్న అంశంపై పదేపదే తన అసంతృప్తి వెళ్లగక్కారు.

అబద్ధాల వల్లెవేత

కృష్ణా నదీ జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని చర్చల ద్వారా ఒప్పిస్తానని, చర్చల ద్వారానే 60 ఏండ్ల నాటి రావణకాష్టానికి ముగింపు పలుకుతానని సీఎం రేవంత్ ప్రకటించారు. 'పక్క రాష్ట్రంతో నేను చర్చలు చేస్తా అంటే.. నా మీద బురద జల్లాలనే ప్రయత్నం చేస్తుండు. నువ్ బురద జల్లినా, కాళ్లు తలకిందులుగా పెట్టి పెట్టినా.. సీసాలో తలకాయ పెట్టి సచ్చినా.. పక్క రాష్ట్రంతో చర్చలు జరిపి తీరుతా'నంటూ కేసీఆర్‌పై అవాకులుచెవాకులు పేలారు. 'పదేండ్లలో కాళేశ్వరం కోసం లక్ష కోట్లు ఖర్చు చేసిన కేసీఆర్.. ఉద్దండాపూర్ మునిగితే రూ.800 కోట్లు ఇవ్వలేదు.. నిర్వాసితులను జైల్లో పెట్టి కొట్టించారు.. మన భూములకు సాగునీళ్లు రాలేదు.. మన కష్టాలు తీరలేదు.. మీ పాలమూరు బిడ్డగా జిల్లాలో ప్రాజెక్టుల కోసం 30 నెలల్లో రూ.8 వేల కోట్లు ఖర్చు చేశా' నంటూ నిస్సిగ్గుగా అబద్ధాలు వల్లించారు.



మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సమీపంలోని ఉద్దండాపూర్ రిజర్వాయర్ సమీపంలో కుప్పకూలిన టెంట్లు

వచ్చారు.. చూశారు.. వెళ్లారు!

- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి
- నార్లాపూర్ ప్యాకేజీ-2, ప్యాకేజీ-3 కాలువల పనులు పరిశీలించిన సీఎం
- నాగర్‌కర్నూల్ జిల్లాలోని వట్టెం పంప్‌హౌస్ సందర్శన
- నాణ్యతలో రాజీపడొద్దని ఆదేశం

నాగర్‌కర్నూల్, జూన్ 5: ఉమ్మడి పాలమూరు జిల్లాలో సీఎం రేవంత్ పర్యటన మొక్కుబడిగా సాగిందని జిల్లావాసులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. నిర్మాణంలో ఉన్న పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనుల పరిశీలన కార్యక్రమం.. 'వచ్చిండు.. చూసిండు... పోయిండు..' అన్న రీతిలో సాగిందని చర్చించుకుంటున్నారు. సీఎం రెండ్రోజుల పర్యటనలో ప్రాజెక్టు సందర్శన అనంతరం జిల్లాలో ఎక్కడా మాట్లాడలేదు. రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులతో కలిసి ఇప్పటివరకు జరిగిన పనులను పరిశీలిస్తూ పర్యటించారు. జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా శుక్రవారం మొదటగా నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని నార్లాపూర్ వద్ద ప్యాకేజీ-2, ప్యాకేజీ-3 కాల్వల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. పనుల ప్రగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, పాలమూరు ప్రాంతానికి సాగు, తాగునీటి అవసరాలను తీర్చాలన్న లక్ష్యానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని సీఎం తెలిపారు. అనంతరం నార్లాపూర్ రిజర్వాయర్ డెలివరీ సిస్టమ్‌ను మంత్రులు ఉత్తమ్, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, చీఫ్ ఇంజినీర్ విజయభాస్కర్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం నార్లాపూర్ ప్యాకేజీ-1లోని పంప్‌హౌస్‌ను పరిశీలించారు. ప్యాకేజీ 2,3లోని హెడ్‌రెగ్యులేటరీ వద్ద ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ప్రాజెక్టులో భాగమైన డెలివరీ సిస్టమ్‌ను పరిశీలించారు. ఇక్కడ 6.4 టీఎంసీల సామర్థ్యం కలిగి ఉండగా మొత్తం 8 పంపుల ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు రూపొందించినట్టు అధికారులు వివరించారు. పథకం కింద మొత్తం 12.3 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది లక్ష్యం కాగా, శ్రీశైలం బ్యాక్‌వాటర్ ద్వారా నీటిని ముందుగా నార్లాపూర్ రిజర్వాయర్‌కు, డెలివరీ సిస్టమ్ ద్వారా నీరు చేరుకున్న అనంతరం అక్కడినుంచి ఇదే ఎత్తిపోతల పథకంలోని ప్యాకేజీ 4, 5కు పంపించనున్నట్టు అధికారులు తెలిపారు. డెలివరీ సిస్టమ్‌లో 4 పంపులు సిద్ధంగా ఉండగా, మరో 4 పంపులు కూడా నీటి ఎత్తిపోతకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి ప్యాకేజీ 2, 3, 4 ద్వారా ఏదుల పంప్‌హౌస్‌కు సాగునీటిని అందించడంలోని ఇబ్బందులు, ప్రస్తుత పరిస్థితులను సీఎం పరిశీలించారు. ఎంజీకేఎల్‌ఐ పంప్‌హౌస్‌ను కూడా పరిశీలించారు.

మూడు నెలల్లో పూర్తి చేయాలి: సీఎం

నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామం వద్ద ఉన్న వట్టెం పంప్‌హౌస్ (లిఫ్ట్-3)ను సీఎం సందర్శించారు. అక్కడ జరిగిన పనులను పరిశీలించారు. టన్నెల్‌లో ప్రయాణించి.. పంప్‌హౌస్‌లను పరిశీలించి అక్కడి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాజెక్టు కోసం 2020-23 సంవత్సరం నాటికి రూ.3,300 కోట్లు ఖర్చు చేయగా, 2023 నుంచి ఇప్పటివరకు రూ.800 కోట్లు ఖర్చుచేసినట్టు అధికారులు రేవంత్‌కు వివరించారు. మిగతా సివిల్ పనులను రూ.90 కోట్లతో వచ్చే 3నెలల్లో పూర్తి చేయనున్నట్టు తెలిపారు. పనులు త్వరగా చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఉదయం 10:50 గంటలకు నార్లాపూర్ వద్ద ప్రారంభమైన సీఎం ప్రాజెక్టు పరిశీలన మధ్యాహ్నం 12:50వరకు కొనసాగింది. అనంతరం వట్టెం రిజర్వాయర్‌ను గంటపాటు పరిశీలించి ఉద్దండాపూర్ బహిరంగ సభకు తరలివెళ్లారు.

సహకరించని ప్రకృతి!

మహబూబ్‌నగర్ (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/జడ్చర్ల టౌన్, జూన్ 5: సీఎం రేవంత్ ఉమ్మడి పాలమూరులో చేపట్టిన ప్రాజెక్టుల పరిశీలన కార్యక్రమానికి ప్రకృతి సహకరించలేదు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ఆవిష్కరించిన కేసీఆర్ ఇంజినీరింగ్ అద్భుతాన్ని చూడలేక కుళ్లుకుంటున్న కాంగ్రెస్ నేతలపై ప్రకృతి కూడా కన్నెర్ర చేసిందని జనం గుసగుసలాడుకున్నారు. గాలివాన ధాటికి ఉద్దండాపూర్ రిజర్వాయర్ సమీపంలో టెంట్లు కుప్పకూలాయి. కుర్చీలు ఎగిరిపోయాయి. జడ్చర్ల బహిరంగ సభలో కూడా వేసిన కుర్చీలన్నీ చిందరవందరయ్యాయి. భారీ ఫ్లెక్సీలన్నీ నేలకూలాయి. కేవలం అరగంటలోనే సీఎం పర్యటించే ప్రాంతాలు అతలాకుతలం అయిపోయాయి.

పాలమూరు లిఫ్ట్‌కు ఏపీ నుంచి ఎన్వోసీ తెస్తా

డిసెంబర్‌లోపు ప్రాజెక్టు అనుమతులు సాధిస్తా • త్వరలో శుభవార్త అందిస్త: రేవంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జూన్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : డిసెంబర్‌లోపు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు, 90 టీఎంసీలకు వాళ్లమీద ఒత్తిడి తెచ్చైనా, కొట్లాడైనా ఆంధ్రప్రదేశ్ నుంచి ఎన్వోసీ తెచ్చే బాధ్యత నాది' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గం ఉద్దండాపూర్‌లో నిర్వహించిన 'ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక' బహిరంగ సభ, భూత్పూర్ మండలం కరివెనలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ డిండి ప్రాజెక్టుకు 20-30 టీఎంసీలకు అనుమతి తెచ్చే బాధ్యత కూడా తనదేనని తెలిపారు. జూరాల దగ్గర కొత్త రిజర్వాయర్ కట్టుకొని, కర్ణాటక-మక్తల్ సరిహద్దులో బ్రిడ్జి కం బరాజ్‌లు, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, నారాయణపేట, మక్తల్ ఎత్తిపోతల పథకాలకు గ్రీన్ చానల్‌లో నిధులు ఇస్తానని చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు చంద్రబాబు ఎన్వోసీ ఇస్తే బనకచర్లపై ఆలోచిస్తామంటూ చీకటి ఒప్పందాన్ని కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. పైగా అది తెలంగాణకు శుభవార్తగా అభివర్ణించారు. 'గోదావరి నదీ జలాల్లో 968 టీఎంసీల వాటా మనకున్నది. ఆంధ్రాకు 516 టీఎంసీల వాటా ఉన్నది. కృష్ణానదిలో బచావో ట్రిబ్యూనల్ ఇష్యూ ఉన్నది. కాబట్టి ఇప్పుడు ఏ రాష్ట్రానికి ఎన్ని నీళ్లు అనేది ఇంకా అలాట్ కాలేదు.. కేసీఆర్ కృష్ణానదిలో 299 టీఎంసీలు మేం తీసుకుంటం.. 512 టీఎంసీలు మీరు తీసుకోండని మరణ శాసనం రాసిండు' అని అబద్ధాలు చెప్పారు.

ఏం చేసుకుంటరో మనకెందుకు?

'మనం వాడుకున్న తర్వాత సముద్రంలోపోయే నీళ్లే లెక్క.. అప్పుడు మిగిలిన దాని గురించి చర్చిస్తాం. ఏపీ వాళ్లు గోదావరి నుంచి తీసుకువచ్చి బనకచర్లలో పోసుకుంటరా? నల్లమల సాగర్‌లో పోసుకుంటరా? అనేది మన సమస్య కాదు' అని రేవంత్‌రెడ్డి చెప్పారు. 'పక్కింట్లో కోడిని కోసుకున్నరా? కుందేలు కోసుకున్నరా.. మనకెందుకు? మనకు పప్పన్నం అన్న సక్కగుందా? లేదా చూసుకోవాలె..' అని కోడికూర భాష్యం చెప్పారు. 'పాలమూరు ప్రాజెక్టుకు నాటి ప్రభుత్వం రూ.27 వేల కోట్లు ఖర్చు చేసింది.. పంపులలో లిఫ్ట్‌లకు ఇంత ఖర్చు పెడితే కేసీఆర్ ఇంట్లో కనక వర్షం కురుస్తది కాబట్టి ఖర్చు చేసింద్రు' అని అభాండాలు వేశారు. 'పంపులు, లిఫ్ట్‌లల్ల వేల కోట్ల రూపాయల కమీషన్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వకుండా ఎక్కడికక్కడ వదిలేసి పోయింద్రు.. భూ సేకరణ కూడా చేయలేదు' అని అబద్ధాలు వల్లెవేశారు. '17 ఏండ్లుగా రాజకీయ నాయకుడిగా పనిచేసినా జిల్లాలో పరిస్థితిపై పూర్తి అవగాహన వచ్చేందుకు రెండేండ్లయింది' అంటూ అన అసమర్థతను బయటపెట్టుకున్నారు.

ప్రాజెక్టుల మీద అప్పునకే 84,503 కోట్లు కట్టిండు

పదేండ్లలో కేసీఆర్ ప్రాజెక్టుల మీద చేసిన అప్పు, అసలు కలిపి మొత్తం రూ.84,503 కోట్లు కడితే మేం అధికారంలోకి వచ్చాక ఈ 30 నెలల్లో కేసీఆర్ చేసిన అప్పునకు మోయలేనంత భారం పడింది' అని రేవంత్‌రెడ్డి మళ్లీ పాతపాటే పాడారు. 'పాలమూరు అంచనా వ్యయం రూ.55 వేల కోట్లు.. వాళ్లు ఖర్చు చేసింది కేవలం రూ.27 వేల కోట్లు.. కనీసం సగం కూడా ఖర్చు చేయకుండా ప్రాజెక్టు 90 శాతం పూర్తయ్యిందని అబద్ధాలు చెప్తున్నరు.. కేవలం 45 నుంచి 47 శాతం ఖర్చుపెట్టి 90 శాతం పనులు ఎలా పూర్తి చేశారో నాకైతే తెల్వదు. 'సంపులు, గోడలు కట్టుకోకుండా కరెంటు వైర్లు కొనుక్కుంటే ఇంట్లో లైట్లు వెలుగుతయా? ఎందుకు ఎలక్ట్రికల్ వర్కులు చేశారంటే దానిమీద 20 శాతం, 30 శాతం కమీషన్లు వస్తాయని వాటిని మొదలుపెట్టింద్రు. ప్రాజెక్టుల విషయంలో ముందుగా ఎలక్ట్రికల్ వర్క్ చేయడం వెనుక ఉద్దేశం ఏమిటో తెల్వది' అంటూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేశారు. 'మహారాష్ట్ర సీఎం చర్చలకు రమ్మంటే పారిపోతున్నడు. మర్యాదగా మహారాష్ట్ర ముఖ్యమంత్రిని చర్చలకు పట్టుకు రండి. లేదంటే బీజేపీ ఎంపీలను తరిమే రోజు వస్తది' అని హెచ్చరించారు. 'గోదావరి జలాల మీద తమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్టు కట్టి.. వంద టీఎంసీల నీళ్లు తీసుకొచ్చి.. శ్రీపాద ఎల్లంపల్లిలో పోసి రైతుల కష్టాలు తీర్చుతాం' అని చెప్పారు. 'నీళ్లంటే కేసీఆర్.. కేసీఆర్ అంటే నీళ్లు.. కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు.. ప్రాజెక్టుల విషయంలో డైవర్షన్స్ స్కీమ్ మొదలుపెట్టిందని ఆరోపణలు ఉన్నాయి' అని ఓ విలేకరి ప్రశ్నించగా 'కేసీఆర్ అంటే నీళ్లు అంటే నేను ఒప్పుకోను గానీ కేసీఆర్ అంటే సారా.. సోడా అంటే ఒప్పుకొంటా' అని రేవంత్‌రెడ్డి బదులిచ్చారు. 'కర్ణాటకలో కొత్త సీఎం వచ్చారు. ఇక్కడ మీ పదవీ కాలం మరో రెండేండ్లే ఉన్నది. కృష్ణాలో నీటివాటాకు ఎలా సమన్వయం చేసు కుంటారు?' అని ఓ విలేకరి ప్రశ్నిచంగా రేవంత్‌రెడ్డి నోరు మెదపలేదు.

లోకం పోకడ



ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	43.5°c	24.2°c
రంగారెడ్డి	40.2°c	23.2°c
ఖమ్మం	40.0°c	28.0°c
వరంగల్	40.0°c	27.0°c
నిజామాబాద్	38.4°c	24.3°c
నల్లగొండ	39.5°c	23.4°c
కరీంనగర్	39.0°c	30.0°c
మెదక్	37.2°c	24.2°c
హైదరాబాద్	36.6°c	27.0°c
మహబూబ్‌నగర్	36.0°c	27.0°c


పాలమూరు గడ్డ సాక్షిగా రేవంత్ పచ్చి అబద్ధాలు

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



హైదరాబాద్, జూన్ 5 (నమస్తేతెలంగాణ): పాలమూరు గడ్డ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు మాట్లాడారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో పాలమూరు ప్రాజెక్టుకు రూ. 35, 200కోట్లు ఖర్చుచేసింది నిజంకాదా? గతంలో ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా కేసులు వేసింది కాంగ్రెస్ కాదా? ప్రాజెక్టు కాల్వల టెండర్లు రద్దు చేయడంతో రూ. 4 వేల కోట్ల భారం పెరిగింది వాస్తవంకాదా? అంటూ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రశ్నాస్త్రాలు సంధించారు. పాలమూరు-రంగారెడ్డికి గత సర్కారు రూ. 27 వేల కోట్లు ఖర్చుచేసిందని రేవంత్‌రెడ్డి స్వయంగా ఒప్పుకున్నారన్నారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం చేసిన అప్పులకు వడ్డీ, అసలు కలిపి రూ. 52,121 కోట్లు చెల్లించామని చెబుతున్న సీఎం ఇందుకు సంబంధించిన వివరాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కమీషన్ల కోసమే పాలమూరు పంపులు, లిఫ్ట్‌లు పూర్తి చేశారని చెప్పడం ఆయన అవగాహనరాహిత్యానికి నిదర్శనమని దెప్పిపొడిచారు.

పిడుగుపడి ఏఆర్ కానిస్టేబుల్ మృతి



రాజు (ఫైల్)

ఉప్పునుంతల, జూన్ 5 : పిడుగుపడి ఏఆర్ కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం మామిళ్లపల్లి సమీపంలో చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. వంగూరు మండల ఉల్పర గ్రామానికి చెందిన సుద్దమోని రాజు(35) నాగర్‌కర్నూల్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గురు,శుక్రవారాలు సోమశిల వద్ద సీఎం బందోబస్తుకు వెళ్లి సొంత గ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలో మామిళ్లపల్లి సమీపంలో వద్ద కారు ఆపి మల విసర్జనకు వెళ్లగా అకస్మాత్తుగా పిడుగుపడటంతో కానిస్టేబుల్ అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనకు భార్య సువర్ణ, ఇద్దరు పిల్లలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఉప్పునుంతల పోలీసులు కేసు నమోదు చేశారు.

బాల్క సుమన్ కేసును ఎందుకు బదిలీ చేశారు?

- పోలీసులను ప్రశ్నించిన కోర్టు

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జూన్ 5 (నమస్తే తెలంగాణ): చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్‌పై నాంపల్లి పోలీసులు నమోదు చేసిన కేసును బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు ఎందుకు బదిలీ చేశారని జడ్జి శుక్రవారం పోలీసులను ప్రశ్నించారు. దీనిపై కౌంటర్ దాఖలుకు సమయం కావాలని బంజారాహిల్స్ పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టును కోరారు. అంతకుముందు సుమన్ తరఫున న్యాయవాది జీ కిరణ్‌కుమార్ వాదన వినిపిస్తూ.. ఈ కేసు బదిలీపై అభ్యంతరం వ్యక్తం చేశారు. సింగరేణి భవన్ నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నందున సంబంధిత అధికారి ఆనంద్ ఫిర్యాదు మేరకు నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేశారని, గత నెల 30న అరెస్టయిన సుమన్‌కు కోర్టు 14 రోజులు రిమాండ్ విధించడంతో ప్రస్తుతం ఆయన చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా కొనసాగుతున్నారని వివరించారు. ప్రస్తుతం సుమన్ బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేయడంతో పోలీసులు ఉద్దేశపూర్వకంగానే కేసు బదిలీ అంశాన్ని తెరమీదికి తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్టుగా చెప్తున్న తెలంగాణ భవన్ బంజారాహిల్స్ పీఎస్ పరిధిలో ఉన్నందున ఈ కేసును బదిలీ చేయాలని పోలీసులు కోరడం సమంజసం కాదని, ఈ కేసు నుంచి తొలగించిన కొన్ని సెక్షన్లను మళ్లీ జోడించడం చట్టవ్యతిరేకమని పేర్కొన్నారు. అనంతరం ఈ వ్యవహారంపై కౌంటర్ దాఖలు చేయాలని బంజారాహిల్స్ పోలీసులను ఆదేశించిన న్యాయమూర్తి.. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

కృష్ణాజలాలను సైతం మింగుతున్న 'బనకచర్ల' బాబు

తెలంగాణ చుట్టూ పురి విప్పుతున్న జల కుట్రలు

దక్షిణ తెలంగాణకు కాంగ్రెస్ ఉరి!



80వేల కోట్ల ప్రాజెక్టు కోసం ఏపీ సీఎం కీలుబొమ్మలాట

తెలంగాణకు తీరని ద్రోహం చేస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం

బీఆర్‌ఎస్, 'నమస్తే' పోరాటంతో కొంతకాలం మౌనం

- 'పాలమూరు'కు చంద్రబాబు ఎన్‌వోసీ ఇస్తాడని కేంద్రం ప్రతిపాదన
- ఒప్పందం చేసుకొన్న కాంగ్రెస్ ప్రభుత్వం.. 'శుభవార్త' అంటూ డ్రామా
- ఉమ్మడి పాలమూరు జిల్లాను ఎడారిగా మార్చే కుతంత్రం
- బనకచర్ల ఒప్పందానికి తెర వెనుక వేగంగా కదులుతున్న పావులు
- కర్ణాటకలో బ్యారేజీ-కమ్-బరాజ్‌ల నిర్మాణానికి తెలంగాణ ఒప్పందం
- కర్ణాటకలో కీలక అనుమతుల సాధనకు పరోక్షంగా బాబు సహకారం
- ఇదే జరిగితే ఉమ్మడి పాలమూరు ప్రాజెక్టులన్నీ ఒట్టిపోయే ప్రమాదం

హస్తిన కేంద్రంగా గుట్టుచప్పుడు కాకుండా బనకచర్లకు మార్గం సుగమం చేసేందుకు కేంద్రంతో కలిసి చంద్రబాబు జలకుట్రలు. బనకచర్లకు తెలంగాణ గ్రీన్‌సిగ్నల్ ఇస్తే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నీటి కేటాయింపులకు ఏపీ ఎన్‌వోసీ ఇస్తుందంటూ కేంద్రం లీకులు.

ముఖ్యమంత్రి మారారు.. మంత్రివర్గం ఇంకా కుదురుకోలేదు.. అందునా ఒక మంత్రి రాజీనామా చేయడంతో రాజకీయ ప్రకంపనలు. అయినా తెలంగాణతో కలిసి తుంగభద్ర, భీమా ఉపనదులపై బ్యారేజీ-కమ్-బరాజ్‌లు కట్టేందుకు కర్ణాటక ప్రభుత్వం హడావుడి.

రెండున్నరేండ్లపాటు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పడావుపెట్టి, తట్టెడు మట్టి ఎత్తని కాంగ్రెస్ ప్రభుత్వానికి అకస్మాత్తుగా పాలమూరుపై ప్రేమ. కర్ణాటకతో చర్చలు కొలిక్కి రాకుండానే బ్యారేజీ-కమ్-బరాజ్‌లపై ఏరియల్ సర్వే. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు చంద్రబాబు ఎన్‌వోసీ ఇస్తే బనకచర్లపై ఆలోచిస్తామంటూ ముఖ్యమంత్రి ప్రకటన. తెలంగాణకు అదో శుభవార్తగా అభివర్ణన.

(గుండాల కృష్ణ - మ్యాకం రవికుమార్)

తెలంగాణకు ప్రాణ, జీవధారలైన కృష్ణా-గోదావరి జలాల్లో అసలేం జరుగుతున్నది? కేసీఆర్ హయాంలో రూపుదిద్దుకొన్న కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల వైపు రెండున్నరేండ్లుగా కన్నెత్తిచూడని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గత కొన్నిరోజులుగా ఆ ప్రాజెక్టుల గురించి ఎందుకు హడావుడి చేస్తున్నది? ప్రజలు ఇచ్చిన అధికార గడువులో సగం కాలం ఏ ఒక్క ప్రాజెక్టులోనూ ఇటుక పేర్చని కాంగ్రెస్.. ఇప్పుడు ఏకంగా ప్రాజెక్టులను పూర్తి చేస్తానంటూ ఆర్భాటపు ప్రకటనలు ఎందుకు చేస్తున్నది? మరోవైపు తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి ఏ ఒక్కనాడూ ఆల్మట్టి ఎత్తు పెంపుగానీ తుంగభద్ర, భీమా ప్రాజెక్టుల వైపు తొంగిచూడని కర్ణాటక ప్రభుత్వం కొన్నిరోజులుగా ఒకటెనక మరొక ప్రతిపాదనలను తెరపైకి ఎందుకు తెస్తున్నది? రాష్ట్రంలో 90శాతం పూర్తయిన ప్రాజెక్టుల్లో.. మిగిలిన 10 శాతం పనులు కూడా పూర్తి చేయని తెలంగాణ ప్రభుత్వం కర్ణాటకతో కలిసి బరాజ్‌లు కట్టేందుకు ఎందుకు ఉవ్విళ్లూరుతున్నది? పాలమూరు పాదయాత్ర చేస్తామని బీఆర్‌ఎస్ చెప్పడంతో నిన్నటిదాకా బనకచర్లపై మౌనం వహించి, ఇప్పుడు ఏపీ ఎన్‌వోసీ ఇస్తే బనకచర్లకు అంగీకరిస్తామంటూనే త్వరలో శుభవార్త వింటారనే సంకేతాలు ఎందుకు ఇచ్చారు? అత్యంత కీలకమైన అంశం.. కృష్ణాలో 750 టీఎంసీలు సాధిస్తామంటూ బీరాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం.. బ్రిజేశ్ ట్రిబ్యునల్ విచారణ ముగింపు దశలోకి వచ్చిన ఈ తరుణంలో నీటి కేటాయింపులపై ఆంధ్రప్రదేశ్‌తో ఒప్పందానికి ఎందుకు సిద్ధమైంది?

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హస్తిన వేదికగా రచించిన బనకచర్ల జలకుట్రల గుట్టు విప్పితేనే వీటన్నింటికీ సమాధానాలు దొరుకుతాయి. మోదీ ప్రభుత్వం జుట్టు తన చేతుల్లో ఉన్నందున రూ.80 వేల కోట్ల బనకచర్ల ప్రాజెక్టుకు వీలైనంత త్వరగా అనుమతులు, నిధులు తెచ్చుకోవాలనే సంకల్పంతో చంద్రబాబు ఆడుతున్న కీలుబొమ్మలాటలో భాగంగానే ఈ పరిణామాలన్నీ చోటుచేసుకుంటున్నాయి. నిన్నటిదాకా బనకచర్లతో గోదావరి జలాలకు మాత్రమే ఎసరు పెడుతున్నారని అనుకొంటే, ఇప్పుడు కృష్ణాజలాలను పణంగా పెట్టే దుస్సాహసానికి ఒడిగట్టారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఊపిరిపోసే జూరాల, శ్రీశైలం జలాశయాలకు చుక్క నీరు రాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక తయారుచేసిన ప్రతిపాదనలకు తెలంగాణ ప్రభుత్వం సహకరిస్తున్నది. నోటితో నవ్వి.. నుదుటితో వెక్కిరించినట్టు! పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు 90 టీఎంసీల అనుమతుల్ని సాధిస్తున్నామనే అశాస్త్రీయ, అనాలోచిత, అవగాహనా రాహిత్య సాకుతో ఏకంగా దక్షిణ తెలంగాణకు ఉరి వేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రంగం సిద్ధంచేసింది.

కర్ణాటకను సంతృప్తిపరిచే పనిలో రేవంత్ సర్కార్?

చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టుకు ఎగువన ఉన్న తెలంగాణతోపాటు కర్ణాటక ప్రభుత్వ అనుమతి కూడా ముఖ్యమే. కానీ అక్కడ ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం. కేంద్రంలోని బీజేపీ సర్కార్ నేరుగా సంప్రదింపులకు దిగి ఒప్పించే పరిస్థితి లేదు. ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు కూడా ఆ దిశగా నేరుగా ప్రయత్నాలు చేసే అవకాశం లేదు. అందుకే రేవంత్‌రెడ్డిని రంగంలోకి దించారనే ప్రచారం జరుగుతున్నది. బనకచర్లకు కర్ణాటక అనుమతి ఇవ్వాలంటే ఆ రాష్ట్రానికి తాయిలాలు ఇచ్చే ప్రక్రియ కొనసాగుతున్నట్టు తెలుస్తున్నది. అందులో భాగంగా గోదావరి-కావేరి అనుసంధాన ప్రాజెక్టులో కర్ణాటక వాటా 16 టీఎంసీల గోదావరి జలాలకు బదులుగా ఆ రాష్ట్రం బెడ్తి-హీరెవడ్డెటి లింక్ కింద 16 టీఎంసీల తుంగభద్ర జలాలు వాడుకొనేందుకు కేంద్రం నుంచి అనుమతులు ఇస్తారు. ఆల్మట్టి ఎత్తు పెంచుకొనేందుకు కర్ణాటక ప్రభుత్వం భూసేకరణ చేస్తున్నది. కానీ బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్-2 అవార్డు అమలుపై సుప్రీంకోర్టు స్టే కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో భాగస్వామ్య రాష్ట్రాలను ఒప్పించేందుకు కేంద్రం చర్యలు తీసుకొంటున్నది. ఇప్పటికే ఒకసారి రాష్ట్రాలతో సమావేశాన్ని కూడా నిర్వహించింది. ఇక.. తుంగభద్ర జలాల అదనపు వినియోగంతోపాటు భీమా జలాల వినియోగం కోసం బ్యారేజీ-కమ్-బరాజ్‌లకు తెలంగాణ సహకారం కావాల్సి ఉన్నది. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అదే చేస్తున్నది. ఇందులో కొన్ని నిర్మాణాల వల్ల తుమ్మిళ్ల, జూరాల ఆయకట్టుకు గడ్డుకాలం వచ్చే ప్రమాదం ఉన్నదని సాగునీటిరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అనాలోచితంగా ముందుకుపోతున్నది. వీటన్నింటి వెనుక చంద్రబాబు బనకచర్ల తంత్రమే ఉన్నదనేది బహిరంగ రహస్యంగా పలువురు అభివర్ణిస్తున్నారు.

కుట్రలను ముందే చెప్పిన 'నమస్తే'

ఏపీ సీఎం రగిలించిన బనకచర్ల చిచ్చుపై తెలంగాణ సమాజం ఒక్కసారిగా కన్నెర్ర జేయడంతో తెరమీద హడావుడి తగ్గింది. కానీ గుట్టుచప్పుడు కాకుండా బాబు బృందం ఢిల్లీ వేదికగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నది. మరోవైపు రెండున్నరేండ్లుగా అటు కాళేశ్వరం, ఇటు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల్ని పడావు పెట్టిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొంతకాలంగా హడావుడి మొదలుపెట్టింది. మేడిగడ్డ బరాజ్ మరమ్మతులు చేస్తామని ప్రకటించి, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై వరుస సమీక్షలు నిర్వహించింది. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రాజెక్టును పరిశీలించారు. దీనికి కొనసాగింపుగా పచ్చ మీడియాలో లీకుల కథనాలు పురుడు పోసుకున్నాయి. బనకచర్లకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇస్తే, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 88 టీఎంసీలతో చంద్రబాబు పచ్చజెండా ఊపేలా కేంద్ర జలసంఘం ఆఫర్ ఇచ్చిందని, ఇందుకు రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు సూత్రప్రాయంగా అంగీకరించాయనేది ఆ కథనాల సారాంశం. దీంతో ఈ కుట్రల గుట్టును విప్పుతూ 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలు ఇచ్చింది. బనకచర్లకు మార్గం సుగమం చేసేందుకే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అకస్మాత్తుగా ప్రాజెక్టులపై ప్రేమ ఒలకబోసిందని ప్రజల ముందు ఉంచింది. దీనిపై ప్రభుత్వ పెద్దలెవరూ నోరు విప్పలేదు. అయితే పాలమూరు-రంగారెడ్డి పథకం పనుల పరిశీలన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా 'నమస్తే' కథనం వాస్తవమని నిర్ధారించే వ్యాఖ్యలు చేశారు. త్వరలో శుభవార్త వింటారని చెప్పారు. అంటే తెలంగాణకు దక్కాల్సిన 200 టీఎంసీల గోదావరి జలాలను బనకచర్ల రూపంలో చంద్రబాబు తన్నుకుపోయేందుకు మోదీ ప్రభుత్వం ఆధ్వర్యంలో రంగం సిద్ధమైందనేది స్పష్టమవుతున్నది.

'పాలమూరు'కు వచ్చే అదనపు మేలేంటి?

సీఎం రేవంత్‌రెడ్డి తాజా పర్యటనలో చెప్పిన ప్రకారమే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా శ్రీశైలం జలాశయం నుంచి నీటిని ఎత్తిపోసేందుకు కనీసం మరో ఏడాది పడుతుందనేది స్పష్టమైంది. అన్నీ అనుకూలిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తే ఉద్దండాపూర్ దాకా కృష్ణాజలాలు వస్తాయి. ఈ నేపథ్యంలో బనకచర్లకు తలూపితే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి వచ్చే అదనపు ప్రయోజనం ఏమిటని సాగునీటిరంగ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణాజలాల పునఃపంపిణీ కోసం బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ కొనసాగుతున్నది. కృష్ణాలో తెలంగాణకు 750 టీఎంసీల కేటాయింపులు సాధిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అనేకసార్లు ప్రకటించారు. మరో ఏడాదిలో ట్రిబ్యునల్ విచారణ ముగిసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ట్రిబ్యునల్ కేటాయింపులు జరిగిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వమే ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు చేసుకోవచ్చు. అందులో భాగంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 90 కాకపోతే భవిష్యత్తులో పెరిగే తాగు, సాగునీటి అవసరాలకు అనుగుణంగా 120 టీఎంసీలు కేటాయించుకొనే స్వేచ్ఛ, వెసులుబాటు ఉంటుంది. కానీ ఇప్పటికిప్పుడు చంద్రబాబు ఆడించినట్టు ఆడుతూ పాలమూరు-రంగారెడ్డికి 90 టీఎంసీల అనుమతికి ఏపీ నుంచి ఎన్‌వోసీ తీసుకొంటే, ఆ ఎన్‌వోసీని ఏపీ ప్రభుత్వం బ్రిజేశ్ ట్రిబ్యునల్ ముందు పెట్టే ప్రమాదం ఉన్నది. తద్వారా పాలమూరు ప్రాజెక్టును కేవలం 90 టీఎంసీలకే పరిమితం చేయడంతో భవిష్యత్తులో కేటాయింపుల్ని పెంచుకొనే అవకాశం చేజారిపోతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టుల వారీగా కేటాయింపుల ప్రక్రియను మనం చేజేతులా ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చినట్టవుతుందని ఆవేదన చెందుతున్నారు.

చంద్రబాబు రూపొందించిన ప్రతిపాదనలు

'సమ్మక్క బరాజ్ దగ్గర తెలంగాణ 47 టీఎంసీల నీటి హక్కును వదులుకోవాలి. గోదావరి-కావేరిలో ఏపీకి హక్కుగా వచ్చే 45 టీఎంసీలు, కర్ణాటక వాటా 16 టీఎంసీలు (ఇందుకు బదులుగా కర్ణాటకకు బెడ్తి-హీరెవడ్డెటి లింకు కింద 16 టీఎంసీల సర్దుబాటు), ఏ రాష్ట్రం వాడుకోని 15 టీఎంసీలు, తమిళనాడు వాటా మరో 44 టీఎంసీలు... ఇలా మొత్తం 167 టీఎంసీలను గోదావరి-కావేరి అనుసంధాన ప్రాజెక్టుకు కేటాయిస్తారు. 'గోదావరి-కావేరి అనుసంధాన ప్రాజెక్టులో భాగంగా సమ్మక్క బరాజ్ (తుపాకులగూడెం) నుంచి 47 టీఎంసీల గోదావరి జలాలను నాగార్జునసాగర్ జలాశయానికి తరలిస్తారు. ఆ నీటిని ఆంధ్రప్రదేశ్ వాడుకొంటుంది. సమ్మక్క బరాజ్ దగ్గర 47 టీఎంసీల గోదావరి జలాలను తెలంగాణ వదులుకొంటున్నందున పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో 43 టీఎంసీలకు చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ ఇస్తారు. మైనర్ ఇరిగేషన్‌లో ఆదా చేసిన మరో 45 టీఎంసీలను పాలమూరు-రంగారెడ్డికి కేటాయించేందుకు ఏపీ ఎన్‌వోసీ ఇస్తుంది.

చివరి దశలో ఇలా..

తెలంగాణ ఉద్యమంలో అత్యంత కీలకమైన అంశం కృష్ణాజలాల్లో జరిగిన అన్యాయం. అందుకే కృష్ణాజలాల్లో తెలంగాణ కేటాయింపుల్ని పెంచుకునేందుకు కేసీఆర్ ప్రభుత్వం మోదీ ప్రభుత్వంపై ఏండ్ల తరబడి ఒత్తిడి తెచ్చి, సుప్రీంకోర్టు దాకా వెళ్లి కొట్లాడింది. చివరికి బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ రూపంలో న్యాయమైన వాటా దక్కుతుందనే ఆశాభావంతో తెలంగాణ సమాజం ఉన్నది. పదేండ్లపాటు కేసీఆర్ ప్రభుత్వం సమర్థ వాదనలు వినిపించింది. కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని కొనసాగిస్తున్నది. పుష్కరకాలంగా సాగుతున్న ట్రిబ్యునల్ విచారణ చివరి అంకానికి వచ్చింది. 750 టీఎంసీల కేటాయింపుల్ని సాధిస్తామంటూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటన చేసింది. ఇలాంటి క్లిష్టమైన సమయంలో ఆంధ్రప్రదేశ్‌తో రాజీ పడటమనేది డేంజర్‌గేమ్‌గా సాగునీటి రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాలమూరు-రంగారెడ్డికి 90 టీఎంసీల కేటాయింపులకు ఏపీ ఎన్‌వోసీ ఇస్తే, ఆ పత్రాన్ని ట్రిబ్యునల్ ముందు ఉంచుతుంది.

తద్వారా ట్రిబ్యునల్ విచారణ కొనసాగుతున్న సమయంలో రెండు రాష్ట్రాలు ఒప్పందాలు చేసుకొంటే ఇక మాకేం పని అని బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ చేతులెత్తేసి! మిగిలిన జలాలపైనా ఇదేరీతిలో రాజీ చేసుకోవాలంటూ ఉచిత సలహా పడేస్తే!! దశాబ్దాలుగా తెలంగాణ సమాజం కన్నకలలు, పెట్టుకొన్న ఆశలకు సమాధి కట్టినట్టు కాదా! అని నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ట్రిబ్యునల్ ముందు వాదనలు వినిపించి కేటాయింపుల్ని సాధించుకోవడమనేది రాజ్యాంగం ఇచ్చిన హక్కు తప్ప.. అది పొరుగు రాష్ట్రంతో పెట్టుకొనే కయ్యం కాదు.. శాస్త్రీయ వాదనలతో వాటాలు సాధించాలే గానీ ఇలా తాత్కాలిక ఒప్పందాలతో శాశ్వత ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని సాగునీటిరంగ నిపుణులు ఒకరు వివరించారు.

ట్రిబ్యునల్ మనుగడ ఎలా సాధ్యం?

బచావత్ అవార్డు మేరకు గోదావరి జలాల్లో ఏపీకి వచ్చే వాటాల ప్రకారం ఆ రాష్ట్రం ఇప్పటికే సంపూర్ణంగా ప్రాజెక్టుల్ని కట్టుకొన్నది. వినియోగం కూడా దాదాపుగా అదేస్థాయిలో ఉన్నదని ఇంజినీర్లు చెప్తున్నారు. అంటే బనకచర్లకు తెలంగాణ అంగీకరించినట్టయితే కేంద్రం 200 టీఎంసీల నికరజలాలను కేటాయిస్తుంది. అంటే గోదావరిలో ఏపీ కేటాయింపుల పరిమాణం 516 నుంచి 716 టీఎంసీలకు పెరుగుతుంది. ఈ క్రమంలో తెలంగాణ వాటా కూడా పెరుగాలి. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం స్వయంగా తమకు గతంలో కేటాయించిన 968 టీఎంసీలు ఉంటే చాలు! అని అంగీకరిస్తున్నది. దీంతో ట్రిబ్యునల్ అవార్డు చేసిన కేటాయింపులకు విఘాతం కలిగి.. బచావత్ అవార్డు మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. అంతేకాదు.. దేశంలో ఎక్కడాలేని విధంగా, చివరకు అంతర్జాతీయ జల ప్రమాణాలకూ అంతుబట్టని సముద్రంలో కలిసే జలాల వినియోగం అని చంద్రబాబు ప్రతిపాదిస్తే, తాజాగా శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ సైతం దానినే పునరుద్ఘాటించింది. మరి అదే నిజమైతే... గోదావరి బేసిన్‌లోని మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, ఒడిశా వంటి రాష్ట్రాలు కూడా మున్ముందు సముద్రంలో వేల టీఎంసీలు కలుస్తున్నందున అందులో కొంత తాము వాడుకొంటామంటూ ప్రాజెక్టులకు అనుమతులు కోరుతారు. అంతెందుకు.. గోదావరి-కావేరీ అనుసంధానం అంటూ హడావుడి చేస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ఇదే ప్రాతిపదికన రేపు వందల టీఎంసీల గోదావరి జలాల్ని తమిళనాడుకు మళ్లించేందుకు బనకచర్ల ఒక ప్రాతిపదిక అవుతుంది. సముద్రంలో కలిసే జలాల సూత్రానికి ఇప్పుడు తెలంగాణ తలూపితే... రేపటినాడు ఇతర రాష్ట్రాలు సుప్రీంకోర్టుకు వెళ్లి దీనిని ఒక ఉదాహరణగా చూపుతాయి. ట్రిబ్యునల్స్ ముందు వాదనల్లోనూ దీనిని వాడుకొంటే తదుపరి పరిణామాలకు బాధ్యులెవరు? అని సాగునీటిరంగ నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

తెలంగాణకు వచ్చేదెంత? పోయేదెంత??

తెలంగాణకు వచ్చేది: కేవలం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 88-90 టీఎంసీల నీటి కేటాయింపులకు ఏపీ సీఎం చంద్రబాబు ఎన్‌వోసీ ఇస్తారు. ఈ కేటాయింపులు తెలంగాణకు కృష్ణాజలాల్లో ఉండే హక్కుకు లోబడే ఉంటాయి. కానీ అదనపు కేటాయింపులు కావు.

తెలంగాణకు పోయేవి: గోదావరి జలాల్లో భాగంగా సమ్మక్క బరాజ్ వద్ద 47 టీఎంసీల హక్కును వదులుకోవాలి. పైగా సమ్మక్క బరాజ్ నుంచి నేరుగా నాగార్జునసాగర్‌కు గోదావరి జలాలను తరలిస్తారు. ఆపై ఒకవైపు కేంద్రం గోదావరి-కావేరి అనుసంధాన రూపంలో 167 టీఎంసీలు తరలించుకుపోతుంది. ఆంధ్రప్రదేశ్ బనకచర్ల రూపంలో మరో 200 టీఎంసీల గోదావరి జలాలను తరలించుకుపోతారు.

రేవంత్ సర్కార్ దాగుడు మూతలు!

కర్ణాటక రాష్ట్రంలో చేపడుతున్న ప్రాజెక్టుల అంశంలో తెలంగాణలోని రేవంత్ సర్కార్ దాగుడు మూతలు ఆడుతున్నదని ఇంజినీరింగ్ వర్గాలే విస్మయం వ్యక్తంచేస్తున్నాయి. కర్ణాటక ప్రాజెక్టులపై ప్రతిపాదనలు ఏమిటనేది తెలంగాణ ఇరిగేషన్ శాఖ ఇంజినీర్లకు సైతం తెలియడం లేదు. వాస్తవంగా నదీజలాల హక్కులు, ట్రిబ్యునల్ అవార్డులు, వినియోగం, సమస్యలు తదితర అంశాలపై ఇరిగేషన్ శాఖలో అంతర్రాష్ట్ర నదీజలాల విభాగం ప్రత్యేకంగా ఉన్నది. పొరుగు రాష్ట్రాలు చేపట్టే ప్రాజెక్టుల వల్ల రాష్ట్రానికి వాటిల్లే ప్రమాదాలు, నదీజల ప్రవాహాలపై పడే ప్రభావాలు, అవార్డులకు అనుగుణంగా ఉన్నదా? లేదా? తదితర సాంకేతిక, న్యాయపరమైన అంశాలన్నీ ఆ విభాగం అధికారులే పర్యవేక్షిస్తారు. అభిప్రాయాలను వెల్లడిస్తారు. కానీ, కర్ణాటక ప్రతిపాదించిన బరాజ్‌లకు సంబంధించిన వివరాలేవీ ఆ అధికారులకు తెలియకపోవడం గమనార్హం. ఎన్ని టీఎంసీలతో, ఏ జలహక్కులతో కర్ణాటక ప్రతిపాదిస్తున్నదో? తెలియదని ఇంటర్‌స్టేట్ అధికారులు వెల్లడిస్తున్నారు. ఇంటర్‌స్టేట్ విభాగం అధికారులను రాష్ట్రసర్కార్ పెద్దలు భాగస్వామ్యం చేయకపోవడం గమనార్హం. అధికారులకు తెలియకుండానే, అభిప్రాయాలను తీసుకోకుండానే కర్ణాటక ప్రభుత్వంతో కలిసి చర్చలు చేపట్టింది. ఇటీవల రాష్ట్రంలోని ఓ మంత్రిని ఆహ్వానించడం, తాజాగా ముఖ్యమంత్రి సైతం జిల్లాలో పర్యటించి సర్వేలకు పూనుకోవడంపై అధికారులు సైతం విస్మయం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పుడిదే విషయమై రాష్ట్ర ఇంజినీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాడే వ్యతిరేకించిన బీఆర్‌ఎస్ సర్కార్

కర్ణాటక సర్కార్ ప్రతిపాదనలను ఆదిలోనే నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ద్వంద్వంగా వ్యతిరేకించింది. నావలి రిజర్వాయర్ ప్రతిపాదనలకు అంగీకారం తెలుపాలని కోరుతూ 2022లో అప్పటి కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై అప్పటి సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక లేఖ రాశారు. నావలి రిజర్వాయర్ ప్రతిపాదలను సానుకూలంగా ఆమోదించాలని కోరారు. ఆ రిజర్వాయర్ విస్తరణ తెలంగాణ ప్రయోజనాలకు తీరని నష్టమని, ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోబోమని నాటి బీఆర్‌ఎస్ సర్కార్ కర్ణాటకకు తేల్చిచెప్పింది. తుంగభద్ర బోర్డు సమావేశంలోనే నావలి రిజర్వాయర్ విస్తరణకు కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలను తోసిపుచ్చింది. ట్రిబ్యునల్-2 అవార్డు అమల్లోకి వచ్చేంతవరకూ ఆ ప్రాజెక్టుపై ముందుకు పోవద్దని తేల్చిచెప్పింది. బచావత్ ట్రిబ్యునల్ తుంగభద్రపై అనేక షరతులు విధిస్తూ 230 టీఎంసీలు కేటాయించిందని గుర్తుచేసింది. ట్రిబ్యునల్-2 అవార్డు వచ్చేంతవరకూ తుంగభద్ర బేసిన్‌లో కొత్త ప్రాజెక్టులు చేపట్టొద్దని చెప్పింది. ఏపీ ప్రతిపాదనలనూ తీవ్రంగా వ్యతిరేకించింది. కానీ ఇవేవీ పట్టించుకోకుండా ప్రస్తుతం రేవంత్‌రెడ్డి సర్కార్ ఆ ఒప్పందాల కోసం ఇప్పుడు ఉరకలేస్తుండటం చర్చనీయాంశమైంది.


నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేటలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


నాగర్‌కర్నూల్‌లో మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి ఇంటివద్ద బీఆర్‌ఎస్ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఉమ్మడి పాలమూరులో రెండోరోజూ నిర్బంధకాండ

- నాగర్‌కర్నూల్‌లో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఇంటి వద్ద ఉద్రిక్తత
- బలవంతంగా బీఆర్‌ఎస్ నేతల అరెస్టు
- నిర్బంధాన్ని నిరసిస్తూ తిమ్మాజిపేట గ్రామంలో సీఎం దిష్టిబొమ్మ దహనం
- సీఎం గోబ్యాక్ అంటూ నినాదాలు.. నల్లబ్యాడ్జీలతో రోడ్లపై రాస్తారోకో

నాగర్‌కర్నూల్, జూన్ 5 : ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టుల సందర్శనకు సీఎం రేవంత్‌రెడ్డి రావడంతో.. ఎక్కడ అడ్డుకుంటారేమోనని రెండోరోజూ కూడా అరెస్టుల పర్వం కొనసాగించారు. గురువారం పలువురు నేతలను హౌస్ అరెస్టు చేయడం.. కొందరిని అదుపులోకి తీసుకోగా.. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లాలోని గులాబీ పార్టీ నేతలను ముందస్తుగా అరెస్టు చేసి ఠాణాలకు తరలించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి నివాసం వద్ద పలువురు బీఆర్‌ఎస్, బీఆర్‌ఎస్వీ కార్యకర్తలను అరెస్టు చేసేందుకు పోలీసులు ఏకంగా మినీ వ్యాన్‌తో వచ్చారు. ఈ క్రమంలో నాయకులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. బలవంతంగా అరెస్టు చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొన్నది. 30 మంది కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు కాకుండా 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న తేజ కన్వెన్షన్ హాల్‌లో ఉంచారు. అక్రమంగా నిర్బంధించడంపై బీఆర్‌ఎస్ నాయకులు భగ్గుమన్నారు. అలాగే తాడూరు, బిజినేపల్లి, తిమ్మాజిపేట, తెలకపల్లి మండలాల్లోని బీఆర్‌ఎస్, బీఆర్‌ఎస్వీ, విద్యార్థి సంఘాల నాయకులు వందమందిని పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నేతల నిరసన కొనసాగింది. బీఆర్‌ఎస్ నాయకుడు జోగు ప్రదీప్‌తోపాటు పలువురిని ముందస్తుగా అదుపులోకి తీసుకొని పీఎస్‌కు తరలించారు. విషయం తెలుసుకొన్న వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు మండల కేంద్రానికి చేరుకుని అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి రాస్తారోకో చేపట్టారు. సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎం గోబ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ అరగంటసేపు ఆందోళన చేశారు. పోలీసులు వారిని బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

గూగుల్‌లో మళ్లీ ఉద్యోగాల కోత!

ఏఐలో పెట్టుబడుల కోసం ఉద్యోగులపై వేటు

న్యూఢిల్లీ, జూన్ 5: సెర్చింజన్ దిగ్గజం గూగుల్ మళ్లీ ఉద్యోగులను తొలగించింది. గూగుల్ 2022లో కొనుగోలు చేసిన సైబర్ సెక్యూరిటీతో పాటు, క్లౌడ్ డివిజన్, థ్రెట్ ఇంటెలిజెన్స్ గ్రూప్‌లో ఉద్యోగులపై వేటు వేసింది. గత రెండు వారాలుగా ఈ ఉద్యోగాల కోత జరుగుతూనే ఉంది. ఏఐలో పెట్టుబడితో పాటు మెరుగైన లాభాల కోసమే ఉద్యోగులను తగ్గించుకుంటున్నట్టు తెలుస్తున్నది. మెటా సంస్థ 10 శాతం ఉద్యోగులను గత నెలలోనే తీసేసింది. ఉద్యోగ కోతలపై గూగుల్ స్పందించింది. టెక్ రంగంలో మారుతున్న పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసుకుని.. సంస్థ అభివృద్ధి కోసమే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నట్టు స్పష్టం చేసింది.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

మాటలు రైతులకు.. మూటలు ఢిల్లీకి



గండ్ర వెంకటరమణారెడ్డి


కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు గడిచిపోయాయి. 2023 అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఆ పార్టీ ఇచ్చిన హామీల అమలు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే చందంగా ఉన్నది. ఆరు గ్యారంటీలు, రైతులకు, యువతకు, ఎస్సీ, ఎస్టీలకు, బీసీలకు ఇచ్చిన డిక్లరేషన్లు మొత్తంగా మ్యానిఫెస్టోలోని 420 హామీల అమలు అంతా నీటి మూటలు, ఒట్టి ప్రగల్భాలే అని తేలిపోయింది. రైతులు, వ్యవసాయకూలీలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, మహిళలు, నిరుద్యోగులు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఎంప్లాయీస్, ఆర్టీసీ సిబ్బంది, ఆటోడ్రైవర్లు ఇలా వివిధ వర్గాల వారు కాంగ్రెస్‌పై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ముఖ్యంగా రైతులు తీవ్ర సంక్షోభంలో చిక్కుకొని, గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలు కూడా అటకెక్కడంతో మండిపడుతున్నారు.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ రైతులకు అరచేతిలో వైకుంఠం చూపించింది. బీఆర్ఎస్ రూ.లక్ష వరకే రుణమాఫీ చేసిందని, కాంగ్రెస్‌కు ఓటేస్తే రూ.2 లక్షల రుణమాఫీ అని, బీఆర్ఎస్ రైతుబంధు ఎకరానికి ఏటా రూ.10వేలు మాత్రమే ఇచ్చిందని, కాంగ్రెస్‌కు ఓటేస్తే ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని, కౌలు రైతులకు కూడా రైతుబంధు ఇస్తామని, పది రకాల పంటలకు రూ.500 వరకు బోనస్, పంట నష్టం వాటిల్లితే ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని ఓటర్లను ఆకర్షించింది. ఓట్లు వేయించుకుని గద్దెనెక్కింది. తమను ఆదరించిన రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిలువునా ఇప్పుడు ముంచుతున్నది. హామీలకు సంబంధించి కాంగ్రెస్ సర్కార్ రైతులకు రూ.లక్ష కోట్ల వరకు బకాయి పడింది. ఆరు గ్యారంటీలపై సీఎం సంతకం, క్యాబినెట్ తీర్మానం, చట్టబద్ధత కల్పిస్తామంటూ ఇచ్చిన హామీ కూడా అమలుకు నోచుకోలేదు. రైతులకు కనీసం యూరియా కూడా సరఫరా చేయలేని దుస్థితిలో సర్కార్ ఉన్నది. రైతుల నుంచి సగం ధాన్యం ప్రభుత్వం కొనకపోవడంతో, రైతులు యాసంగి సీజన్‌లో 65 లక్షల టన్నుల ధాన్యాన్ని తక్కువ ధరకే మిల్లర్లకు విక్రయించాల్సి వచ్చింది.

రుణమాఫీ కాని రైతుల కోసం ప్రభుత్వం 2026-27 బడ్జెట్‌లో నయాపైసా కేటాయించలేదు. దీంతో రాష్ట్రంలో రైతు రుణమాఫీ ముగిసిన కథ అయిపోయింది. వాస్తవానికి, రూ.రెండు లక్షల వరకు రుణాలు కలిగిన 42 లక్షల మంది రైతులకు రూ.31వేల కోట్ల రుణాలు మాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి గతంలో ప్రకటించారు. కానీ, ప్రభుత్వం ఇప్పటి వరకు నాలుగు విడతల్లో 25.35 లక్షల మంది రైతులకు రూ.20,616 కోట్లు మాత్రమే రుణమాఫీ చేసింది. ఈ లెక్కన ఇంకా 16.65 లక్షల మంది రైతులకు రూ.10,384 కోట్లు రుణ మాఫీ చేయాల్సి ఉన్నది.

> లక్షల మంది రైతులకు రూ.వేల కోట్లు పెండింగ్‌లో ఉండగా రుణమాఫీ పూర్తయినట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు సందర్భాల్లో లేని గొప్పలు చెప్పుకోవటం రైతులను నిలువునా మోసం చేయడమే. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాగానే 2026 ఫిబ్రవరి 18న రైతుభరోసా నగదు బదిలీ ఉంటుందని సీఎం పలు సభల్లో ప్రకటించారు. కానీ ఆ మాటలు నీటి మూటలే అయ్యాయి.

ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 10న రిజర్వ్ బ్యాంక్ నుంచి రూ.9 వేల కోట్లు అప్పు తీసుకున్నది. ఈ డబ్బు రైతు భరోసా కోసమేనని ప్రభుత్వ పెద్దలు చెప్పుకొన్నారు. రైతు భరోసా డబ్బులు చెల్లించి, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహిస్తామని అన్నారు. కానీ మున్సిపల్ ఎన్నికలు ముగియగానే రైతు భరోసా నిధులు అందరికీ విడుదల చేయలేదు. కానీ మూడెకరాల వరకే పరిమితమైంది. ఈ రైతు భరోసా నిధులు దారి తప్పి రాహుల్ భరోసా అయిందా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. రైతుల కోసం అని చెప్పిన రూ.9 వేల కోట్లు, ప్రభుత్వ పెద్దలకు కమీషన్లు ఇచ్చే కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపు కోసం దారి మళ్లాయనే ఆరోపణలున్నాయి. కమీషన్లుగా వచ్చిన వెయ్యి కోట్ల రూపాయలను ఇటీవల కేరళ, తమిళనాడు, అసోం, బెంగాల్ రాష్ర్టాల్లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఖర్చు కోసం తరలించి ఉంటారని ప్రచారం జరుగుతున్నది.



రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు సీజన్లకు గాను రెండు సీజన్లకు పూర్తిగా, రెండు సీజన్లలో సగం మంది రైతులకు మాత్రమే రైతు భరోసా డబ్బులు, రెండు సీజన్లకు రైతు భరోసా డబ్బులను పూర్తిగా ఎగ్గొట్టిన కాంగ్రెస్ సర్కార్, ఇక కౌలు రైతులకైతే భరోసా పథకం పూర్తిగా ఎగవేసింది. 'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధు స్కీమ్ బంద్ అయితదని అంటున్నరు. ఎందుకు బందయితది? మేమేమన్నా దివానాగాళ్లమా, మాకు దిమాక్ లేదా?' అని ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. మరిపుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు అయింది. సగం సీజన్లకు రైతుభరోసాను ఎగ్గొట్టింది. అంటే రేవంత్‌రెడ్డి మాటల ప్రకారమే సర్కార్ పెద్దలు ఏంటో వాళ్లే ఆలోచించుకోవాలి. ప్రతిసారీ ఏవో ఎన్నికలు ఉన్నప్పుడే అరకొర రైతుభరోసా పేరుతో ప్రభుత్వ పెద్దలు హడావుడి చేస్తున్నారు. అంటే ఎన్నికలు ఉంటనే రైతు భరోసా ఇస్తారా? పంటలు వేసిన ప్రతిసారీ ఇవ్వరా? ఈ లెక్కన మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు జరగకపోతే, ఇక రైతుభరోసా స్కీమ్ కూడా రద్దయినట్టేనా అనే కలవరం రైతుల్లో మొదలైంది. రైతుభరోసా అసలు కొనసాగుతుందని అన్నదాతలకు భరోసా ఇవ్వాలంటే ప్రభుత్వం ఈ యాసంగి, వానాకాలం సీజన్లవి కలిపి ఒకేసారి ఇదే నెలలో రైతుభరోసా నిధులు విడుదల చేయాలి. గతంలో ఎగ్గొట్టిన బకాయిలను కూడా పూర్తిగా చెల్లించి తీరాల్సిందే.

రైతు డిక్లరేషన్ ప్రకారం ప్రభుత్వం రాష్ట్రంలోని కోటి పది లక్షల మంది ఉపాధి హామీ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయాలి. కానీ ప్రభుత్వం లబ్ధిదారుల ఎంపికలో కొర్రీలు పెడుతూ కేవలం 5.19 లక్షల పైచిలుకు లబ్ధిదారులను ఎంపిక చేసింది. ఇందులో 2024-25 రబీ సీజన్‌లో 84 వేల మందికి మాత్రమే రూ.6 వేల చొప్పున, ఒక సీజన్‌కే ఆత్మీయ భరోసా అమలు చేసింది. మిగిలిన 4.35 లక్షల మందికి ఆత్మీయ భరోసా ఎగ్గొట్టింది. వీరందరికీ తక్షణమే పెండింగ్‌లో ఉన్న రూ.6 వేలు విడుదల చేయాలి. 2025 ఖరీఫ్ సీజన్‌తో పాటు, తాజాగా ముగిసిన 2025-26 రబీ సీజన్, ఇపుడు ప్రారంభమవుతున్న ఖరీఫ్ సీజన్, మొత్తం మూడు సీజన్లకు కలిపి, మొత్తం లబ్ధిదారులకు మూడు విడతల ఆత్మీయ భరోసా నిధులు రూ.18 వేల చొప్పున ఇవ్వాలి. లబ్ధిదారుల సంఖ్యను పెంచి, కనీసం 25 లక్షల మంది రైతు కూలీలకైనా ఆత్మీయ భరోసా అమలు చేయాలనేది రైతు కూలీల డిమాండ్.

> కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో భాగంగా వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని తెలిపింది. పార్టీ మ్యానిఫెస్టోలో వరితోపాటు మక్క, కందులు, సోయాబీన్, పత్తి, మిర్చి, పసుపు, చెరుకు, జొన్నలు వంటి పంటలకు కూడా బోనస్ ఇస్తామని నమ్మబలికింది. కానీ ఒక్క వరిపంటకు, అదీ సన్న రకానికి మాత్రమే బోనస్ అని ప్రకటించి, దొడ్డు రకం వడ్లను సాగు చేసే రైతులను మోసం చేసింది.

2024 ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సన్నాలకు బోనస్‌ను అమలు చేయడంతో వరి రైతులు 2024-25 రబీ సీజన్‌లోనూ బోనస్ దక్కుతుందని రైతులు అనుకొని, సన్నరకం వరి సాగు చేశారు. కానీ, అన్నదాతల ఆశలు అడియాసలే అయ్యాయి. యాసంగి ధాన్యం కొనుగోళ్లు ముగిసి ఏడాదిదాటినా ఇప్పటి వరకు రైతులకు దక్కాల్సిన బోనస్ డబ్బులు రూ.1160 కోట్లు విడుదల చేయలేదు. కనుక ఆ పెండింగ్ నిధులను తక్షణమే విడుదల చేయాలి. తాజాగా ధాన్యం సేకరణ ముగుస్తున్న యాసంగి సీజన్ సన్నరకం వడ్లతో పాటు, దొడ్డురకానికి, మ్యానిఫెస్టోలో చెప్పిన హామీ మేరకు ఇతర పంటలకు కూడా బోనస్ ఇవ్వాలనేది అన్నదాతల డిమాండ్.

రైతులు మాత్రమే కాదు, కాంగ్రెస్ హామీలను నమ్మి ఆ పార్టీకి ఓటేసిన వివిధ వర్గాలన్నీ ఇపుడు తాము నమ్మకద్రోహానికి గురయ్యామని రగిలిపోతున్నారు. నిరుద్యోగులు, మహిళలు, విద్యార్థినులు, ఎస్సీ, ఎస్టీలు, ఆటోడ్రైవర్లు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు సహా ప్రతీ వర్గం కాంగ్రెస్ తమను దగా చేసిందని మండిపడుతున్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక అన్ని వర్గాల ప్రజల నమ్మకాన్ని కాంగ్రెస్ సర్కార్ సగం పాలనా కాలంలోనే కోల్పోయింది. కాంగ్రెస్ రెండున్నరేండ్ల పాలన చూసాక, రాష్ట్ర ప్రజలకు ఇది దగాకోరు, నయవంచన సర్కార్ అని ప్రజలకు స్పష్టమైన అవగాహన వచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్ల పాలనలో బంగారు తెలంగాణ కల సాకారం కోసం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసింది. కాంగ్రెస్ అదనంగా పథకాలు అమలు చేస్తామంటే నమ్మిన ప్రజానీకం, ఇప్పుడు మొండిచేయి చూపిన పార్టీకి తగినబుద్ధి చెప్పేందుకు సమయం కోసం వేచి చూస్తున్నారు.

(వ్యాసకర్త: భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే)



గ్లోబల్ ఐకాన్ కేటీఆర్



చిటికెన కిరణ్ కుమార్
9490841284

రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం, స్వరాష్ట్రంలో అన్ని రంగాల అభివృద్ధితో తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని బీఆర్ఎస్ యావత్తు ప్రపంచానికి చాటి చెప్పింది. ఇదే స్ఫూర్తితో నిరుడు తెలంగాణ ఆవిర్భావోత్సవాలను అమెరికాలోని డల్లాస్‌లో నిర్వహించింది. ఈ ఏడాది గులాబీ జెండా ఆవిర్భావ వేడుకలకు మలేషియాలోని కౌలాలంపూర్ వేదిక కానున్నది. ఈ మేరకు జూన్ 6న (నేడు) జరగనున్న ఉత్సవాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. ఇందుకోసం బీఆర్ఎస్ మలేషియా శాఖ, మలేషియా తెలంగాణ అసోసియేషన్ సభ్యులతో కలిసి బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం ముమ్మర ఏర్పాట్లు చేసింది. ఈ నేపథ్యంలో పల్లె నుంచి పట్టణాల అభివృద్ధితోపాటు తెలంగాణలో ఐటీ అభివృద్ధికి కేటీఆర్ చేసిన కృషి, ప్రణాళికలు యావత్తు ప్రపంచంలోని తెలంగాణ ప్రజలు కీర్తిస్తున్నారు.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అభివృద్ధి కథలో అనేక అధ్యాయాలు నమోదైనా, ప్రపంచ దృష్టిని అత్యంత వేగంగా ఆకర్షించిన అధ్యాయం నవకల్పనలది. ఒకప్పుడు ఐటీ రంగంలో అవకాశాల కోసం ఇతర ప్రాంతాలను ఆశ్రయించిన యువత, నేడు తమ ఆలోచనలతో ప్రపంచ స్థాయి సంస్థలను సృష్టించే స్థాయికి చేరుకోవడం వెనుక దూరదృష్టి, కార్యాచరణ, నిరంతర ప్రయత్నం దాగి ఉన్నాయి. బీఆర్ఎస్ పాలనలో, ముఖ్యంగా కేటీఆర్ నాయకత్వంలో తెలంగాణ కేవలం పెట్టుబడులను ఆహ్వానించిన రాష్ట్రంగా కాకుండా, ఆలోచనలకు చిరునామాగా, స్టార్టప్‌లకు నిలయంగా, యువత కలలకు వేదికగా రూపాంతరం చెందింది. టీ-హబ్ వంటి సంస్థల ద్వారా నవకల్పనలకు బలమైన పునాది వేయడం, ప్రపంచ సాంకేతిక రంగ దృష్టిని హైదరాబాద్ వైపు మళ్లించడం, స్థానిక ప్రతిభను అంతర్జాతీయ అవకాశాలతో అనుసంధానం చేయడం ద్వారా తెలంగాణకు ప్రత్యేకమైన గుర్తింపును తీసుకురావడంలో కేటీఆర్ పోషించిన పాత్ర విశేషమైనది. అందుకే నేడు తెలంగాణ అభివృద్ధి గురించి మాట్లాడినప్పుడు భవనాల ఎత్తు కంటే ఆలోచనల ఎత్తు, పెట్టుబడుల పరిమాణం కంటే అవకాశాల విస్తృతి, ప్రభుత్వ కార్యక్రమాల కంటే యువతలో నింపిన ఆత్మవిశ్వాసమే ఎక్కువగా చర్చకు వస్తున్నాయి.

> తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సమాచార సాంకేతిక రంగాన్ని కేవలం ఉద్యోగాల కల్పనకే పరిమితం చేయకుండా, భవిష్యత్తు ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేటీఆర్ ఆధ్వర్యంలో అనేక వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. టీ-హబ్, టీ-వర్క్స్, వీ-హబ్ వంటి వేదికల స్థాపన ద్వారా యువతలోని సృజనాత్మకతకు ప్రపంచ స్థాయి అవకాశాలు కల్పించారు.

స్టార్టప్ సంస్కృతిని గ్రామీణ ప్రాంతాల వరకు విస్తరించాలనే సంకల్పంతో ప్రతిభను పెట్టుబడులతో, పరిశోధనను పరిశ్రమలతో, విద్యను ఉపాధితో అనుసంధానించే విధానాలు అమలులోకి తీసుకొచ్చారు. ప్రపంచ ప్రఖ్యాత సాంకేతిక సంస్థలను హైదరాబాద్ వైపు ఆకర్షించడంతోపాటు, స్థానిక యువతను ఉద్యోగార్థుల నుంచి ఉద్యోగ సృష్టికర్తలుగా తీర్చిదిద్దారు. ఫలితంగా దేశంలోని అగ్రశ్రేణి ఐటీ కేంద్రాల్లో ఒకటిగా ఎదగడమే హైదరాబాద్ కాకుండా, నవకల్పనలకు చిరునామాగా అంతర్జాతీయ గుర్తింపును సొంతం చేసుకున్నది. తెలంగాణలో సాంకేతిక విప్లవానికి పునాది వేసిన నాయకత్వం గురించి చర్చ వచ్చినప్పుడు, ఆ మార్పును కార్యరూపంలో చూపించిన కేటీఆర్ పాత్ర ప్రత్యేకంగా నిలుస్తున్నది. ఆ మార్పుల వెనుక విధానాలు ఉన్నాయి, ప్రణాళికలు ఉన్నాయి, వాటిని కార్యరూపంలోకి తీసుకువచ్చిన నాయకత్వం కూడా ఉన్నది. ఆ నాయకత్వంలో కేటీఆర్ పేరు ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిందే.

కేటీఆర్ తరచుగా యువతతో మమేకమవుతూ ఒక విషయాన్ని ప్రస్తావిస్తూ ఉంటారు. ఉద్యోగం కోసం ఎదురు చూడడం కాకుండా ఉద్యోగాలను సృష్టించే దిశగా ఆలోచించాలని ఆయన చెప్పిన సందేశం ఇస్తారు. కేటీఆర్ పిలుపు ఎంతో మందిని ప్రభావితం చేసింది. ఆ ఆలోచనే స్టార్టప్ సంస్కృతికి బలమైన పునాది అయింది. ఒక చిన్న ఆలోచన కూడా ప్రపంచ మార్కెట్‌ను చేరగలదనే నమ్మకం యువతలో పెరిగింది. ఫలితంగా తెలంగాణ నుంచి పుట్టిన అనేక సంస్థలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుతున్నాయి. తెలంగాణలో ఐటీ రంగం విస్తరణ కూడా ఈ ప్రయాణంలో ఒక ముఖ్య ఘట్టం. ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు తమ కార్యాలయాలను విస్తరించేందుకు హైదరాబాద్‌ను ఎంపిక చేయడం వెనుక ఉన్న కారణాల్లో మౌలిక సదుపాయాలు, అనుకూల విధానాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు ప్రధానమైనవి. ఈ అంశాలను సమన్వయం చేయడంలో కేటీఆర్ కీలక పాత్ర పోషించారు. పెట్టుబడిదారులతో నిరంతర సంభాషణలు, అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ అవకాశాలను పరిచయం చేయడం, పరిశ్రమలకు అనుకూల వాతావరణం కల్పించడం ద్వారా రాష్ట్ర ప్రతిష్ఠను పెంచారు.

అభివృద్ధి అనేది నగరాలకే పరిమితం కాకూడదనే భావన కూడా తెలంగాణ విధానాల్లో కనిపిస్తుంది. జిల్లాలకు సాంకేతిక అవకాశాలను విస్తరించడం, గ్రామీణ యువతకు కొత్త అవకాశాల ద్వారాలు తెరవడం, విద్యా సంస్థలను ఆవిష్కరణల కేంద్రాలుగా తీర్చిదిద్దడం వంటి ప్రయత్నాలు జరిగాయి. దీని వల్ల ప్రతిభ కేవలం మహానగరాల్లోనే కాదు, చిన్న పట్టణాల్లోనూ వికసించే పరిస్థితులు ఏర్పడ్డాయి. నేటి ప్రపంచంలో దేశాలు, రాష్ర్టాలు పరస్పరం పోటీపడుతున్నాయి. పెట్టుబడులు, సాంకేతికత, మానవ వనరులను ఆకర్షించేందుకు ప్రతీ ప్రాంతం తనదైన వ్యూహాలను అమలు చేస్తున్నది. అలాంటి పరిస్థితుల్లో తెలంగాణ తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించగలిగింది. దీనికి కారణం కేవలం భౌగోళిక ప్రయోజనం కాదు; భవిష్యత్తు అవసరాలను ముందుగానే అర్థం చేసుకుని తీసుకున్న నిర్ణయాలు, ఆ నిర్ణయాల అమలులో కేటీఆర్ చూపిన చొరవ తెలంగాణకు విశిష్ట స్థానాన్ని తీసుకువచ్చింది.

ఒక రాష్ర్టానికి నిజమైన సంపద భూములు కాదు, భవనాలు కాదు, ఖనిజాలు కాదు. ఆ రాష్ట్ర యువత మేధస్సు, వారి సృజనాత్మకత, వారి కలలు. ఆ కలలకు దిశ చూపగలిగితే చరిత్ర సృష్టించవచ్చు. తెలంగాణ కథ ఆ విషయాన్ని నిరూపించింది. నవకల్పనలకు విలువ ఇచ్చిన నేలగా, యువతకు అవకాశాలు కల్పించిన వేదికగా, భవిష్యత్తును ఆహ్వానించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిపోతుంది. ఆ ప్రయాణంలో కేటీఆర్ పాత్ర విశిష్టమైనది. తెలంగాణ ఆధునిక అభివృద్ధి గాథలో కేటీఆర్ మార్క్ విశేషమైనది. ఆ ఖ్యాతిని ప్రపంచం నలుమూలలా చాటుతూ నేటి నుంచి మలేషియాలోని వివిధ వేదికలపై తెలంగాణ ఖ్యాతిని చాటిచెప్తూ.. యువతను భాగస్వాములు చేసే సందేశం ఇవ్వనున్నారు. ■

అప్పుడు.. ఇప్పుడు తెలంగాణ వైపే

తెలంగాణ అస్తిత్వ ప్రతీక, పోరాట పతాక నమస్తే తెలంగాణ. మన రాష్ట్రం, మన పత్రిక అనే నినాదంతో ఉద్యమ జెండాను రెపరెపలాడించింది. చారిత్రక పోరాటానికి నిలువెత్తు అద్దం పట్టింది. రాష్ట్ర సాధన గమ్యాన్ని ముద్దాడే వరకూ నిరంతరం అక్షర అక్షౌహిణులను సంధించింది. ఇప్పుడు మరోసారి అస్తిత్వానికి ముప్పు వస్తున్నది. దుష్టశక్తులు దూసుకువస్తున్నాయి. తెలంగాణ ఆత్మను ప్రశ్నిస్తున్నాయి.. సవాల్ చేస్తున్నాయి. అందుకే అస్తిత్వ రక్షణ పోరుకు మరోసారి నడుం బిగించింది నమస్తే తెలంగాణ.



కడపత్రి ప్రకాశ్‌రావు
8096677022



అది తెలంగాణలో సాంస్కృతిక విధ్వంసం యథేచ్ఛగా సాగుతున్న కాలం.. మన యాస, భాషలను మనమే తక్కువగా చూసే పరిస్థితి కల్పించిన ఆధిపత్య వికృతం.. మన చరిత్రను మన కండ్ల ముందే అణగదొక్కుతున్న సందర్భం.. మన కవులు, కళాకారులపై అప్రకటిత ఆంక్షలు.. మన పండుగలు, పబ్బాలపై విమర్శలు, వివక్షలు.. వాళ్ల పొలాలకు మన గోదావరి, కృష్ణా జలాలు.. అక్కడ మూడు పంటలు.. ఇక్కడ ఆకలి కేకలు.. వాళ్ల ఫ్యాక్టరీలకు మన వనరులు.. వాళ్లవి కొలువులు, మనవి బానిస బతుకులు. తేనెపూసిన కత్తులతో గొంతుకోసే కౌటిల్యం.. ఒకవైపు అస్తిత్వాన్ని దెబ్బతీసే కుట్రలు.. మరోవైపు ఆత్మగౌరవాన్ని, హక్కులను హరించివేసే ఎత్తుగడలు.. తెలంగాణ ఉద్యమం ఉత్త తాటాకు మంటని.. సీమాంధ్రోళ్లు సిత్రాతిసిత్రంగా కథలు అల్లుతున్న సందర్భం... ప్రధాన మీడియాగా చలామణీ అయ్యే పత్రికల్లో తెలంగాణ ఉద్యమం గొంతు నొక్కేసే వ్యూహ రచనలు... ఇదిగో ఇలాంటి చీకటి సంధ్యలో చిరుదివ్వెలా వెలిగింది నమస్తే తెలంగాణ. అవిర్భావంతోనే తెలంగాణ ప్రజలను జాగృతం చేసింది. ఆకలి, అణచివేత, దోపిడీ ఉన్నకాడ తిరుగుబాటు రాకపోతే తిప్పలెట్ల తప్పైతదని కర్తవ్యబోధ చేసింది. అవిశ్రాంతంగా, అప్రతిహతంగా జై తెలంగాణ! నినాదాన్ని రగిల్చింది.

> తెలంగాణ విముక్తి కోసం పదవులు, పార్టీలను పక్కన పెట్టి పోరాడాల్సిన అవసరాన్ని, అగత్యాన్ని ప్రజల ముందుంచింది. ఒక్క మాటలో చెప్పాలంటే.. అనునిత్యం తెలంగాణ ప్రజల పక్షాన గొంతు విప్పి పాలక శక్తులను నిలదీసింది. నాటి ఉద్యమం కాలంలో గానీ, నేటి కాంగ్రెస్ సర్కార్ హయాంలో గానీ కొంతమంది ఆధిపత్యవాదుల చేతుల్లోని పత్రికలు వాస్తవాలను మరుగున పడేస్తుంటే.. నాడు, నేడు తెలంగాణ ప్రజల పక్షాన బరిగీసి నిలబడి కొట్లాడుతున్నది నమస్తే తెలంగాణ ఒక్కటే.

తెలంగాణ సాధన తర్వాత ఇప్పుడు మళ్లీ శోధన మొదలైంది. అస్తిత్వానికి సవాళ్లు ఎదురవుతున్నాయి. నిన్నటిదాకా మూతపడ్డ తెలంగాణ వ్యతిరేకుల నోళ్లు మళ్లీ తెరుచుకుంటున్నాయి. తెలంగాణ సమాజం రెండు యుద్ధాలు చేయాల్సిన అగత్యం స్పష్టంగా కనిపిస్తున్నది. ఒకటి ఇంట గెలువడం, రెండు రచ్చగెలువడం. తెలంగాణ ప్రజల అస్తిత్వాన్ని ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే కుట్రలు, కుతంత్రాలు మళ్లీ మొదలయ్యాయి. వీటిపైనా ప్రజలను జాగృతం చేసే బాధ్యతను నమస్తే తెలంగాణ తన భుజానికి ఎత్తుకుంది. దోపిడీ పాలకుల మీడియా తాజాగా పవన్ కల్యాణ్ పెట్టిన ప్రెస్‌మీట్‌పై రాసిన వార్తా కథనాలు రెండు నాల్కల ధోరణికి నిలువెత్తు నిదర్శనం. అతని మనసులోని మాటలను, అందులోని అర్థాలను, తెలంగాణ సమాజంపై చిమ్ముతున్న విషాన్ని నమస్తే తెలంగాణ ఎండగడితే.. ఇతర పత్రికలు మాత్రం అతని మాటలనే రెచ్చగొట్టేవిధంగా ప్రచురించిన తీరు గమనార్హం. 2011 జూన్ 6న పురుడుపోసుకున్న నమస్తే తెలంగాణ నేడు 15వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది. ఈ పదిహేను సంవత్సరాల ప్రయాణంలో తెలంగాణ అత్మగౌరవానికి విఘాతం కలుగకుండా చంటిబిడ్డలా కాపాడుకోవడంలో నమస్తే తెలంగాణ నాటినుంచి నేటివరకు ప్రముఖ పాత్ర పోషిస్తున్నదని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

బహుముఖ పాత్ర

2011 పురుడు పోసుకున్న నమస్తే తెలంగాణ ఆనాడు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి అంకితమైన ఏకైక దినపత్రికగా నిలిచింది. తెలంగాణ ప్రాంతానికి జరిగిన అన్యాయాలు, నీళ్లు-నిధులు-నియామకాలు, విద్యార్థి ఉద్యమాలు, ఉద్యోగ సంఘాల పోరాటాలు, ప్రజా సభలకు విస్తృత ప్రచారం కల్పించింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌ను బలంగా సమర్థిస్తూ సంపాదకీయాలు, విశ్లేషణలు, ప్రత్యేక కథనాలను ప్రచురించింది.అప్పటి ప్రధాన మీడియా సంస్థలు తెలంగాణ వాదనకు తగిన ప్రాధాన్యం ఇవ్వని సమయంలో, తెలంగాణ ఉద్యమానికి ఒక ప్రత్యేక మీడియా వేదికగా పని చేసింది. తెలంగాణ సంస్కృతి, భాష, యాస, ప్రాంతీయ ఆత్మగౌరవ అంశాలను ముందుకు తీసుకువచ్చి ఉద్యమానికి సామాజిక బలం చేకూర్చింది.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమ స్వరాన్ని ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషించింది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ చరిత్రలో నమస్తే తెలంగాణను చాలా మంది 'ఉద్యమ పత్రిక'గా గుర్తించారు. ఉద్యమ వార్తలు, విశ్లేషణలు, తెలంగాణ ఆత్మగౌరవ భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా రాష్ట్ర సాధనకు అనుకూల ప్రజాభిప్రాయాన్ని బలోపేతం చేయడంలో ముఖ్య పాత్ర పోషించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నమస్తే తెలంగాణ.. తెలంగాణ ప్రయోజనాలకు అంకితమైన పాత్రను పోషించింది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతు బంధు, రైతుబీమా, ప్రాజెక్టుల రూపకల్పన వంటి కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించింది. బంగారు తెలంగాణను మలిచే క్రమంలో కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పెట్టుబడులు, సాగునీటి ప్రాజెక్టులపై విస్తృత కథనాలు ప్రచురించింది. తెలంగాణ ప్రాంతీయ ప్రయోజనాలు, రాష్ట్ర హక్కులు, కేంద్ర-రాష్ట్ర సంబంధాల అంశాలపై తెలంగాణ కోణాన్ని ప్రతిబింబించే సంపాదకీయాలు ప్రచురించింది. తెలంగాణ అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాన స్రవంతి మీడియాలో తొక్కిపారేసిన పరిస్థితిలో అసలు వాస్తవాలను ప్రజలకు చేరవేయడంలో నమస్తే తెలంగాణ కీలక పాత్ర పోషించింది. ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టులపై ప్రజల్లో చైతన్యం తెచ్చింది. తెలంగాణ లైఫ్‌లైన్ కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎప్పటికప్పుడు కవరేజ్ ఇచ్చింది. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రత్యేక కథనాలు. తెలంగాణ భాష, యాస, సంస్కృతి, చరిత్రకు ప్రాధాన్యత నమస్తే తనదైన శైలిలో విశ్లేషించింది. తెలంగాణ ప్రయోజనాలు, అభివృద్ధే లక్ష్యంగా తీసుకున్నది.

ఇవాళ ప్రజల పక్షాన పాత్ర

రాష్ట్రంలో మారిన పరిస్థితుల నేపథ్యంలో ఇవాళ నమస్తే తెలంగాణ ప్రజల పక్షాన గొంతు విప్పుతున్నది. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తేవడమే కాదు.. అన్యాయాలు, అక్రమాలు, భూకబ్జాలు, రౌడీమూకల ఆగడాలు, వివిధ శాఖల్లో జరుగుతున్న అవినీతితో పాటుగా అన్నదాతల నుంచి భూములు లాక్కోవడానికి సర్కార్ ఆడుతున్న డ్రామాలను కూడా నిర్భయంగా ఎండగడుతున్నది. అనునిత్యం ప్రజల పక్షాన నిలుస్తూ ప్రతిపక్ష పాత్రపోషిస్తున్నది.

> నాడు నేడు తెలంగాణప్రజల పక్షాన బరిగీసి నిలబడి కొట్లాడుతున్న ఏకైక పత్రికగా నమస్తే తెలంగాణ గుర్తింపు పొందితే ఇవాళ లగచర్ల, దిలావర్‌పూర్, పెద్ద ధన్వాడ వంటి ప్రాంతాల్లో పంట పొలాలను చెరబట్టేందుకు కాంగ్రెస్ వేసిన పన్నాగాలపై యుద్ధభేరి మోగిస్తూ రైతులకు అండగా నిలిచింది. రైతన్నలపై సర్కారు దౌర్జన్యం ఎలా సాగుతున్నదో కథనాలు ప్రచురించి ఎండగట్టింది. చంద్రబాబు శిష్యుల ఇథనాల్ ఫ్యాక్టరీ గుట్టు రట్టుచేసింది.

మహబూబ్‌నగర్ జిల్లాలో 40 మంది రైతులపై హత్యాయత్నం కేసులు పెట్టి జైలుకు పంపిస్తే కథనాలు ప్రచురించి సమస్యను జాతీయ స్థాయికి తీసుకు వెళ్లింది. జాతీయ సంఘాలను రంగంలోకి దింపింది. రాజోళి రైతుకు బేడీలు విషయాన్ని బయటపెట్టింది. యూరియా విషయంలో రైతులకు అండగా నిలిచింది. ప్రజాసమస్యలపై గళమెత్తింది. ప్రభుత్వ పెద్దల అక్రమాలపై ధ్వజమెత్తింది. రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులకు సంబంధించిన సమస్యలు.విద్యుత్, సాగునీరు, వ్యవసాయం, ఆర్థిక నిర్వహణ వంటి అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే కథనాలు.ప్రభుత్వ నిర్ణయాల్లో లోపించిన పారదర్శకత, టెండర్లు, భూవ్యవహారాలు, పరిపాలనా చర్యలకు సంబంధించిన వివాదాలపై వార్తలు.ప్రభుత్వ కాంట్రాక్టులు, టెండర్ల కేటాయింపుల్లో అవకతవకలు జరిగిన వైనాలు, ఎన్నికల హామీల అమలులో వైఫల్యాలు, ఆర్థిక నిర్వహణలో లోపాలు ఉన్నాయనే విమర్శలు ప్రభుత్వ యంత్రాంగాన్ని రాజకీయ ప్రచారం కోసం ఉపయోగిస్తున్న తీరొక్క మాటలో చెప్పాలంటే నమస్తే తెలంగాణ ప్రభుత్వ నిర్ణయాలను అత్యంతలోతుగా పరిశీలిస్తూ ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నది. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో (మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత, యువ వికాసం) లబ్ధిదారుల ఎంపిక, విధివిధానాల అమల్లో ఎదురైన సవాళ్లను విస్మరించిన విధానాలను ఎక్కడికక్కడ ఎండగడుతూనే ఉన్నది.

> రూ. 2 లక్షల వరకు వ్యవసాయ రుణాలను దశలవారీగా మాఫీ చేయడంలో వైఫల్యాలు, మూసీ ప్రాజెక్టును అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చేపట్టిన ప్రణాళికలు, అక్రమ నిర్మాణాల తొలగింపు అంశాలను చెండాడింది. చెరువులు, ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి కాపాడటానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ఏజెన్సీ (హైడ్రా) పేరుతో చేపట్టిన కూల్చివేతలు, వాటి చుట్టూ అల్లుకున్న రాజకీయాలను ప్రజల కండ్లకు కట్టినట్టుగా చూపింది.

మారిన ప్రభుత్వ విధానాలు, భారీ అప్పులు, పడకేసిన సంక్షేమ పథకాలు, కుల గణన పేరుతో బీసీలకు జరిగిన అన్యాయాన్ని, కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్ పిల్లర్లు కుంగిపోవడంపై ప్రభుత్వం నియమించిన విచారణ కమిషన్లు, నివేదికల్లోని లోపాలను ఎత్తి చూపింది. సర్కార్ కక్ష సాధింపు చర్యలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో ఎలుగెత్తి చాటుతున్నది. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన గ్రూప్-1 తదితర ఉద్యోగ నియామకాల్లో లోపాలు, నిరుద్యోగులకు జరిగిన అన్యాయం, పరీక్షలు నిర్వహించడంలో ప్రభుత్వ లోపభూయిష్ట విధానాలు జీవో 46 పై అభ్యర్థుల ఆందోళనలు. విద్య, వైద్య రంగాలపై చూపుతున్న నిర్లక్ష్యాలు..ఇలా ఎన్నో ఎన్నెన్నో కథనాలను వెలుగులోకి తెస్తూ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తున్నది నమస్తే తెలంగాణ.

మళ్లీ కుట్రలు

తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కులకు భంగం వాటిల్లే ప్రమాదం తిరిగి ముంచుకొస్తున్నది. స్వయంపాలనలో ఉన్న తెలంగాణపై మళ్లీ పరాయి శక్తుల పెత్తనం చెలాయించడానికి వరుస దండయాత్రలు మొదలయ్యాయి. తెలంగాణ రాష్ట్ర అస్తిత్వాన్ని, ఉద్యమ చరిత్రను దెబ్బతీసే దిశగా వ్యూహ రచనలు సాగుతున్నాయి. తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్పుచేయడం నుంచి ఆరంభమైన దుశ్చర్యలు ప్రాంతేతర వ్యక్తుల విగ్రహాలను ఏర్పాటు చేయడం వరకు వెళ్లాయి. ఒక్క మాటలో చెప్పాలంటే తెలంగాణ చరిత్రను తుడిచిపెట్టే ప్రయత్నాలు భారీగానే జరుగుతున్నాయి. ఈ ఉత్పాతాన్ని నివారించడానికి మరో ఉద్యమం తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ భవిష్యత్తును కాపాడుకోవడానికి అవసరమైతే మరో ఉద్యమానికి సిద్ధం కావాల్సిందేనని తెలంగాణ సమాజం మథనపడుతున్నది. తెలంగాణ హక్కులు, అస్తిత్వ పరిరక్షణ కోసం నమస్తే తెలంగాణ తన వంతుగా సాగించాల్సిన పోరాటం ఇంకా చాలానే ఉన్నది.

(వ్యాసకర్త: నమస్తే తెలంగాణ ప్రతినిధి, కరీంనగర్)

మలేషియాలో కేటీఆర్‌కు ఘనస్వాగతం

కౌలాలంపూర్ ఎయిర్‌పోర్ట్‌కు భారీగా తరలివచ్చిన ఎన్నారైలు • నేడు తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు హాజరు

హైదరాబాద్, జూన్ 5 (నమస్తేతెలంగాణ): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు కుటుంబసమేతంగా శుక్రవారం మలేషియాకు చేరుకున్నారు. ఆయన రాక విషయం తెలుసుకున్న అభిమానులు, ఎన్నారైలు, బీఆర్‌ఎస్ నాయకులు పెద్దసంఖ్యలో కౌలాలంపూర్ ఎయిర్‌పోర్ట్‌కు తరలివచ్చారు. పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలు కప్పి సాదరస్వాగతం పలికారు. కేటీఆర్‌కు స్వాగతం పలికినవారిలో తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, మైటా అధ్యక్షుడు తిరుపతి, బీఆర్‌ఎస్ మలేషియా అధ్యక్షుడు మారుతి తదితరులు ఉన్నారు. మలేషియా తెలంగాణ అసోసియేషన్ (మైటా), బీఆర్‌ఎస్ మలేషియా శాఖ సంయుక్తంగా శనివారం నిర్వహించనున్న తెలంగాణ 12వ ఆవిర్భావ వేడుకలకు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ వేడుకలకు అట్టహాసంగా ఏర్పాట్లు చేశామని మైటా, బీఆర్‌ఎస్ ఎన్నారై ప్రతినిధులు తెలిపారు. వేదికను అందంగా తీర్చిదిద్దామని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా కళారూపాలు ప్రదర్శిస్తామని వెల్లడించారు.



కేటీఆర్‌కు ఘనంగా స్వాగతం పలుకుతున్న ఎన్ఆర్ఐలు, మలేషియా తెలంగాణ అసోసియేషన్ నేతలు

నేడు కౌలాలంపూర్‌లో తెలంగాణం

అట్టహాసంగా ఆవిర్భావ వేడుకలు

బీటీఎం, మైటా ఆధ్వర్యంలో వేడుక

- ముఖ్యఅతిథిగా రానున్న కేటీఆర్
- 3 వేల మంది ప్రతినిధులు రాక
- వేదిక ప్రాంగణంలో ఇరువైపులా కేసీఆర్, కేటీఆర్ భారీ కటౌట్లు
- ఉద్యమ ఫొటోలతో ఎగ్జిబిషన్
- తెలంగాణ ప్రాంత సంస్కృతిని విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యం
- 'నమస్తే' ఇంటర్వ్యూలో బీఆర్‌ఎస్ ఎన్ఆర్ఐ గ్లోబల్ కో ఆర్డినేటర్ మహేశ్



ఆవిర్భావ సంబురాల కోసం ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఎన్ఆర్ఐ గ్లోబల్ కో ఆర్డినేటర్ మహేశ్

హైదరాబాద్, జూన్ 5 (నమస్తేతెలంగాణ): మలేషియా రాజధాని కౌలాలంపూర్ నగరంలో శనివారం జరుగనున్న తెలంగాణ 12వ ఆవిర్భావ సంబురాలకు అట్టహాసంగా ఏర్పాట్లు చేశామని బీఆర్‌ఎస్ ఎన్ఆర్ఐ గ్లోబల్ కో ఆర్డినేటర్ మహేశ్ బిగాల తెలిపారు. దీనికోసం రెండు నెలలుగా శ్రమించామని చెప్పారు. తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలు ఉట్టిపడేలా ఈ వేడుకలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నారని, ఇప్పటికే ఆయన కుటుంబ సమేతంగా రావడం ఎంతో ఆనందంగా ఉన్నదని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం 'నమస్తే తెలంగాణ'తో మహేశ్ బిగాల ముచ్చటించారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకల నిర్వహణ విశేషాలను ఆయన పంచుకున్నారు.

నమస్తే తెలంగాణ: కౌలాలంపూర్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు నిర్వహించడం లోని ఉద్దేశమేంటి?

మహేశ్ బిగాల: మలేషియాలో వేలాది మంది తెలంగాణవాసులు ఉన్నారు. వారు కూడా నాటి ఉద్యమంలో కీలక భూమిక పోషించారు. తెలంగాణ సంస్కృతిని, ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించిన తీరును ప్రపంచానికి తెలియజెప్పే ఉద్దేశంతోనే ఈ వేడుకలు నిర్వహిస్తున్నాం. గతంలో డాలస్‌లో నిర్వహించిన వేడుకల స్ఫూర్తితో ఇక్కడ మరింత ఘనంగా జరుపాలని నిర్ణయించినం.

ఏర్పాట్లపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?

శనివారం సాయంత్రం 3:30 గంటల నుంచి రాత్రి 11 వరకు ఆవిర్భావ వేడుకలు జరుగుతాయి. ఈ వేడుకల కోసం అద్భుతంగా ఏర్పాట్లు చేసినం. ఇందుకోసం రెండు నెలల నుంచి రాత్రింబవళ్లు శ్రమించినం. తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా వేదికను రూపొందించినం. వరంగల్ కాకతీయ కళాతోరణాలు, యాదగిరిగుట్ట ఆలయం, చార్మినార్, బతుకమ్మ, అమరజ్యోతి తదితర చిహ్నాలు ప్రతిష్ఠించినం. వేదికకు ఇరువైపులా కేసీఆర్, కేటీఆర్ భారీ కటౌట్లను పెట్టినం. అలాగే 14 ఏండ్ల ప్రత్యేక తెలంగాణ ఉద్యమ చిత్రాలతో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినం

తెలంగాణ కళారూపాల ప్రదర్శన ఉంటుందా?

తెలంగాణ ధూంధాం నిర్వహిస్తున్నం. ఇందు కోసం అనేకమంది కళాకారులు ఇప్పటికే ఇక్కడికి చేరుకొన్నారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, కళాకారులు మానుకోట ప్రసాద్, సందీప్, అంజలి, నృత్య కళాకారులు వర్షిణి, రాజేశ్ ప్రదర్శనలిస్తారు. తెలంగాణ ఆటాపాటలతో ధూంధాం నిర్వహించనున్నారు.



ఏఏ దేశాల నుంచి ఎంతమంది ప్రతినిధులు హాజరవుతున్నారు?

మలేషియాతోపాటు సింగపూర్, ఆస్ట్రేలియా తదితర దేశాల నుంచి సుమారు 3,000 మంది ప్రతినిధులు పాల్గొంటారు. వీరికోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినం. వేదికకు నలువైపులా ఎల్ఈడీ స్క్రీన్లు అమర్చినం. ఈ కార్యక్రమానికి మలేషియాతోపాటు తెలంగాణ, తెలుగు సమాజం తదితర 25 సంస్థలు, సంఘాలు సహకారం అందిస్తున్నాయి.

అతిథులు, సభికులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించారు.

సభకు హాజరయ్యే అతిథులైన బీఆర్‌ఎస్ నేతలతోపాటు ప్రతినిధులకు సకల సౌకర్యాలు కల్పించినం. తెలంగాణ వంటకాలైన బోటి, పచ్చిపులుసు, గారెలు, మాంసం, హైదరాబాద్ బిర్యానీ తదితర రుచికరమైన వంటకాలు సిద్ధచేస్తున్నం.

కేటీఆర్ రాకపై మీ స్పందనేంటి?

కేటీఆర్‌ను కలిసేందుకు ప్రవాసీ తెలంగాణవాసులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఆయన ప్రసంగం వినేందుకు ఎంతో ఉత్సుకతతో ఉన్నారు. మేము ఆహ్వానించిన వెంటనే ఆవిర్భావ ఉత్సవాలకు హాజరయ్యేందుకు కేటీఆర్ అంగీకరించారు. ఆయన ఇప్పటికే సతీసమేతంగా మలేషియా చేరుకొన్నారు.

40 లక్షల టన్నుల బొగ్గు మింగిందెవరు?

ఇంత పెద్దమొత్తంలో కోల్ ఎట్లా మాయమైంది? • నిజాలు నిగ్గుతేల్చడంలో కేంద్రం నిర్లక్ష్యమెందుకు?:కేటీఆర్

- రేవంత్ పాలనలో స్కామ్‌లకు కేరాఫ్‌గా సింగరేణి
- ఆధారాలిచ్చినా పట్టించుకోని మోదీ ప్రభుత్వం
- సింగరేణిలో 1,600 కోట్ల స్కామ్‌పై విచారణ చేయాలి
- లేదంటే ఉద్యమానికి శ్రీకారం చుడుతాం
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ



హైదరాబాద్, జూన్ 5 (నమస్తేతెలంగాణ): సింగరేణి ప్రకటించిన నిల్వల నుంచి 40 లక్షల టన్నుల బొగ్గు ఎలా మాయమైందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. 'రేవంత్‌రెడ్డి అప్పనంగా అమ్ముకున్నారా? రూ.1,600 కోట్ల విలువైన స్కామ్‌పై బీఆర్‌ఎస్ ఆధారాలతో ఫిర్యాదు చేసినా కేంద్రం ఎందుకు పట్టించుకోవడం లేదు?' అంటూ ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి రెండున్నరేండ్ల పాలనలో సింగరేణి స్కామ్‌లకు కేరాఫ్‌గా మారిందని మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. రేవంత్, కిషన్‌రెడ్డి మిలాఖత్ కాకుంటే సింగరేణిలో భారీ బొగ్గు కుంభకోణంపై వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి తెలంగాణ ప్రజల ఆస్తి అయిన సింగరేణి మనుగడను దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ కొంగు బంగారం సింగరేణిలో బట్టబయలైన రూ. 1,600 కోట్ల భారీ కుంభకోణం కార్మికలోకాన్ని తీవ్రంగా కలవరపరుస్తున్నదని వాపోయారు.

కాంగ్రెస్ వచ్చిన తర్వాత వరుస కుంభకోణాలు..

కాంగ్రెస్ గద్దెనెక్కిన తర్వాత వరుస స్కామ్‌లతో సింగరేణి వణికిపోతున్నదని, రూ.1,600 కోట్ల విలువచేసే బొగ్గును మాయం చేసి సంస్థ గొంతుకోసే కుట్రకు తెరతీశారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 40 లక్షల టన్నుల బొగ్గుపై కోల్‌సెస్, ఐటీ కట్టినమని లెక్కలు చూపుతున్నారని, సంస్థ అధికారిక వెబ్‌సైట్ రికార్డుల్లో ఏడు గనుల వద్ద బొగ్గు స్టాక్ ఉన్నదని నమోదైందని, కానీ క్షేత్రస్థాయిలో నిల్వలు కనిపించడం లేదని, బొగ్గు మాయం వెనుక ఎవరి హస్తం ఉన్నదో తేల్చాల్సిన అవసరమున్నదని పేర్కొన్నారు. కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించి, బొగ్గు గనుల శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న కిషన్‌రెడ్డి హయాంలో ఇంత పెద్ద కోల్ కుంభకోణం జరగడం సిగ్గుచేటని నిప్పులు చెరిగారు. 'ఏప్రిల్ నెలాఖరుకు మందమర్రిలో 7,20,000 టన్నులు, శ్రీరాంపూర్‌లో 8 లక్షల టన్నులు, రామగుండం-1లో 6 లక్షలు, రామగుండం-2లో 4 లక్షలు, భూపాలపల్లిలో 5.40 లక్షలు, ఇల్లందులో 3.50 లక్షలు, సత్తుపల్లిలో 2 లక్షల మెట్రిక్ టన్నులు మొత్తంగా సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నులు ఉన్నదని లెక్కలు చూపించారని, కానీ కోల్ స్టాక్ పాయింట్ల వద్ద ఆ బొగ్గు నిల్వలు కనిపించడంలేదని వెల్లడించారు. స్కామ్‌కు ఇదే అతిపెద్ద ఆధారమని స్పష్టంచేశారు. ఏప్రిల్‌లో గనులపై బొగ్గు నిల్వలు తనిఖీ చేసే బొగ్గు గనుల శాఖ అధికారులు రాకపోవడం, కాగ్ సైతం తనిఖీలు చేపట్టకపోవడం అనేక అనుమానాలకు దారితీస్తున్నదని కుండబద్దలు కొట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 40 లక్షల బొగ్గును పక్కదారి పట్టించాయా? అనే సందేహాలు కార్మికలోకాన్ని వెంటాడుతున్నాయని స్పష్టంచేశారు. ఈ స్కామ్‌ను దాచిపెట్టే కుట్రలు కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే అఖిలపక్షాన్ని గనుల వద్దకు పంపాలని డిమాండ్ చేశారు. అప్పుడే ఈ అక్రమాల పుట్టబద్దలవుతుందని లేఖలో కోరారు.

> కాంగ్రెస్ గద్దెనెక్కిన తర్వాత వరుస స్కామ్‌లతో వణికిపోతున్న సింగరేణిలో రూ.1,600 కోట్ల విలువచేసే బొగ్గును మాయం చేసి సంస్థ గొంతుకోసే కుట్రకు తెరతీసింద్రు. సంస్థ అధికారిక వెబ్‌సైట్ రికార్డుల్లో ఏడు గనుల వద్ద బొగ్గు స్టాక్ ఉన్నదని నమోదైంది. కానీ క్షేత్రస్థాయిలో నిల్వలు కనిపించకపోవడం ఈ స్కామ్ జరిగినట్టు తేటతెల్లం చేస్తున్నది. 40 లక్షల టన్నుల బొగ్గుపై కోల్‌సెస్‌తో పాటు, ఐటీ కట్టినమని లెక్కలు చూపుతున్నరు..బొగ్గు మాయం వెనుక ఎవరి హస్తం ఉన్నదో తేల్చాల్సిన అవసరమున్నది.
> –కేటీఆర్

సింగరేణిని కబళించే కుట్రలు..

కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటి సింగరేణిని కబళించే కుట్రలు జరుగుతున్నాయని కేటీఆర్ ధ్వజమెత్తారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ మాటున కోరుకున్న వారికి టెండర్లు కట్టబెట్టే కుతంత్రాన్ని అమలు చేశారని విమర్శించారు. సాక్షాత్తు సీఎం బావమరిది సృజన్‌రెడ్డి కనుసన్నల్లోనే ఈ వ్యవహారం జరుగుతున్నదని తెలిసినా ఎందుకు మిన్నకుంటున్నారని ప్రశ్నించారు. నైని కోల్‌స్కామ్ దేశవ్యాప్తంగా దుమారం రేపిందని, ఈ కుంభకోణాన్ని బీఆర్‌ఎస్ బయటపెట్టగానే ఆగమేఘాలపై డిప్యూటీ సీఎం టెండర్లు రద్దుచేస్తున్నట్టు ప్రకటించారని గుర్తుచేశారు. కానీ అక్రమార్కుల భరతంపట్టే దిశగా ఒక్క అడుగుకూడా వేయలేదని విమర్శించారు. టెండర్ పోటీదారులను బెదిరించి, భయపెట్టి తప్పించేలా సాగిన పన్నాగాలకు అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేయలేదని పేర్కొన్నారు. ఈ టెండర్లలో జరిగిన అక్రమాల నిగ్గుతేల్చేందుకు కేంద్రం వేసిన కమిటీ ఇప్పటివరకు ఏం తేల్చిందో కూడా తెలియడంలేదని దెప్పిపొడిచారు. నైని స్కామ్‌పై సమగ్ర విచారణ జరిపి మూడురోజుల్లో నివేదించాలని ఆదేశించిన మోదీ ప్రభుత్వం ఎందుకు మొద్దునిద్రపోతున్నదో? కార్మికులకు సమాధానం చెప్పాలని నిలదీశారు. 'అసలు బొగ్గు ఉత్పత్తిలో కోల్ ఇండియా పాటించే విధానాలేంటి? సైట్ విజిట్ సర్టిఫికెట్ సిస్టమ్‌ను ఎవరి ప్రయోజనాల కోసం తెచ్చారు? ఆఖరుకు కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులను ఎలా పక్కదారి పట్టించారు? అనే అంశాలపై నిజాలు నిగ్గుతేల్చకపోవడం కాంగ్రెస్ సీఎం రేవంత్‌తో మీకున్న లోపాయికారి ఒప్పందాలను బట్టబయలు చేస్తున్నది'అంటూ విమర్శించారు.

కాంగ్రెస్, బీజేపీ చీకటి ఒప్పందాలు

నైని స్కామ్‌తో పాటు 107 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టుల నిబంధనలకు పాతరేసి, జాతీయస్థాయిలో సగటుకు మించి అత్యధిక ధరలకు టెండర్లు కట్టబెట్టి అక్రమాలకు తెరలేపారని కేటీఆర్ వివరించారు. 'ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ నుంచి డీజిల్ కొనుగోలు చేసే విధానాన్ని అర్ధాంతరంగా రద్దుచేసి దోపిడీకి పాల్పడ్డారు. పేలుడు పదార్థాల కొనుగోళ్లలో కోల్ ఇండియా కంటే 30 శాతం అధిక నిధులు చెల్లించి అనుయాయులకు కట్టబెట్టారు. చివరికీ మెస్సీతో సీఎం రేవంత్ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు రూ. 110 కోట్ల సింగరేణి నిధులను దుర్వినియోగం చేసినా కేంద్రం పట్టించుకోలేదు'అని దుయ్యబట్టారు. వరుస స్కామ్‌లు జరుగుతున్నా అక్రమార్కుల భరతం పట్టకుండా కేంద్రం మీనమేషాలు లెక్కించడం శోచనీయమని వాపోయారు. దీని వెనుక కాంగ్రెస్, బీజేపీ చీకటి ఒప్పందాలే కారణమని కార్మికులకు అర్థమైపోయిందని స్పష్టంచేశారు. సింగరేణిలో అక్రమ దందాలను వెలుగులోకి తెచ్చేందుకు చివరికీ ఆర్టీఐ కింద దరఖాస్తు చేసిన వివరాలు బయటకు రాకుండా దుష్టశక్తులు అడ్డుకుంటున్నాయని ధ్వజమెత్తారు.

విచారణ జరుపకుంటే బీఆర్‌ఎస్ జంగ్‌సైరన్

కాంగ్రెస్ పాలనలో సింగరేణిలో వరుస కుంభకోణాలు జరుగుతుంటే కేంద్ర మంత్రి హోదాలో ఉన్న కిషన్‌రెడ్డి పట్టించుకోకపోవడంతో సింగరేణి కార్మికుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నదని కేటీఆర్ హెచ్చరించారు. ఏదేమైనా సింగరేణిని నిర్వీర్యం చేసి వేలాది కార్మికుల పొట్టగొట్టే కాంగ్రెస్-బీజేపీ కుట్రలను బీఆర్‌ఎస్ ఎప్పటికీ సహించబోదనే విషయాన్ని కిషన్‌రెడ్డి గుర్తుంచుకోవాలని హితవుపలికారు. సీఎంతో రహస్య ఒప్పందాల ముసుగులో సింగరేణిని బలిపెట్టవద్దని డిమాండ్ చేశారు. రూ. 16,00 కోట్ల కోల్‌స్కామ్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం చేస్తే ఊరుకొనేదిలేదని, కార్మికలోకంతో కలిసి కాంగ్రెస్-బీజేపీ సర్కార్లపై జంగ్‌సైరన్ మోగిస్తామని హెచ్చరించారు.

రేవంత్‌రెడ్డిది చిల్లర రాజకీయం

- కాంగ్రెస్ సోషల్‌మీడియాలో కేటీఆర్‌పై దుష్ప్రచారం
- రాజేశ్ ఎక్స్‌పోర్ట్ కంపెనీని ఆయనకు అంటగట్టేయత్నం
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ దాసోజు ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రావణ్‌కుమార్

హైదరాబాద్, జూన్ 5(నమస్తేతెలంగాణ): 'సీఎం రేవంత్‌రెడ్డి హోదాను మరచి, విచక్షణ కోల్పోయి చిల్లర రాజకీయం చేస్తున్నరు. రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ విషయంలో బీజేపీని వదిలిపెట్టి కేటీఆర్‌ను బద్నాం చేస్తున్నరు. తన అనుకూల మీడియా, సోషల్ మీడియా వేదికల ద్వారా శాడిస్టులా దుష్ప్రచారానికి దిగుతున్నరు' అని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి సొంతంగా ఒక్క పెట్టుబడిని తీసుకురాలేని అసమర్థుడని మండిపడ్డారు. తన చేతగానితనాన్ని కప్పిపుచ్చుకొనేందుకు 24 గంటలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై అనుచిత విమర్శలకు దిగుతున్నారని దుయ్యబట్టారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రాజేశ్ ఎక్స్‌పోర్ట్ అంతర్జాతీయ ఖ్యాతి కలిగిన ప్రతిష్ఠాత్మక కంపెనీ అని కేంద్రమే ఐఎస్ఐ ముద్ర వేసిందని గుర్తుచేశారు. 2022లో మోదీ సర్కార్ ఈ కంపెనీని దేశంలోని అతిపెద్దదైన రూ.18,100 కోట్ల ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ కింద ఎంపిక చేసిందని, రూ. 600 కోట్ల ఎల్ఐసీ నిధులను ఈ కంపెనీలో పెట్టుబడిగా పెట్టేందుకు అనుమతిచ్చిందని స్పష్టంచేశారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణలో సెమీ కండక్టర్/చిప్ డిస్‌ప్లే ఫాబ్ ఇండస్ట్రీని ప్రమోట్ చేసేందుకు అప్పటి పరిశ్రమల శాఖ మంత్రిగా కేటీఆర్ రాజేశ్ ఎక్స్‌పోర్ట్‌తో ఎంవోయూ చేసుకున్నారని తెలిపారు. కానీ, కంపెనీకి ఒక్క ఇంచుకూడా ఇవ్వలేదని, రాష్ట్ర ఖజానాకు పైసా నష్టం జరుగలేదని, బీఆర్‌ఎస్ సర్కార్ రూపాయి గ్రాంట్, ఇన్సెంటివ్ ఇవ్వలేదని స్పష్టంచేశారు. సదరు ప్రాజెక్టు సంతకాల దశలోనే ముగిసిపోయిందని గుర్తుచేశారు.

దావోస్ పెట్టుబడుల పేరిట కట్టుకథలు..

సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ పెట్టుబడులపై కట్టుకథలు చెబుతున్నారని దాసోజు నిప్పులు చెరిగారు. సొంత తమ్ముడి కంపెనీలతో ఒప్పందాలు చేసుకొని ప్రజాధనాన్ని కట్టబెడుతున్నారని మండిపడ్డారు. రూ. లక్ష కూడా పెట్టుబడి లేని 'స్వచ్ఛ్ బయో, గోడీ మీడియా' లాంటి షెల్ కంపెనీలతో అగ్రిమెంట్లు చేసుకున్న ఘనత ఆయనకే దక్కిందని ఎద్దేవాచేశారు. ప్రజల సొమ్ముతో దావోస్‌లో జల్సాలు చేయడం తప్ప చేసిందేమీ లేదని దెప్పిపొడిచారు. దావోస్ పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పాలనలో పారదర్శక పెట్టుబడులే లక్ష్యంగా తీసుకొచ్చిన టీఎస్ ఐపాస్, డాష్‌బోర్డుకు రేవంత్ సర్కార్ పాతరేసిందని విమర్శించారు. కేటీఆర్.. రూ.50 వేల కోట్లు ఉన్న ఐటీ ఎగుమతులను రూ.3 లక్షల కోట్లకు చేర్చారని ప్రశంసించారు. ఇప్పటికైనా ప్రగల్భాలు, తప్పుడు ఆరోపణలు మాని పాలనపై దృష్టిపెట్టాలని హితవుపలికారు.

ఫేక్ కంపెనీకి ప్యాకేజీలు ఎందుకిచ్చారు?

రాజేశ్ ఎక్స్‌పోర్ట్ కంపెనీకి భూములు కట్టబెట్టారని, ఖజానా దోచిపెట్టారని సీఎం రేవంత్‌రెడ్డి కనుసన్నల్లోని మీడియా దుష్ప్రచారం దుర్మార్గమని దాసోజు ఖండించారు. మరీ ఫేక్ కంపెనీకి ప్రధాని మోదీ భారీ ప్యాకేజీలు ఎందుకిచ్చారు? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డికి బీజేపీని, తన బడే భాయ్‌ను ప్రశ్నించే దమ్మున్నదా? అని నిలదీశారు. ఢిల్లీకి పోయి బడే భాయ్‌కు దండాలు పెడ్తూ ఇక్కడ కేటీఆర్‌పై బురదజల్లడం శోచనీయమన్నారు.

కేటీఆర్ కృషి.. మైక్రోసాఫ్ట్ డాటా సెంటర్

ఈ ఏడాది ప్రారంభం కానున్న అతి పెద్ద కేంద్రం

- బీఆర్‌ఎస్ హయాంలో 2022లోనే ఎంవోయూ
- కేసీఆర్ విజన్, కేటీఆర్ చొరవకు దక్కిన ఫలితం
- మారనున్న హైదరాబాద్ ఐటీ ముఖ చిత్రం
- నాటి ఐటీ పాలసీతో దిగ్గజ సంస్థలకు గమ్యస్థానంలా హైదరాబాద్

హైదరాబాద్, జూన్ 5 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ హయాంలో తీసుకొచ్చిన ఐటీ పాలసీతో హైదరాబాద్ గ్లోబల్ టెక్నాలజీ దిగ్గజ సంస్థలకు అడ్డాగా మారింది. ఐటీ రంగం పట్ల తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రదర్శించిన దార్శనికత, నాడు ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రిగా కేటీఆర్ చూపిన చొరవకు ఈ ఏడాది రాష్ట్రంలో ప్రారంభం కానున్న మైక్రోసాఫ్ట్ భారీ డాటా సెంటర్ సజీవ సాక్ష్యం. 2022 మార్చి 7న టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ రూ.15 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నది. దేశీయంగా కృత్రిమ మేధ(ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్ సేవలకు గిరాకీ పెరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్టును ప్రస్తుతం వేగంగా పూర్తి చేసి ఈ ఏడాదిలో అందుబాటులోకి తేనున్నారు. దేశీయంగా ఇప్పటికే పుణె, ముంబై, చెన్నై నగరాల్లో మైక్రోసాఫ్ట్ డాటా సెంటర్లు ఉండగా.. వీటన్నింటి కంటే హైదరాబాద్‌లో ఏర్పాటుచేస్తున్న డాటా సెంటరే అతి పెద్దది కావడం గమనార్హం. స్థానిక వ్యాపారాభివృద్ధికి ఈ డాటా సెంటర్ పరోక్షంగా ఎంతగానో దోహదపడుతుందని భావిస్తున్నారు. ఐటీ కార్యకలాపాలు, ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్, డాటా-నెట్‌వర్క్ సెక్యూరిటీ, నెట్‌వర్క్ ఇంజినీరింగ్ వంటి ఎన్నో విభాగాల్లో ఉద్యోగావకాశాలు రానున్నాయి. హైదరాబాద్‌లో పెట్టుబడి పెట్టేందుకు ముందు నుంచీ ఆసక్తి చూపిన మైక్రోసాఫ్ట్ సంస్థ బీఆర్‌ఎస్ హయాంలోనే రూ.276 కోట్లతో 115 ఎకరాలు కొనుగోలు చేసింది. రూ.40 కోట్లతో మేకగూడలో 22 ఎకరాలు, రూ.164 కోట్లతో షాద్‌నగర్‌లో 41 ఎకరాలు, రూ.72 కోట్లతో చందన్‌వెల్లిలో 52 ఎకరాలు దక్కించుకొన్నది. దేశంలోనే భారీ డాటా సెంటర్‌కు భాగ్య నగరాన్ని మైక్రోసాఫ్ట్ ఎంచుకోవడంతో మరిన్ని దిగ్గజ సంస్థలు క్యూ కట్టే అవకాశం ఉన్నదని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

'ఏఐ ఇన్నోవేషన్'లో కీలక పాత్ర

ఏఐ వినియోగం, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, క్లౌడ్ బేస్డ్ ఎంటర్‌ప్రైజెస్ సేవలు వేగంగా విస్తరిస్తున్న తరుణంలో ఈ ప్రాజెక్టు అత్యంత కీలకంగా మారుతుందని ఐటీరంగ విశ్లేషకులు చెప్తున్నారు. మన దేశంలో వంద కోట్ల మందికిపైగా ఇంటర్నెట్‌ను వినియోగిస్తుండటం, నైపుణ్యాలు ఉన్న వర్క్‌ఫోర్స్, విస్తరిస్తున్న స్టార్టప్ ఎకో సిస్టమ్ కారణంగా మైక్రోసాఫ్ట్ తన డాటా సెంటర్లను విస్తరిస్తున్నది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా రూ.1.45 లక్షల కోట్ల పెట్టుబడులు ప్రకటించిన మైక్రోసాఫ్ట్ అందులో అధిక మొత్తాన్ని హైదరాబాద్‌లోని డాటా సెంటర్ల విస్తరణకు కేటాయించనున్నది. దేశవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్‌లో 22,000 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా.. ఇందులో ఇంజినీరింగ్, క్లౌడ్ సర్వీసు, రీఅస్సెర్టింగ్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ ఆపరేషన్లలో వారు విధులు నిర్వహిస్తున్నారు. గ్లోబల్ టెక్ దిగ్గజమైన మైక్రోసాఫ్ట్ భారీ స్థాయిలో డాటా సెంటర్లను విస్తరించడంతో రాబోయే రోజుల్లో ఏఐ ఇన్నోవేషన్, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ మౌలిక సదుపాయాల్లో హైదరాబాద్ మరింత కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దేశీయ ఐటీ సంస్థలు టాటా కన్సల్టెనీ సర్వీసెస్ (టీసీఎస్), ఇన్ఫోసిస్‌తోపాటు కాగ్నిజెంట్ వంటి సంస్థలు తమ ఎంటర్‌ప్రైజ్ ఏఐ విస్తరణ, క్లౌడ్ వినియోగాన్ని పెంచుతున్నాయి. సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, ఆటోమేషన్, ఎంటర్‌ప్రైజ్ ఉత్పాదకతకు ఈ సంస్థలు మైక్రోసాఫ్ట్ ఏఐ టూల్స్, లైసెన్స్‌లు పెద్ద ఎత్తున కొనుగోలు చేశాయి. ఏఐ వర్క్‌లోడ్, క్లౌడ్ స్టోరేజ్, హై పెర్ఫామెన్స్ కంప్యూటింగ్ సేవల కోసం పెరుగుతున్న అవసరాలను తీర్చడంలో హైదరాబాద్ డాటా సెంటర్ దోహదపడుతుందని మైక్రోసాఫ్ట్ పేర్కొన్నది.



బీఆర్‌ఎస్ హయాంలో పాలసీలతో కంపెనీల క్యూ

బీఆర్‌ఎస్ హయాంలో ఐటీ రంగం అభివృద్ధికి తీసుకొచ్చిన పాలసీతో అనేక దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌కు 'క్యూ' కడుతున్నాయి. టీఎస్ ఐపాస్‌తో దేశంలో ఎక్కడా లేని విధంగా కొత్తగా కంపెనీ పెట్టాలనుకొనే వారికి ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో భాగంగా ప్రభుత్వం అనుమతితో పని లేకుండా మొదటి రోజు నుంచే తమ కార్యకలాపాలు సాగించేలా వ్యవస్థను రూపొందించారు. ఈ పాలసీతో ఆన్‌లైన్ ద్వారా తమ కంపెనీ వివరాలు అందించి కేవలం 15 రోజుల్లోనే పూర్తి స్థాయి అనుమతి పొందే వెసులుబాటు కల్పించారు. యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)ను ఏర్పాటుచేశారు. టీ-హబ్ ఇంక్యుబేటర్ ద్వారా స్టార్టప్‌ల అభివృద్ధికి కృషిచేశారు. అద్భుతమైన రోడ్లు, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ఇండస్ట్రియల్ పార్క్‌లు, డాటా కనెక్టివిటీతోపాటు ప్రపంచంలోనే అతి పెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్ టీ-హబ్‌లను బీఆర్‌ఎస్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించడంతో బహుళజాతి కంపెనీలు హైదరాబాద్ వైపు మొగ్గుచూపుతున్నాయి. బీఆర్‌ఎస్ హయాంలో ప్రజల సంక్షేమంతోపాటు మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయడంతో నేడు ఆ ఫలితాలు మన కండ్ల ముందు ఆవిష్కృతమవుతున్నాయి.

> 'హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ ఇంతటి భారీ స్థాయి డాటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తుండటం సంతోషంగా ఉన్నది. రూ.15,000 కోట్లకుపైగా పెట్టుబడులను ఇక్కడ పెట్టాలని సంస్థ నిర్ణయించింది. రాష్ట్రానికి వచ్చిన భారీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో ఇది కూడా ఒకటి కానున్నది. ఈ డాటా సెంటర్ ఏర్పాటుతో ఐటీ కార్యకలాపాలు, డాటా నెట్‌వర్క్, నెట్‌వర్క్ ఇంజినీరింగ్ వంటి విభాగాల్లో ఉద్యోగవకాశాలు పెరుగుతాయి.'
>
> –ఎంవోయూ సందర్భంగా 2022 మార్చి 7న నాటి ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు

జల హక్కుల రక్షణలో కాంగ్రెస్ ఫెయిల్

రేవంత్ నిర్లక్ష్యంతో తెలంగాణకు తీవ్ర ముప్పు ● ఏపీ 74 % వాడితే, తెలంగాణ 25 శాతానికే పరిమితం: హరీశ్‌రావు

- కృష్ణా నీటి వినియోగంలో చారిత్రక కనిష్ఠ స్థాయికి రాష్ట్రం
- ప్రమాదంలో రైతులు, తాగునీరు, పరిశ్రమల భవిష్యత్తు
- సోలార్ విద్యుత్తు విధానాలతో సాగునీటి రంగానికి ముప్పు
- రైతు డిస్కమ్ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలి
- లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు 24 గంటల నాణ్యమైన కరెంటివ్వాలి
- కాళేశ్వరం, దేవాదుల నిర్వహణకు తగిన నిధులు కేటాయించాలి
- రాష్ట్ర భవిష్యత్తు ప్రశ్నార్థకం కాకుండా జల హక్కులను కాపాడాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ లేఖ



సీఎం రేవంత్‌రెడ్డికి రాష్ట్రంలో కృష్ణా నీటి వినియోగంపై కనీస అవగాహన లేకపోవడం పాలమూరుకే కాదు, యావత్ తెలంగాణకు దురదృష్టకరం. ఇలాంటి అవగాహన లేని వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం తెలంగాణ జల హక్కులకు తీవ్ర విఘాతం. –హరీశ్

రాష్ట్రంలోని లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణపై కాంగ్రెస్ సర్కార్ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది. కాళేశ్వరం గాయత్రీ పంపింగ్ స్టేషన్, దేవాదుల తదితర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో పంపులు, మోటర్లు దెబ్బతిన్నయ్. భారీ మోటర్లను పదేపదే ఆన్–ఆఫ్ చేయడం వల్ల పరికరాలు దెబ్బతింటాయని ముందుగానే మేం హెచ్చరించినా చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైంది. –హరీశ్

హైదరాబాద్, జూన్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల తెలంగాణ జల హక్కులకు తీవ్ర ప్రమాదం వాటిల్లిందని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎత్తిపోతల పంపుల నిర్వహణ లోపాలపై గత ఏప్రిల్ 7న లేఖ రూపంలో బీఆర్ఎస్ చేసిన హెచ్చరికలను ప్రభుత్వం బేఖాతరు చేయడం వల్లే నేడు పంపులు దెబ్బతిని, కాళేశ్వరం, దేవాదుల వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల నిర్వహణ దారుణంగా విఫలమైందని మండిపడ్డారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయిందని, ఏపీ 74 శాతం నీటిని వినియోగించుకుంటుంటే, తెలంగాణ కేవలం 25 శాతానికే పరిమితం కావడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ తీసుకుంటున్న సోలార్ ఆధారిత విద్యుత్తు విధానాలు సాగునీటి రంగానికి తీవ్ర ముప్పుగా మారబోతున్నాయని హెచ్చరిస్తూ.. వివాదాస్పద రైతు డిస్కమ్ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయడంతోపాటు, కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణకు తగిన నిధులు తక్షణమే కేటాయించి, తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయకుండా రాష్ట్ర జల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు.

లిఫ్టులకు నష్టం వాటిల్లితే సర్కార్‌దే బాధ్యత

రాష్ట్రంలోని లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణలో కాంగ్రెస్ సర్కార్ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నదని హరీశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'కాళేశ్వరం గాయత్రి పంపింగ్ స్టేషన్, దేవాదుల తదితర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో పంపులు, మోటర్లు దెబ్బతిన్నాయి. భారీ మోటర్లను పదే పదే ఆన్–ఆఫ్ చేయడం వల్ల పరికరాలు దెబ్బతింటాయని ముందుగానే మేం హెచ్చరించినా చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైంది. వేల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన కీలక సాగునీటి మౌలిక వసతులు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నష్టపోతుండటం శోచనీయం' అని వాపోయారు. సోలార్ విద్యుత్తు అందుబాటులో ఉండే పగటి వేళల్లోనే లిఫ్ట్ ఇరిగేషన్ పంపులు నడుపాలని ట్రాన్స్ కో సూచించడం వల్ల, భారీ పంపులను తరచూ స్టార్ట్, స్టాప్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నదని తెలిపారు. ఈ విధానాల వల్ల పంపులు, మోటర్లకు నష్టం జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ నిర్ణయాలకు ముందు సాంకేతిక అధ్యయనం జరిగిందా? లేదా? అని ప్రశ్నించారు.

జీవో 8తో అనేక ప్రమాదాలు

జీవో 8 వల్ల అనేక ప్రమాదాలు ఉన్నాయని హరీశ్ ఆందోళన వ్యక్తంచేశారు. 'టీజీఆర్ పీడీసీఎల్‌కు అధిక పునరుత్పాదక (సోలార్) విద్యుత్తు కేటాయించాల్సి వస్తుంది. సోలార్ విద్యుత్తు ప్రధానంగా ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకే అందుబాటులో ఉంటుంది. దీంతో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పంపింగ్ కార్యకలాపాలు పరిమిత సమయానికి కట్టుబడే ప్రమాదం ఉన్నది. నీటి ఎత్తిపోతలు తగ్గి, కృష్ణా–గోదావరి జలాల వినియోగ సామర్థ్యం దెబ్బతింటయ్. కాళేశ్వరం, దేవాదుల, పాలమూరు ఇతర ప్రాజెక్టుల ప్రధాన లక్ష్యం తెలంగాణకు రావాల్సిన కృష్ణా, గోదావరి జలాలను పూర్తిగా వినియోగించుకోవడం. విద్యుత్తు లభ్యత ఆధారంగా పంపింగ్‌ను పరిమితం చేయడం రాష్ట్ర జల హక్కులకు విరుద్ధం. నీటి వినియోగం తగ్గితే వ్యవసాయం, తాగునీరు, భూగర్భ జలాలు, చేపల పెంపకం, పరిశ్రమలు, విద్యుత్తు ఉత్పత్తి, గ్రామీణ జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతుంది' అని వివరించారు.

తొలిసారిగా కనిష్ఠ నీటి వినియోగం

కాంగ్రెస్ పాలనలో కృష్ణా జలాల వినియోగం కనిష్ఠ స్థాయికి చేరిందని హరీశ్ విమర్శించారు. 'తెలంగాణకు కేటాయించిన తాత్కాలిక నీటి వాటా 34శాతం కాగా, ఏపీకి 66 శాతంగా ఉన్నది. 2024–25లో ఆంధ్రప్రదేశ్ 72.73 శాతం నీటిని వినియోగించగా, తెలంగాణ 27.27 శాతం మాత్రమే వాడుకున్నది. 2025–26లో ఏపీ వినియోగం 74.90 శాతానికి పెరుగగా, తెలంగాణ వినియోగం చారిత్రక కనిష్ఠమైన 25.10 శాతానికి పడిపోయింది. తెలంగాణ జల హక్కులు, రైతుల ప్రయోజనాలను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి ఇది మరో నిదర్శనం' అని మండిపడ్డారు. 'లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు పంపింగ్ సీజన్‌లో 24 గంటల నిరంతర విద్యుత్తు సరఫరా కల్పించాలి. తెలంగాణకు రావాల్సిన కృష్ణా, గోదావరి జలాల పూర్తి వినియోగం కోసం తక్షణ చర్యలు చేపట్టాలి. రైతు డిస్కమ్ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి. కాళేశ్వరం, దేవాదుల తదితర ప్రాజెక్టుల నిర్వహణ, ఆధునికీకరణకు తగిన బడ్జెట్ కేటాయించాలి. వ్యవసాయం, తాగునీరు, పరిశ్రమలు, విద్యుత్తు ఉత్పత్తి తదితర రంగాలకు తగిన నీటి లభ్యతను నిర్ధారించాలి' అని డిమాండ్ చేశారు.

పాలమూరును అడ్డుకున్నది కాంగ్రెస్సే

సీఎం రేవంత్‌రెడ్డికి రాష్ట్రంలో కృష్ణా నీటి వినియోగంపై కనీస అవగాహన లేకపోవడం పాలమూరుకే కాదు, యావత్ తెలంగాణకు దురదృష్టకరమని హరీశ్ విమర్శించారు. ఇలాంటి అవగాహన లేని వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం తెలంగాణ జల హక్కులకు తీవ్ర విఘాతమని ఆందోళన వ్యక్తంచేశారు. మహబూబ్‌నగర్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా హరీశ్ ఎక్స్ వేదికగా ఘాటుగా స్పందించారు. ఈ ఏడాది మే 2న తెలంగాణ ఈఎన్సీ కృష్ణా బోర్డుకు రాసిన అధికారిక లేఖను హరీశ్ తన పోస్టుకు జతపరిచారు. ఏపీ 74 శాతం కృష్ణా నీటిని వాడితే, తెలంగాణ 25 శాతానికే పరిమితమైందని తెలిపారు. 'మీ లాగా ఆధారం లేకుండా, అడ్డగోలుగా అబద్ధాలు మాట్లాడే అలవాటు నాకు లేదు రేవంత్‌రెడ్డీ! మీ ప్రభుత్వం రాసిన అధికారిక లేఖల్లో ఏమున్నదో కూడా మీకు, నీళ్ల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి తెలియదా? అధికారంలోకి వచ్చి 30 నెలలు దాటినా ఇంకెప్పుడు ఇరిగేషన్ మీద ప్రిపేర్ అవుతరు?' అని చురకలంటించారు. పాలమూరు బిడ్డనని చెప్పుకొనే రేవంత్‌రెడ్డి, రెండున్నరేండ్లలో ఉమ్మడి పాలమూరు జిల్లాకు చేసింది గుండుసున్నా అని ఎద్దేవాచేశారు. 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు, 1,226 గ్రామాలకు తాగునీరు అందించే పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయకుండా పాలమూరుకు కాంగ్రెస్ ప్రభుత్వం ద్రోహం చేస్తున్నదని మండిపడ్డారు. నాడు ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా కేసులు వేయించి, పనుల పురోగతిని అడ్డుకున్నది రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీయేనని, ఆ కేసులను ఎదుర్కొని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్ట్ పనులను పరుగులు పెట్టించిందని గుర్తుచేశారు. నాడు కాంగ్రెస్ ఎన్ని అడ్డంకులు సృష్టించినా, రైతులను రెచ్చగొట్టినా, బీఆర్ఎస్ ప్రభుత్వం 27,191 ఎకరాల భూసేకరణ చేసిందని స్పష్టంచేశారు. మరి ఈ రెండున్నరేండ్ల కాంగ్రెస్ పాలనలో ఎన్ని ఎకరాల భూమి సేకరించారో చెప్పాలని డిమాండ్ చేశారు. సగం పాలనా కాలం పూర్తయిన తర్వాత ఇప్పుడు కుంభకర్ణ నిద్రలేచి, భూసేకరణకు ప్రతిపాదనలు అనడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఏడాదికి ఆరు లక్షల ఎకరాల చొప్పున, రెండేండ్లలో 12 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తామని అసెంబ్లీ సాక్షిగా చెప్పి మాట తప్పిన రేవంత్‌రెడ్డికి ఇరిగేషన్ గురించి మాట్లాడే హక్కు, అర్హత లేవని తేల్చిచెప్పారు.

పాలమూరు తలరాత మార్చింది కేసీఆరే

గత టీడీపీ, కాంగ్రెస్ పాలనలో వలసలు, ఆకలి చావులకు నిలయంగా మారిన పాలమూరు తలరాతను మార్చింది కేసీఆరేనని హరీశ్ గుర్తుచేశారు. వలసపోయిన వాళ్లను తిరిగి వాపస్ తెచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టంచేశారు. కాంగ్రెస్ పాలనలో పెండింగ్‌లో ఉన్న కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చామని, 2014 వరకు 27 వేల ఎకరాలు మాత్రమే సాగైన ఆయకట్టును భూసేకరణ ద్వారా ఆరున్నర లక్షల ఎకరాలకు పెంచామని వివరించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క పాలమూరులోనే మొత్తంగా 10 లక్షల ఎకరాలకు నీళ్లందించామని గుర్తుచేశారు. ఆర్డీఎస్ ఆయకట్టుకు నీళ్లు అందకపోతే తుమ్మిళ్ల లిఫ్ట్ ఇరిగేషన్‌తో రైతాంగాన్ని ఆదుకున్న ఘనత బీఆర్ఎస్‌దేనని తెలిపారు. 'ఈ 30 నెలల కాలంలో తట్టెడు మట్టి తీయకుండా, ఒక్క చెక్ డ్యామ్ కట్టకుండా కేసీఆర్ గురించి, బీఆర్ఎస్ పాలన గురించి మాట్లాడటం మీ చేతగానితనానికి నిదర్శనం. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన మీరు, అవే అబద్ధాలతో ప్రభుత్వాన్ని నడుపలేరనే విషయాన్ని గుర్తుంచుకోండి' అంటూ సీఎం రేవంత్ రెడ్డికి హితవు పలికారు.



నిర్మల్ జిల్లా కుభీర్‌లో జొన్నల విక్రయానికి టోకెన్ల కోసం శుక్రవారం రాత్రి నుంచే బారులు తీరిన రైతులు

జొన్నల టోకెన్ల కోసం రాత్రి నుంచే బారులు

కుభీర్, జూన్ 5 : నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలో జొన్నల కొనుగోళ్లకు టోకెన్లను శనివారం ఉదయం నుంచి పంపిణీ చేస్తామని అధికారులు ప్రకటించడంతో వందలాది మంది రైతులు శుక్రవారం రాత్రి నుంచే ఐకేపీ కార్యాలయానికి చేరుకొని బారులు తీరారు. కార్యాలయ ఆవరణలో చీకటిలో బండరాళ్లు క్యూలో పెట్టి అక్కడే ఇరువైపులా పడుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో క్వింటాల్‌కు మద్దతు ధర రూ.3,700 కాగా ప్రైవేట్ వ్యాపారులు మాత్రం రూ.2,200 కొంటున్నారని, అందుకే టోకెన్ల కోసం తిప్పలు పడుతున్నామని రైతులు తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఇలాంటి కష్టం రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటున్నదని పలువురు ఆగ్రహం వ్యక్తంచేశారు.



ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం వాసాలమర్రిలో భువనగిరి– గజ్వేల్ ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహిస్తున్న రైతులు

ధాన్యం కొనాలని వాసాలమర్రిలో రైతుల ధర్నా

తుర్కపల్లి, జూన్ 5: ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వాసాలమర్రిలోని కొనుగోలు కేంద్రం ఎదుట భువనగిరి–గజ్వేల్ ప్రధాన రహదారిపై రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రెండు నెలల క్రితం గ్రామంలో కేంద్రాన్ని ఏర్పాటు చేసినా, కొనుగోళ్లు నత్తనడకన సాగుతుండటంతో నేటికీ వందకుపైగా ధాన్యం కుప్పలు అలాగే నిలిచిపోయాయని అన్నారు. కేంద్రాల్లో నెలల తరబడి వేచి చూస్తున్నామని, ఇప్పటికే రెండు, మూడుసార్లు వర్షాలు పడి ధాన్యం మొలక వచ్చే పరిస్థితి వచ్చింది ఆందోళన వ్యక్తంచేశారు. అధికారులు వచ్చి ధాన్యం పరిశీలించి ఫొటోలకు పోజులు ఇస్తున్నారు తప్ప ధాన్యం తరలింపుపై శ్రద్ధ చూపడం లేదని మండిపడ్డారు.

కేజీబీవీ, నాన్ టీచింగ్, వర్కర్లకు వేతనాలు పెంచండి

హైదరాబాద్, జూన్ 5 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల ప్రకటించిన కనీస వేతనాల ప్రకారం కేజీబీవీ, నాన్ టీచింగ్, వర్కర్లకు వేతనాలు పెంచాలని ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ)రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎల్ పద్మ, ఎం సుధాకర్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం మహాత్మ జ్యోతిబాపూలే ప్రజాభవన్ ఇన్‌చార్జి చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలే మూడు జోన్లుగా కనీస వేతనాలు ప్రకటించారని పేర్కొన్నారు. ఈ కనీస వేతనాలు కూడా కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్లకు అందడంలేదని వివరించారు. వినతిపత్రం ఇచ్చినవారిలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ, పుష్పలత, సహాయ కార్యదర్శి వీరమని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలేవి మహాప్రభో!

5 నెలల నుంచి 12,702 మంది పంచాయతీ సర్పంచుల ఎదురుచూపు

- 62 వేల మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకూ 2 నెలలుగా అందని జీతాలు
- ఉపాధి సిబ్బందికీ 2 నెలలుగా పెండింగ్
- రాష్ట్ర కాంగ్రెస్ సర్కార్‌పై సర్పంచులు, ఆయా విభాగాల ఉద్యోగుల మండిపాటు
- సోషల్ మీడియా వేదికల్లో సీఎం రేవంత్‌పై వెల్లువెత్తుతున్న వ్యతిరేక పోస్టులు, మీమ్‌లు

హైదరాబాద్, జూన్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పంచాయతీ సర్పంచుల గౌరవ వేతనాలు ఐదు నెలలుగా అందడం లేదు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు రెండు నెలలైనా వారి ఖాతాల్లో జీతాలు జమకాలేదు. ఉపాధి సిబ్బందికీ ఏప్రిల్, మే నెల జీతాలు ఇవ్వనేలేదు. వీరంతా సుమారు 95,346 మందికి పైగా ఉంటారు. ఈ అంశాలే రాష్ట్రంలో ప్రతి ఉద్యోగికీ ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తున్నామన్న కాంగ్రెస్ పాలకుల మాటలు నీటిమూటలుగా మారుతున్నాయనడానికి నిదర్శనాలు. రాష్ట్రంలోని వివిధ విభాగాల్లో నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో పడుతున్నాయి. ఫలితంగా ఆయా విభాగాల సిబ్బంది ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నాయి. అన్నిశాఖల హెచ్‌వోడీలు ఆయా శాఖల్లో పనిచేస్తున్న ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, దినసరి వేతనాలు పొందే అన్ని విభాగాల సిబ్బందికి ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఐఎఫ్ఎంఎస్) ద్వారా వివరాలు తీసుకొని ప్రతినెలా క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాలని ఆర్థికశాఖ నుంచి ఆదేశాలు వెలువడినా క్షేత్రస్థాయిలో అమలుకు నోచడం లేదు. వచ్చే కొద్దిపాటి వేతనాలు కూడా నెలల తరబడి తొక్కిపెట్టడంతో బడుగు వేతన జీవులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే జూన్.. ఆపై పిల్లల బడి ఫీజులు, పుస్తకాలు, యూనిఫామ్‌లు ఇతర ఖర్చులకు చేతిలో చిల్లిగవ్వ లేక ఆయా కుటుంబాలు సతమతం అవుతున్నాయి. తమ పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆయా శాఖల కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేస్తున్నారు. అయినా, పట్టించుకొనే నాథుడే లేకపోవడంతో సోషల్ మీడియా వేదికలపై అటు ప్రభుత్వంపై, ఇటు పాలకులపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. కాంగ్రెస్ సర్కార్ తీరును, సీఎం రేవంత్‌రెడ్డి వైఖరిని ఎద్దేవా చేస్తూ మీమ్స్, వ్యతిరేక పోస్టులు చేస్తున్నారు.



అంగన్‌వాడీలకు రెండు నెలలుగా..

రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో 99, పట్టణ ప్రాంతాల్లో 25, గిరిజన ప్రాంతాల్లో 25 ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ (ఐసీడీఎస్) చొప్పున మొత్తంగా 149 ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 35,781 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తుండగా ఒక్కో కేంద్రంలో టీచర్, ఆయా పనిచేస్తున్నారు. ఇలా రాష్ట్రంలో 70 వేల మందికిపైగా పనిచేస్తున్నారు. వీరు తమకు రెండు నెలలుగా వేతనాలు అందడం లేదని ప్రభుత్వానికి, అధికారులకు మొరపెట్టుకోగా, ఇటీవలే కేవలం పది జిల్లాల సిబ్బందికి ఏప్రిల్ నెల వేతనం మాత్రమే చెల్లించారు. మిగిలిన 23 జిల్లాల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు విడుదల చేయనేలేదు. ఏ ప్రాతిపదికన వీరికి వేతనాలు విడుదల చేశారో తెలియదు. మే నెల వేతనం మాత్రం ఎవరికీ రాలేదు. గతంలో అప్‌గ్రేడ్ అయిన అంగన్‌వాడీ టీచర్లకు 12 నెలల వేతనాలు ఏడాదికాలంగా తొక్కిపెట్టారు. పాత బకాయిలతోపాటు రెండు నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరుతూ మహిళా శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ శృతి ఓఝాకు తెలంగాణ రాష్ట్ర అంగన్‌వాడీ (మినీ) టీచర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షురాలు ఆడెపు వరలక్ష్మి నేతృత్వంలో ప్రతినిధులు శుక్రవారం వినతిపత్రం అందించారు.

ఉపాధి సిబ్బందికి పస్తులే..

రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద 12,500 మందికి పైగా సిబ్బంది వివిధ క్యాటగిరీల్లో పనిచేస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం ఈ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు ఇలా 12,586 మంది పనిచేస్తున్నారు. వీరికి ఏప్రిల్, మే నెలల వేతనాలు ఇప్పటివరకు అందలేదు. ప్రతిసారీ ఒక నెల వేతనం చెల్లించి మరో నెల వేతనం పెండింగ్‌లో పెడుతున్నారని ఆయా సిబ్బంది వాపోతున్నారు. అప్పులు చేసి కాలం వెళ్లదీస్తున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నెలకు వచ్చేది కేవలం రూ.8,500. అది కూడా సక్రమంగా చెల్లించకపోతే కుటుంబాలను ఎట్లా పోషించాలి? అని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ ఫీల్డ్ అసిస్టెంట్ ప్రశ్నించారు.

సర్పంచులకు 5 నెలలుగా పెండింగ్

రాష్ట్రంలో పంచాయతీ సర్పంచులుగా బాధ్యతలు చేపట్టి 5 నెలలు దాటినా వారికి అణాపైసా సర్కార్ విదల్చలేదు. రాష్ట్రంలో మొత్తం 12,760 గ్రామ పంచాయతీలు ఉండగా, 12,702 గ్రామాల్లో కొత్తగా పాలకవర్గాలు ఏర్పడ్డాయి. నిరుడు డిసెంబర్ 22వ తేదీన పంచాయతీల్లో సర్పంచులు బాధ్యతలు చేపట్టారు. వీరికి నెలకు రూ.6,500 చొప్పున గౌరవ వేతనం ప్రభుత్వం ఇవ్వాల్సి ఉన్నది. ఇలా 5 నెలలుగా ఒక్కొక్కరికీ రూ.32,500 చొప్పున ప్రభుత్వం బకాయి పడింది. 5 నెలల బకాయి రాష్ట్రవ్యాప్తంగా రూ.41.28 కోట్లు రావాల్సి ఉన్నది. తమ గౌరవ వేతనాలు చెల్లించాలని సర్పంచులు ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదు.

అంగన్‌వాడీలకు వేతనాలు చెల్లించండి

అంగన్‌వాడీ (మినీ) టీచర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మి

హైదరాబాద్, జూన్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, రెండు నెలల పెండింగ్ వేతనాలను తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర అంగన్వాడీ(మినీ) టీచర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక, అధ్యక్షురాలు ఆడెపు వరలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం అసోసియేషన్ కమిటీ సభ్యులతో కలిసి మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శృతి ఓఝాకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కేవలం 10 జిల్లాలకే ఏప్రిల్ నెల జీతాలు అందాయని తెలిపారు. మిగిలిన 23 జిల్లాల టీచర్లకు వేతనం మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అప్‌గ్రేడ్ అయిన అంగన్వాడీ టీచర్లకు 12 నెలలుగా వేతనాలు పెండింగ్ లో పెట్టడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రతినెలా నిరంతరాయంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ, జీతాల కోసం వినతిపత్రాలు ఇస్తూ, అడుక్కోవాల్సిన పరిస్థితి రావడం శోచనీయమని వరలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కవిత, శోభ, శైలజ తదితరులు పాల్గొన్నారు.



జనగామ జిల్లా దేవరుప్పల మండలం ధర్మాపురంలోని కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

కాంగ్రెసోళ్లను రైతులు ఉరుకిచ్చి కొడ్తరు

- రెండు నెలలుగా రైతులు కన్నీరు పెడుతున్నా పంటలు కొంటలేరు
- రేవంత్ సర్కార్ రైతు వ్యతిరేకి
- రైతుల పక్షాన పోరాడుతాం.. సర్కార్ మెడలు వంచుతం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి ఫైర్

దేవరుప్పల, జూన్ 5: రైతులు రెండు నెలలుగా కల్లాల వద్ద కన్నీరు పెడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తున్నదని అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రశ్నించారు. రెండు నెలల క్రితం కొనుగోలు కేంద్రంలో వడ్లు పోస్తే కొనే దిక్కు లేదని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే దమ్ము ఏ ఒక్క మంత్రికైనా ఉన్నదా? అని ప్రశ్నించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరైనా వస్తే రైతులు ఉరుకిచ్చి కొడుతరని హెచ్చరించారు. ఇది ముమ్మాటికీ రైతు వ్యతిరేక ప్రభుత్వమేనని స్పష్టంచేశారు. శుక్రవారం ఆయన జనగామ జిల్లా దేవరుప్పల మండలం ధర్మాపురంలోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులతో మాట్లాడి వారి కష్టాలను తెలుసుకున్నారు. 'ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో పోసి రెండు నెలలైంది.. జోకే దిక్కు లేదు.. కాలం నెత్తిమీదికొచ్చింది. రోహిణి కార్తె సగం గడిచింది.. దుక్కులు దున్నలే. పిల్లాపాపలతోని కుటుంబం మొత్తం ఇక్కడనే నీలుగుతున్నం, వానలు కురిస్తే వడ్లు మట్టిపాలవుతయ్' అని పలువురు రైతులు ఎర్రబెల్లితో మొరపెట్టుకున్నారు. అనంతరం ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. ఇంత చేతగాని ప్రభుత్వాన్ని తానెన్నడూ చూడలేదని విమర్శించారు. ఇది దద్దమ్మ ప్రభుత్వమని, దోచుకునుడు.. దాచుకునుడే ధ్యేయంగా ముందుకు సాగుతున్నదని మండిపడ్డారు. రైతులు అష్టకష్టాలు పడుతుంటే సర్కార్‌కు చలనం లేదని ధ్వజమెత్తారు. 'వ్యవసాయ పనులు వదిలి రోజుల తరబడి యూరియా కోసం దుకాణాల చుట్టూ తిరిగిండ్రు. నెలల తరబడి ధాన్యం కొనుగోలు కేంద్రంలో నీలుగుతుండ్రు. ఇగ ఎప్పుడు వ్యవసాయం చేయాలె.. ఇవి రేవంత్‌రెడ్డికి కనిపించడంలేదా?' అని ఎర్రబెల్లి ప్రశ్నించారు. 'లారీలు రావు. పోతే దిగుమతి కావు. ఇదేం పద్ధతి. ప్రభుత్వానికి కనీస అవగాహన లేదు' అని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన నిలబడుతుందని, ధైర్యంగా ఉండాలని సూచించారు. సర్కార్ ఇకనైనా కండ్లు తెరిచి, చివరి గింజ వరకు ధాన్యం కొనాలని, తడిచినా, మొలకొచ్చినా కొనాలని డిమాండ్ చేశారు.



మెదక్ జిల్లా రామాయంపేట మండలం రాయిలాపూర్‌లో మెదక్–సిద్దిపేట రహదారిపై రాస్తారోకో చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి


కాంగ్రెస్ సర్కార్‌కు రైతుల గోస పట్టదెందుకు?

- రెండు నెలలు దాటుతున్నా ధాన్యం కొనకపోతే ఎలా?
- ప్రభుత్వం నిర్లక్ష్యంపై మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఫైర్
- రైతులతో కలిసి మెదక్ జిల్లా రాయిలాపూర్‌లో రాస్తారోకో

రామాయంపేట, జూన్ 5: కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల గోస పట్టడం లేదని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం మెదక్ జిల్లా రామాయంపేట మండలం రాయిలాపూర్‌లో మొలకెత్తిన ధాన్యాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు పద్మాదేవేందర్‌రెడ్డితో తమ గోడువెళ్లబోసుకున్నారు. ఒక్క గ్రామంలోనే రోడ్డు పొడవునా 2 కిలోమీటర్ల మేర ధాన్యం కుప్పలు ఉండటం చూసి చలించిపోయారు. వానకాలం వచ్చినా ప్రభుత్వం ధాన్యం కొనకుండా ఏం చేస్తున్నదని ప్రశ్నించారు. రైతులు కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబోసి రెండు నెలలు కావస్తున్నా, ఇంకెప్పుడు కొంటారని నిలదీశారు. రాయిలాపూర్‌లోని మూడు కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడి ధాన్యం అక్కడే ఉన్నదని మండిపడ్డారు. అక్కడి నుంచే మెదక్ అదనపు కలెక్టర్ నగేశ్‌తో ఫోన్‌లో మాట్లాడినా సమస్యకు పరిష్కారం దొరుకలేదు. దీంతో ఆమె రాయిలాపూర్ నుంచే కార్యకర్తలు, రైతులతో 3 కిలోమీటర్ల మేర నడిచి వెళ్లి క్రాస్ రోడ్డు వద్ద సిద్దిపేట–రామాయంపేట రోడ్డుపై బైఠాయించారు. రైతుల ధాన్యం కొనే వరకు కదిలేదని భీష్మించారు. రెండు గంటలపాటు రాస్తారోకో చేపట్టడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. రామాయంపేట, నిజాంపేట ఎస్సైలు బాలరాజు, రాజేశ్ వచ్చి సముదాయించినా పద్మాదేవేందర్‌రెడ్డి ససేమిరా అన్నారు. ఎస్సై బాలరాజు రామాయంపేట తహసీల్దార్ రజినీకుమారితో ఫోన్‌లో మాట్లాడించారు. రాత్రి వరకు ఐదు లారీలు పంపిస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఒకవేళ లారీలు రాకపోతే శనివారం వచ్చి రాస్తారోకో చేపడుతానని పద్మాదేవేందర్‌రెడ్డి హెచ్చరించారు. ధాన్యం కొనుగోళ్లు జరుగక రైతులు ఇబ్బందులు పడుతుంటే మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ఎక్కడికిపోయారని, ఈ ఎమ్మెల్యేకు రైతుల సమస్యలు పట్టవా? అని ప్రశ్నించారు. రెండు నెలలుగా రైతులు ధాన్యంతో రోడ్లపై ఉంటే కనికరం చూపకపోవడం దారుణమని అన్నారు.

వడ్లు కూడా కొనడం చేతగాని రేవంత్

- నీకే ఫ్యూచర్ లేదు.. ఫ్యూచర్‌సిటీ కడ్తవా?
- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్



హైదరాబాద్, జూన్ 5 (నమస్తే తెలంగాణ) రాష్ట్రంలో సమయానికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయకపోవడంతో వర్షాలతో ధాన్యం తడిసి రంగు మారుతున్నదని, వడ్లు కూడా కొనడం చేతగాని దద్దమ్మ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ విమర్శించారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లపై కేంద్ర ప్రభుత్వం కోతలు పెట్టలేదని పేర్కొన్నారు. 2024–2025, 2025–2026 సంవత్సరాలకు సంబంధించి తెలంగాణ ఇంకా 36 లక్షల టన్నుల ధాన్యం కేంద్రానికి బాకీ ఉన్నదని చెప్పారు. ధాన్యం సరఫరాకు లారీల కొరత ఉన్నదని చెప్తున్నారని, ఇసుక రవాణాకు దొరుకుతున్న లారీలు ధాన్యం సరఫరాకు మాత్రం దొరుకడం లేదా? అని ప్రశ్నించారు. కేంద్రానికి ఇస్తామని చెప్తున్న వడ్లను ఇవ్వడంలేదని, ఇక్కడేమో సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెప్తున్నారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే పంజాబ్‌లో ఉన్న మార్కెటింగ్ వసతులను చూసి రావాలని హితవు పలికారు. అసలు తన ఫ్యూచరేమిటో తెలియని.. అసలు ఫ్యూచరేలేని రేవంత్‌రెడ్డి ఫ్యూచర్‌సిటీ కడ్తానని చెప్పడం విడ్డూరమని పేర్కొన్నారు. మూడు నాలుగు పార్టీలు మారిన రేవంత్‌రెడ్డి బీజేపీలోకి వస్తారన్నది ప్రచారమేనని, ఆయన ఎప్పుడూ ఏబీవీపీలో లేరని చెప్పారు. ఆయన అన్న ఏబీవీపీలో పనిచేశారని పేర్కొన్నారు. తాను ఏబీవీపీ నుంచి వచ్చానని చెప్పుకోవడం వల్లనే ప్రధాని మోదీ పిలిచి ఉంటారని, అంతకుమించిన ప్రత్యేకత లేదని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమంతో సంబంధంలేని, సోనియాగాంధీని తిట్టిన వ్యక్తిని ముఖ్యమంత్రిని చేసినందుకు కాంగ్రెస్ పార్టీ సిగ్గుపడాలని దుయ్యబట్టారు.

కరెంట్ షాక్‌కు రైతు బలి



ఆంజనేయులు(ఫైల్)

ఉప్పునుంతల, జూన్ 5 : విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం లక్ష్మాపూర్‌లో శుక్రవారం చోటుచేసుకున్నది. లక్ష్మాపూర్‌కు చెందిన రైతు రాపాణి ఆంజనేయులు (45) తన పొలంలో పత్తి విత్తనాలు వేస్తుండగా పైన వేలాడుతున్న విద్యుత్తు తీగలు ప్రమాదవశాత్తు తగలడంతో షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

తనను తాను సృష్టించుకోనున్న ఏఐ!

ఆంత్రోపిక్ హెచ్చరిక



న్యూయార్క్: ఏఐ తనను తాను సొంతంగా సృష్టించుకునే సామర్థ్యం పొందినప్పుడు దాని మీద మనుషులు నియంత్రణ కోల్పోవచ్చని ఆంత్రోపిక్ ఏఐ కంపెనీ హెచ్చరించింది. ఆ స్థాయికి ఏఐ వెళ్లిన తర్వాత మనుషుల సాయం లేకుండానే సమర్థవంతమైన వ్యవస్థలను సృష్టించుకోగలదని కంపెనీ తెలిపింది. ఆంత్రోపిక్ కంపెనీ మరో సూచన కూడా చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా అత్యాధునిక ఏఐ వ్యవస్థలను రూపొందించడం కూడా కంట్రోల్ చేయాలని సూచించింది. ఎందుకంటే కొత్త టెక్నాలజీతో వస్తున్న ఏఐ మనుషుల నియంత్రణ నుంచి సులభంగా తప్పించుకోగలదని తెలిపింది. ఏఐ అభివృద్ధిని ఏఐ వ్యవస్థలకే అప్పగిస్తే.. తనను తాను సొంతంగా క్రియేట్ చేసుకునే శక్తిని ఏఐ పొందుతుందని.. ఇది మానవ అతీత శక్తికి దారి తీస్తుందని ఆంత్రోపిక్ స్పష్టం చేసింది. ప్రస్తుతం క్లాడ్ వ్యవస్థ అత్యంత సమర్థవంతమైన కోడ్ ను రాయగలదని ఆంత్రోపిక్ కంపెనీ తెలిపింది.

ఏఐతో టీకా అభివృద్ధి


- ప్రపంచంలోనే తొలిసారిగా యూకేలో
- పలు వైరస్‌లను అడ్డుకొనేలా తయారీ



లండన్: యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్‌లోని ఒక బృందం ప్రపంచంలోనే తొలిసారిగా పూర్తిగా ఏఐను ఉపయోగించి టీకాను అభివృద్ధి చేసింది. ఈ టీకాను మనుషులపై ప్రయోగించినట్టు వెల్లడించింది. ఈ టీకాను అన్ని రకాల కరోనా వైరస్‌లు, మహమ్మారులు, జంతువులకు సోకే వైరస్‌లు, భవిష్యత్తులో మరో మహమ్మారిని సృష్టించే సామర్థ్యం ఉన్న వైరస్‌లను నిరోధించేందుకు ఉపయోగించవచ్చని ఆ బృందం తెలిపింది. అయితే ఈ వ్యాక్సిన్ ఇంకా ప్రారంభ దశలోనే ఉందని.. కానీ తాము దీన్ని పోలిన టీకాలను ఇప్పటికే అభివృద్ధి చేశామని.. అవి ఫ్లూ, ఎబోలాను నిరోధించవచ్చని వెల్లడించింది. కరోనా వైరస్‌ల నుంచి సేకరించిన జన్యు సంకేతాలను విశ్లేషించి ఈ కొత్త టీకాను తయారు చేశారు. వైరస్‌ల కుటుంబం రూపాంతరం చెందినా వాటి నుంచి రక్షణ లభించేలా సూపర్-యాంటీజెన్ లాగా రూపొందించారు.

మనుషులను మించిపోనున్న ఏఐ!

గూగుల్ డీప్‌మైండ్ సీఈవో



వాషింగ్టన్: మనుషుల మాదిరి ఆలోచించే ఏజీఐ (ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్) 2030 నాటికి మనుషుల్ని మించిపోనుందని గూగుల్ డీప్‌మైండ్ సీఈవో డెమిస్ హస్సబిస్ తెలిపారు. స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ విషయం వినడానికి తనకే ఆశ్చర్యంగా ఉందన్నారు. అప్పటి నుంచి 'కొత్త మానవ శకం' ప్రారంభమవుతుందని తెలిపారు. ఏజీఐతో ఒక యంత్రం కూడా మనిషి సామర్థ్యంతో సమానంగా లేదా అంతకంటే బాగా తనకు ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయగలదు. ఇది 2030 నాటికి సాధ్యమని హస్సబిస్ చెప్తున్నారు. ఏజీఐ రోగాలను నయం చేయగలదు, ఆర్థిక పరిస్థితిని మార్చగలదు, ప్రపంచాన్ని భయ రహితం చేయగలదు. అదే సమయంలో దాని వల్ల ఉద్యోగాల కోతలు, దాన్ని నియంత్రించడం ఎలా అన్న ప్రశ్నలు, సమాజంపై నిరోధించలేని ప్రభావం లాంటి సమస్యలు పుట్టుకొస్తాయి అని పేర్కొన్నారు.

గూగుల్‌లో మళ్లీ ఉద్యోగాల కోత!

న్యూఢిల్లీ: గూగుల్ మళ్లీ ఉద్యోగులను తొలగించింది. గూగుల్ 2022లో కొనుగోలు చేసిన సైబర్ సెక్యూరిటీతో పాటు, క్లౌడ్ డివిజన్, థ్రెట్ ఇంటెలిజెన్స్ గ్రూప్‌లో ఉద్యోగులపై వేటు వేసింది. గత రెండు వారాలుగా ఈ ఉద్యోగాల కోత జరుగుతూనే ఉంది. ఏఐలో పెట్టుబడితో పాటు మెరుగైన లాభాల కోసమే ఉద్యోగులను తగ్గించుకుంటున్నట్టు తెలుస్తున్నది. టెక్ రంగంలో మారుతున్న పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసుకుని.. సంస్థ అభివృద్ధి కోసమే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నట్టు గూగుల్ స్పష్టం చేసింది.



భూమికి వచ్చేందుకు సిద్ధంగా ఉండండి

- ఐఎస్‌ఎస్‌లోని వ్యోమగాములకు నాసా ఆదేశాలు
- రష్యా విభాగంలో ఎయిర్ లీక్

న్యూయార్క్, జూన్ 5: అంతరిక్ష కేంద్రంలో అత్యవసర పరిస్థితులు ఏర్పడ్డాయి. అంతరిక్ష కేంద్రంలోని రష్యాకు చెందిన రోస్కోమస్ స్పేస్ ఏజెన్సీలోని జ్వేజ్డా విభాగంలో కొన్ని నెలల తరబడి గాలి లీక్ అవుతున్నది. మొన్నటిదాకా పరిస్థితి స్థిరంగా ఉన్నా.. సోమవారం నాటికి గాలి లీక్ తీవ్రత భారీగా పెరిగిపోయింది. దీంతో క్రూ-12 మిషన్‌కు చెందిన నలుగురు వ్యోమగాములను వెంటనే వారికోసం ఏర్పాటు చేసిన క్రూ డ్రాగన్ మిషన్‌లోకి వెళ్లి స్పేస్ సూట్లను ధరించాలని నాసా ఆదేశించింది. కుదిరితే తరలింపునకు సిద్ధంగా ఉండాలని తెలిపింది. ఇందులో ఇద్దరు అమెరికన్, ఒక ఫ్రెంచ్, ఒక రష్యన్ వ్యోమగామి ఉన్నారు. అంతరిక్ష కేంద్రంలో ప్రధాన ఆపరేటర్లుగా ఉన్న అమెరికా, రష్యన్ స్పేస్ ఏజెన్సీలు ఈ గాలి లీక్ మీద నెలలుగా చర్చిస్తున్నాయని నాసాకు చెందిన ఓ అధికారి తెలిపారు. పరిస్థితి కంట్రోల్‌లోకి రాకపోవడంతో ఈ రకమైన ఆదేశాలు ఇచ్చామని స్పష్టం చేశారు.

ప్రజా ఉద్యమం ప్రారంభిస్తున్నా

- బీజేపీకి అన్నామలై రిజైన్
- కొనసాగుతున్న కీలక నేతల సామూహిక రాజీనామాలు

చెన్నై, జూన్ 5: కొన్ని రోజులుగా సాగుతున్న ఊహాగానాలకు తెరదించుతూ కే అన్నామలై బీజేపీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. వచ్చే తమిళనాడు ఎన్నికల్లో పోటీ చేసే ఒక ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. అన్నామలై మక్కల్ ఇయక్కం(ఏఎంఐ) పేరిట ఉద్యమాన్ని ప్రకటించారు. "ఒక కుటుంబానికి చెందిన రాజకీయాలు ఉండవు. శాశ్వత నాయకులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు అనే భావనను బద్దలు కొడతాం. మనం మూఢనమ్మకాల రాజకీయాల నుంచి బయటపడి సామాన్యుడి రాజకీయాలు తీసుకురావాలి" అని అన్నామలై తెలిపారు. కే అన్నామలై రాజీనామా చేసిన కొన్ని గంటలకే మరి కొందరు కీలక నాయకులు సామూహిక రాజీనామాలు చేసి పార్టీ నుంచి నిష్క్రమించారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరు నాగరాజన్, రాష్ట్ర కార్యదర్శి సుమతి వెంకటేష్ తమ పదవులకు రాజీనామా చేశారు. అన్నామలై సారథ్యంలో ఏర్పడే కొత్త రాజకీయ పార్టీలో చేరాలన్న తమ ఉద్దేశాన్ని నాగరాజన్ వ్యక్తం చేశారు. సుమతి వెంకటేష్ తన రాజీనామా లేఖను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

నేడే కాక్రోచ్ సమరభేరి

- కేంద్రంపై పోరుకు సీజేపీ సన్నద్ధం
- ప్రధాన్ రాజీనామాకు డిమాండ్
- జంతర్‌మంతర్‌లో భారీ నిరసన
- చేతిలో తిరంగా.. ఒంటికి సన్‌స్క్రీన్
- నిరసన కోసం సీజేపీ సూచనలు



న్యూఢిల్లీ, జూన్ 5: సోషల్ మీడియా ప్రచారంలో భాగంగా ఏర్పడిన కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) శనివారం ఢిల్లీలో నిరసన ప్రదర్శనకు సంసిద్ధమవుతున్నది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శనకు సీజేపీ పిలుపునిచ్చింది. ఉదయం 9 గంటలకు నిరసన తెలిపేందుకు జంతర్ మంతర్ వద్ద సమావేశమవుతున్నట్లు శుక్రవారం ఎక్స్‌లో షేర్ చేసిన పోస్టులో సీజేపీ తెలిపింది. తమది శాంతియుత ప్రదర్శనగా అభివర్ణిస్తూ ఈ నిరసనలో పాలుపంచుకోవాలని తన మద్దతుదారులను కోరింది. "రేపు కలుద్దాం బొద్దింకల్లారా, ధర్మేంద్ర ప్రధాన్‌ను ఓడిస్తూనే ఉంటాం" అని ఆ పోస్టులో సీజేపీ పేర్కొన్నది. "ఈ చిన్న జోక్‌ను ఒక విప్లవంగా మార్చే సమయం వచ్చింది" అని సీజేపీ తెలిపింది. నీట్, సీబీఎస్‌ఈ, సీయూఈటీ, ఎస్‌ఎస్‌సీజీ పరీక్షల్లో అవకతవకలపై నిరసన ప్రకటించాలని ప్రజలకు పిలుపునిచ్చింది. వరుస పేపర్ లీకులతో అసమర్థుడిగా నిరూపించుకున్న కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలని ప్రధాని నరేంద్ర మోదీకి సీజేపీ అధికార ప్రతినిధులు ఎక్స్‌లో విజ్ఞప్తి చేశారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే శనివారం ఉదయం 8 గంటలకు బోస్టన్ నుండి ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయానికి రానున్నారు. పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఆయనకు స్వాగతం పలుకుతారు. అనంతరం పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్‌లో తమ నిరసన ప్రదర్శనకు అనుమతి కోరతారు.

పాటించాల్సినవి.. పాటించకూడనివి..

నిరసన సమయంలో క్రమశిక్షణతో ఉండేందుకు పాల్గొనేవారు పాటించాల్సినవి, పాటించకూడనివి అంటూ వాటి జాబితాను వివరించింది. త్రివర్ణ పతాకాన్ని, ఒక నోటు పుస్తకాన్ని తీసుకురావాలని, ప్రతి విషయాన్ని నమోదు చేయాలని, ఆకతాయిలపై ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే చేయకూడనివి తెలియచేస్తూ ఉద్యమానికి అండగా ఉండాలని భావిస్తే ఒంటరిగా రావద్దని, పూలు విసరవద్దని, చేతికి అందచేయాలని, ట్రోల్స్, రెచ్చగొట్టే వారితో వాదనకు దిగవద్దని పేర్కొన్నది.

అత్యవసర విచారణకు నిరాకరణ

కాక్రోచ్ జనతా పార్టీ శనివారం న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన ప్రదర్శనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో, దీనివల్ల తలెత్తే శాంతి భద్రతల సమస్యలపై దాఖలైన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించేందుకు ఢిల్లీ హైకోర్టు శుక్రవారం నిరాకరించింది.

భారత్‌లో అసమ్మతిపై లండన్‌లో రచ్చ!

లండన్‌లోని ఒక విశ్వవిద్యాలయంలో భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) సూర్యకాంత్ ముఖ్యవక్తగా ప్రసంగించిన ఒక కార్యక్రమంలో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. భారతదేశంలో అసమ్మతిని అణచివేస్తున్నారనే ఆరోపణలపై ఆయనను ప్రశ్నించాలనుకున్న వారికి, ఆ ప్రశ్నలు అప్రస్తుతమైనవని చెప్పిన యాంకర్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. కృత్రిమ మేధస్సు, అంతర్జాతీయ చట్టం అనే అంశంపై లండన్ వర్సిటీలోని బిర్క్‌బెక్ కళాశాల్లో సీజేఐ సూర్యకాంత్ ఉపన్యాసం ఇచ్చారు. సీజేఐ ఉపన్యాసం తర్వాత జరిగిన ఇంటరాక్టివ్ ప్రోగ్రామ్‌లో ఒక వ్యక్తి ఈ ప్రశ్న అడగడం, దయచేసి మమ్మల్ని గౌరవించండి అంటూ ఒక విద్యార్థి అరుస్తున్న వీడియో క్లిప్‌లను కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) ప్రధాన అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ సోషల్ మీడియాలో తిరిగి షేర్ చేశారు. ఉపన్యాస కార్యక్రమానికి హాజరైన ఒక మహిళ సీజేఐని ఉద్దేశించి మాట్లాడుతూ "భారత్‌లో భిన్నాభిప్రాయాల పట్ల పెరుగుతున్న వ్యతిరేకత గురించి దేశంలోనూ, అంతర్జాతీయంగానూ చాలా మంది న్యాయ పరిశీలకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని మేము ఇప్పుడు వింటున్నాము. ఈ వ్యతిరేకత మీ ప్రసంగంలో కొంతవరకు ప్రతిబింబిస్తున్నట్లు కనిపిస్తున్నది." అంటూ ఇటీవల సీజేఐ చేసిన వ్యాఖ్యలను పరోక్షంగా ప్రస్తావించారు. వేదికపై ఉన్న వారిలో ఒక వ్యక్తి అడ్డుకుంటూ "గౌరవంగా చెబుతున్నాను. నన్ను క్షమించండి. ఈ అంశం ఏఐ, అంతర్జాతీయ చట్టానికి సంబంధించినది కాబట్టి ఆ ప్రశ్నను తీసుకోలేను" అని అనడం ఆ క్లిప్‌లో వినిపించింది.

కర్ణాటక కాంగ్రెస్‌లో గడబిడ

- సీఎం డీకేకు తొలి ఎదురుదెబ్బ
- మంత్రి పదవికి సన్నిహితుడు రామలింగా రెడ్డి రాజీనామా
- శాఖ కేటాయింపుపై అసంతృప్తి
- మంత్రి మునియప్ప కూడా అలక

బెంగళూరు, జూన్ 5: పదవిని చేపట్టిన మూడు రోజులకే కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు తొలి ఎదురుదెబ్బ తగిలింది. ముఖ్యమంత్రికి సన్నిహితుడైన మంత్రి రామలింగారెడ్డి శుక్రవారం తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. తాను కోరుకున్న మంత్రిత్వ శాఖను కేటాయించలేదన్న అసంతృప్తితో ఆయన పదవికి రాజీనామా చేశారు. ఆయన బెంగళూరు అభివృద్ధి శాఖను కోరగా, జల వనరుల శాఖను అప్పగించారు. దీంతో తీవ్ర అసంతృప్తి చెందిన ఆయన తాను పదవికి రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. మంత్రి పదవికే రాజీనామా చేశా తప్ప కాంగ్రెస్ పార్టీకి కాదని ఆయన మీడియాకు స్పష్టం చేశారు. ప్రమాణ స్వీకారానికి ముందే ఆ శాఖను తనకు అప్పగిస్తానని శివకుమార్ రెండు సార్లు తనకు వాగ్దానం చేశారన్నారు. తాను అడగకపోయినా డీకే తన ఇంటికి వచ్చి మరీ తనకు ఆ శాఖను కేటాయిస్తున్నట్టు తెలపగా, తాను సరేనని అన్నానని తెలిపారు. ఇప్పుడు సీఎం పిలిచి బెంగళూరు అభివృద్ధి శాఖను కేటాయించినా అంగీకరించ బోనని, ఎమ్మెల్యేగానే కొనసాగుతానన్నారు. మరోవైపు మునియప్ప కూడా తనకు కేటాయించిన శాఖపై అసంతృప్తితో ఉన్నట్టు తెలిసింది. ఆయనకు ఆహార, ప్రజాపంపిణీ శాఖను కేటాయించారు. అయితే ఆయన సామాజిక సంక్షేమం లేదా వ్యవసాయ శాఖను కోరుకున్నారు.

తక్కువ అర్హత ఉన్న ఉద్యోగాలకు

ఉన్నత అర్హతలున్న వారు అనర్హులు

ప్రభుత్వ ఉద్యోగ నియామకాలపై సుప్రీంకోర్టు కీలక తీర్పు



న్యూఢిల్లీ, జూన్ 5: నిర్దేశిత అర్హతలకు అనుగుణంగా అర్హులైన అభ్యర్థులకే ప్రభుత్వ ఉద్యోగాలు అందుబాటులో ఉండాలని సుప్రీంకోర్టు తెలిపింది. తక్కువ అర్హతలు ఉన్నవారి కోసం నిర్దేశించిన ఉద్యోగాన్ని ఎక్కువ అర్హతలు ఉన్న వ్యక్తికి కల్పించడం నిజంగా అర్హత, యోగ్యత ఉన్న అభ్యర్థికి నష్టం కలిగిస్తుందని పేర్కొంటూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. తాత్కాలిక బ్యాంకు సహాయకుడిని తిరిగి విధుల్లోకి తీసుకుంటూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును రద్దు చేస్తూ జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర మహదేవన్‌తో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. 10వ తరగతి వరకు అర్హతలున్న అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా కేటాయించిన పోస్టులో ఆ ఉద్యోగి తాను పట్టభద్రుడినన్న విషయాన్ని దాచిపెట్టి నియామకం పొందారన్న అంశాన్ని హైకోర్టు విస్మరించిందని సుప్రీంకోర్టు పేర్కొన్నది. ప్రభుత్వ ఉద్యోగాలు నిర్దేశించిన అర్హతలకు అనుగుణంగా అర్హులైన అభ్యర్థులందరికీ అందుబాటులో ఉంచాలని ధర్మాసనం ఆదేశించింది. జీవన పరిస్థితుల కారణంగా ఉన్నత విద్యను అభ్యసించలేని వ్యక్తులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే అర్హతకు గరిష్ఠ పరిమితిని నిర్దేశించడం వెనుక ఉన్న హేతుబద్ధతని, ఇది న్యాయమైనది కూడానని సుప్రీంకోర్టు పేర్కొన్నది. ఆదర్శవంతమైన యజమానిగా రాష్ట్ర ప్రభుత్వం అటువంటి వ్యక్తుల కోసం కొన్ని క్యాటగిరీల పోస్టులను రిజర్వ్ చేయడం సమర్థనీయమే. తద్వారా ఉన్నత అర్హతలు గల అభ్యర్థులతో వారు పోటీ పడవలసిన అవసరం ఉండదు. అటువంటి విధానాన్ని న్యాయస్థానాలు కూడా సమర్థించాయి" అని పేర్కొంటూ ఉద్యోగిని తొలగించాలన్న బ్యాంకు నిర్ణయాన్ని ధర్మాసనం సమర్థించింది.

ఏటీఎంలలో నిండుకుంటున్న నగదు!

న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా పలు ఏటీఎంలలో నగదు నిండుకుంటున్నది. నగదు లభ్యతలో భారీ కొరత కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడుతున్నదని ఏటీఎంల నిర్వాహకులు, నగదు రవాణా సంస్థలకు ప్రాతినిధ్యం వహించే ద కాన్ఫిడరేషన్ ఆఫ్ ఏటీఎం ఇండస్ట్రీ (సీఏటీఎంఐ) వెల్లడించింది. ఏటీఎం నిర్వాహకులకు అవసరమైన నగదులో మార్చిలో 64 శాతం, ఏప్రిల్‌లో 57 మాత్రమే కేటాయించారని ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్‌కు సమర్పించిన నివేదికలో సీఏటీఎంఐ తెలియజేసింది. అయితే ఆర్‌బీఐ వెల్లడించిన వివరాలు దీనికి విరుద్ధంగా ఉన్నాయి. దేశంలో ఈ ఏడాది మే 22 నాటికి రికార్డు స్థాయిలో నగదు చలామణి రూ. 42.54 లక్షల కోట్లు జరిగినట్టు ఆర్‌బీఐ తన తాజా నివేదికలో వెల్లడించింది. దేశంలో నగదు చలామణి ఒక పక్క పెరుగుతుండగా, అదే సమయంలో పలు ఏటీఎంలలో నగదు కొరత కన్పిస్తున్నది.

రెబల్స్‌లో రెబల్

- టీఎంసీ తిరుగుబాటు ఎమ్మెల్యేల్లో చీలిక
- మమతనే చైర్‌పర్సన్‌గా ఉండాలని పలువురి ఎమ్మెల్యేల డిమాండ్
- రితబ్రత భేటీకి 32 మందే హాజరు
- రెబల్స్‌కు మమత బుజ్జగింపులు
- నేరుగా ఎమ్మెల్యేలతో మంతనాలు
- ఎంపీల్లో రాజుకుంటున్న అసమ్మతి



కోల్‌కతా, జూన్ 5: తృణమూల్ కాంగ్రెస్‌లో సంక్షోభం నాటకీయ మలుపులు తిరుగుతున్నది. మమతపై తిరుగుబావుటా ఎగురవేసిన తిరుగుబాటు వర్గంలోనే మరో తిరుగుబాటు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. పార్టీ నాయకురాలిగా మమత కొనసాగింపుపై తిరుగుబాటు వర్గంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రితబ్రత బెనర్జీ నేతృత్వంలో 58 మంది ఎమ్మెల్యేలు వేరుకుంపటి పెట్టుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ వర్గంలోనూ అసమ్మతి రాజుకుంటున్నట్టు సమాచారం. అసెంబ్లీ తాజాగా జరిగిన భేటీకి కేవలం 32 మంది ఎమ్మెల్యేలే హాజరైనట్టు తెలిసింది. రితబ్రత ప్రతిపాదించినట్టు మమతను చీఫ్ అడ్వైజర్‌గా కాకుండా పార్టీ చైర్‌పర్సన్‌గా ప్రకటించాలని వీరిలో 16 మంది స్పష్టంచేసినట్టు సమాచారం. లేదంటే తాము రెబల్ వర్గంలో ఉండబోమని తేల్చిచెప్పినట్టు తెలిసింది. తమను రాజకీయంగా పెంచి పోషించింది మమతనే అని వారు స్పష్టంచేసినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. రితబ్రత నాయకత్వంలోని వర్గంలో ఏర్పడిన అసమ్మతిని అవకాశంగా మలచుకుని ఆ వర్గంలోనే తిరుగుబాటు లేవనెత్తేందుకు మమత ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. టీఎంసీ టికెట్‌పై గెలిచిన 80 మంది ఎమ్మెల్యేలలో ముస్లింలు 31 మంది ఉన్నారు. తిరుగుబాటు వర్గంలో చేరినప్పటికీ అసంతృప్తితో ఉన్న వీరిలో కొందరితో సంప్రదింపులు జరుపుతున్న మమత వారిని రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు వర్గాలు తెలిపాయి.

ఎంపీల్లో అసమ్మతి

పార్టీకి చెందిన 23 మంది ఎంపీలు తిరుగుబాటు ఎమ్మెల్యేలతో సంప్రదింపులు జరుపుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. టీఎంసీ ఎంపీలలో కూడా అసమ్మతి రాజుకుంటున్నదని పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీపై పలువురు ఎంపీలు అసంతృప్తిగా ఉన్నట్లు వారు చెప్పారు. పార్లమెంట్‌లో విడిగా జట్టు కట్టే విషయాన్ని కూడా వారు చర్చించుకుంటున్నట్లు సమాచారం. చీలిక వర్గాన్ని ఏర్పాటు చేసే సాధ్యాసాధ్యాలను వారు పరిశీలిస్తున్నట్లు తెలుస్తున్నది. డజనుకు పైగా ఎంపీలు ఈ ప్రతిపాదనకు సుముఖంగా ఉన్నట్లు వర్గాలు తెలిపాయి. టీఎంసీకి ప్రస్తుతం పార్లమెంట్‌లో 29 మంది ఎంపీలు ఉన్నారు. లోక్‌సభలో ప్రత్యేక గ్రూపుగా గుర్తింపు పొందాలంటే పార్టీ ఫిరాయింపు నిరోధక చట్ట నిబంధనల కింద మూడింట రెండు వంతుల సంఖ్యాబలం ఉంటే కనీసం 22 మంది ఎంపీలు ఉండాలి. రాజ్యసభలో పార్టీకి 13 మంది సభ్యులు ఉన్నారు. ప్రత్యేక గ్రూపుగా గుర్తింపు పొందడానికి 9 మంది ఎంపీలు ఉండాల్సి ఉంటుంది.

లోక్‌సభ బరిలోకి..

లోక్‌సభలో పార్టీలో అసమ్మతి నెలకొన్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో మమతా బెనర్జీ లోక్‌సభలో అడుగుపెట్టాలని యోచిస్తున్నట్లు సమాచారం. 2026 పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చేతిలో ఓటమి పాలైన నేపథ్యంలో తాను లోక్‌సభకు వెళ్లే విషయాన్ని ఆమె తీవ్రంగా పరిశీలిస్తున్నారు. దిగువ సభకు వెళ్లేందుకు మార్గం సుగమం చేసుకునేందుకు టీఎంసీ ఎంపీ యూసుఫ్ పఠాన్‌ను తన బహరంపూర్ లోక్‌సభ నియోజకవర్గాన్ని ఖాళీ చేయమని ఆమె కోరవచ్చని తెలుస్తున్నది. గతంలో లోక్‌సభ సభ్యురాలిగా మమత ఉన్నారు. ప్రస్తుతం కోల్‌కతా దక్షిణగా పిలుచుకుంటున్న కలకత్తా సౌత్ నుంచి ఆరుసార్లు ఎంపీగా ఆమె ఎన్నికయ్యారు.

మధుమేహం, గుండె జబ్బులు లేని

"డిజైనర్ బేబీస్"!

- మానవ పిండాల డీఎన్‌ఏ ఎడిటింగ్‌లో కీలక ముందడుగు
- దుర్వినియోగంపై నిపుణుల ఆందోళన



న్యూయార్క్: కొలంబియా యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు మునుపెన్నడూ లేనివిధంగా అత్యంత కచ్చితత్వంతో తొలిదశ మానవ పిండాల డీఎన్‌ఏను విజయవంతంగా ఎడిట్ చేశారు. ఈ మైలురాయి భవిష్యత్తులో వంశపారంపర్యంగా వచ్చే మధుమేహం, గుండెజబ్బులు తదితర వ్యాధులను నివారించడానికి సహాయపడవచ్చు. కానీ ఇది తమకు నచ్చిన లక్షణాలతో కూడిన పిల్లలను సృష్టించే అవకాశం గురించిన ఆందోళనలను మళ్లీ రేకెత్తించింది. ఈ పరిశోధనకు జన్యు శాస్త్రవేత్త డైటర్ ఎగ్లీ నాయకత్వం వహించారు. మానవ పిండాల డీఎన్‌ఏను మార్చడం వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రమాదాల గురించి ప్రజల్లో చర్చను ఈ ఫలితాలు ప్రోత్సహించాలని ఆయన అన్నారు. ''మేము శాస్త్రీయ డాటాను అందించగలం, కానీ ఈ సాంకేతికతను ఎలా ఉపయోగించాలో సమాజమే నిర్ణయించాలి'' అని ఆయన అన్నారు. డీఎన్‌ఏ మార్పు కోసం పరిశోధకులు బేస్ ఎడిటింగ్ అనే కొత్త సాంకేతికతను ఉపయోగించారు. డీఎన్‌ఏ పోచలను కత్తిరించే సాంప్రదాయ క్రిస్పర్ జీన్ ఎడిటింగ్‌లా కాకుండా బేస్ ఎడిటింగ్ అనేది వ్యక్తిగత జన్యు అక్షరాలలో చిన్న, కచ్చితమైన మార్పులను చేస్తుంది. మునుపటి జీన్ ఎడిటింగ్ పద్ధతుల్లో తరచుగా కనిపించే భారీ డీఎన్‌ఏ నష్టాన్ని ఈ పద్ధతి నివారించిందని పరిశోధక బృందం తెలిపింది. అయితే ముఖ్యంగా దుష్ప్రభావాలకు సంబంధించి ఇంకా చాలా ప్రశ్నలకు సమాధానాలు దొరకాల్సి ఉందని డాక్టర్ ఎగ్లీ నొక్కి చెప్పారు. ఈ సాంకేతికత ఇంకా క్లినికల్ వినియోగానికి సిద్ధంగా లేదని ఆయన అన్నారు. ఈ అధ్యయనం ఆన్‌లైన్‌లో ప్రచురితమైనది.

బేస్ ఎడిటింగ్‌తో కచ్చితమైన ఫలితాలు

ఈ సమస్యలను అధిగమించడానికి శాస్త్రవేత్తలు 2016లో హార్వర్డ్ జన్యుశాస్త్రవేత్త డేవిడ్ లియూ, అతని సహచరులు అభివృద్ధి చేసిన బేస్ ఎడిటింగ్ సాంకేతికత వైపు మొగ్గు చూపారు. డీఎన్‌ఏను కత్తిరించానికి బదులుగా బేస్ ఎడిటింగ్ ఒక డీఎన్‌ఏ పోచలో చిన్న కోతను సృష్టించి మ్యుటేషన్‌ను సరిచేయడానికి కణానికి మార్గనిర్దేశం చేస్తుంది. ఈ పద్ధతి ఇప్పటికే మంచి ఫలితాలను చూపించింది. గత సంవత్సరం, ప్రాణాంతక జన్యు లోపంతో ఉన్న ఒక శిశువుకు నయం చేయడానికి వైద్యులు ప్రత్యేకంగా తయారు చేసిన బేస్ ఎడిటింగ్ అణువులను ఉపయోగించారు. డాక్టర్ ఎగ్లీ బృందం ఈ సాంకేతికతను మానవ పిండాలపై పరీక్షించాలని నిర్ణయించుకున్నది. శాస్త్రవేత్తలు రెండు జన్యువులపై దృష్టి పెట్టారు. ఒక జన్యువు పీసీఎస్‌కే9, ఇది ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్ స్థాయిలు, గుండె జబ్బుల ప్రమాదంతో ముడిపడి ఉంటుంది. రెండవ జన్యువు హెచ్‌బీజీ. ఇది పిండంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తిలో పాత్ర పోషిస్తుంది. దానం చేసిన ఫలదీకరణ గుడ్లు, రెండు కణాల పిండాలను ఉపయోగించి పరిశోధకులు బేస్ ఎడిటింగ్ అణువులను ప్రవేశపెట్టి రెండు జన్యువులను విజయవంతంగా మార్చారు. కొన్ని పిండాలలో వారు ఒకే సమయంలో రెండు జన్యువులను ఎడిట్ చేయగలిగారు. మునుపటి క్రిస్పర్ ప్రయోగాల వలె కాకుండా పరిశోధకులు ఎటువంటి పెద్ద డీఎన్‌ఏ నష్టాన్ని గమనించలేదు.

క్లినికల్ వినియోగానికి సవాళ్లు

ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉన్నప్పటికీ ప్రక్రియ పరిపూర్ణంగా లేదు. కొన్ని సందర్భాల్లో ఎడిటింగ్ అణువులు వాటి లక్ష్యాన్ని చేరుకోవడంలో విఫలమయ్యాయి. ఫలితంగా ఒకే పిండంలోని కొన్ని కణాలు ఎడిట్ కాగా మరికొన్ని మారకుండా ఉండిపోయాయి. ఈ పిండాలు శిశువులుగా అభివృద్ధి చెందితే ఈ తేడాలు ఆరోగ్య సమస్యలను కలిగించవచ్చు. ఈ అధ్యయనం సహ రచయిత నాథన్ ట్రెఫ్ మాట్లాడుతూ.. ఈ సాంకేతికత చివరికి ఐవీఎఫ్ రోగులకు సహాయపడుతుందని అన్నారు.

నైతిక, భద్రతా ప్రమాదాలపై నిపుణుల హెచ్చరిక

మానవ పిండాలను ఎడిట్ చేయడం వల్ల కలిగే దీర్ఘకాలిక పరిణామాల గురించి కొందరు శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. గణనీయమైన అనిశ్చితులు ఉన్న సాంకేతికతను ప్రవేశపెట్టడం అవసరమా అని కాలిఫోర్నియా యూనివర్సిటీ జన్యు శాస్త్రవేత్త ఫ్యోడోర్ ఉర్నోవ్ ప్రశ్నించారు. వ్యాధులను నివారించడం కంటే లక్షణాలను మెరుగుపరచుకోవడానికి చూసే వ్యక్తులు ఈ పరిశోధనను ఉపయోగించుకొనే ప్ర మాదం ఉందని ఉర్నోవ్ హెచ్చరించారు. ఒకేసారి ఎక్కువ జన్యువులను ఎడిట్ చేయడానికి ప్రయత్నిస్తే వైఫల్యం చెందే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని డాక్టర్ ఎగ్లీ పేర్కొన్నారు. ఏదైనా క్లినికల్ వినియోగాన్ని పరిశీలించే ముందు ప్రధాన శాస్త్రీయ, వైద్య, నైతిక ప్రశ్నలకు సమాధానాలు కనుగొనవలసి ఉన్నదని పరిశోధకులు చెబుతున్నారు.

క్యాన్సర్ ఔషధాలకు తీవ్ర కొరత!

రోగుల ఆందోళన

పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రమాదమంటున్న వైద్యులు



న్యూఢిల్లీ, జూన్ 5: క్యాన్సర్ చికిత్సలో భాగంగా నిర్వహించే కీమోథెరపీలో ముఖ్యంగా వాడే రెండు ప్రధాన ఔషధాలకు దేశ వ్యాప్తంగా తీవ్ర కొరత ఏర్పడింది. చికిత్సలో వినియోగించే సిస్‌ప్లాటిన్, కార్బోప్లాటిన్ ఔషధాలు మార్కెట్‌లో లభ్యం కావడం లేదని, వీటికి తీవ్ర కొరత ఉందని క్యాన్సర్ రోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఊపిరితిత్తులు, గర్భాశయ ముఖద్వార, అండాశయ, తల, మెడ క్యాన్సర్ చికిత్సలో ఈ రెండు మందులను విస్తృతంగా వాడుతుంటారు. అయితే దేశ వ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో ఈ రెండు మందుల సరఫరాలో ఇబ్బందులు ఏర్పడ్డాయని అధికారులు తెలిపారు. దీంతో రోగులకు వైద్యం అందించడంలో ఆలస్యమవుతున్నదని, ప్రత్యామ్నాయ చికిత్సా విధానాలను అవలంబించాల్సి వస్తున్నదని డాక్టర్లు తెలిపారు. మందుల కొరత కారణంగా దేశవ్యాప్తంగా సరఫరా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడింది.

ఆందోళనకరంగా పరిస్థితి

గత నాలుగు నెలలుగా పశ్చిమాసియా యుద్ధం కారణంగా ఈ ఔషధాలలో వాడే కీలక పదార్థం ప్లాటినం ధరలు అధికంగా పెరిగాయని, అందుకే వీటికి కొరత ఏర్పడిందని పరిశ్రమ ప్రతినిధులు తెలిపారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే తప్పనిసరిగా వైద్య చికిత్స అందించాల్సిన రోగుల ఆరోగ్య పరిస్థితిపై తీవ్ర ప్రభావం పడుతుందని ఎయిమ్స్, ఢిల్లీ సర్జికల్ ఆంకాలజిస్ట్ ఎండీ రే తెలిపారు. 'ప్రస్తుతం ఔషధ నిల్వల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఉన్న సరుకు ఒకటి రెండు రోజులకే సరిపోతుంది. ఆ తర్వాత పరిస్థితి విపత్కరమవుతుంది' అని సర్ గంగారామ్ హాస్పిటల్ చైర్మన్ శ్యామ్ గార్గ్ పేర్కొన్నారు. ముడి సరుకు ధరలు పెరిగినందున క్యాన్సర్ మందుల ధరలను పెంచాలంటూ తయారీదారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం పెంచకపోడంతో.. నష్టాలకు వాటి తయారీని తగ్గించడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు.

అసెంబ్లీని సందర్శించిన హిరోషిమా ప్రతినిధులు

- స్వాగతం పలికిన మండలి చైర్మన్, డిప్యూటీ చైర్మన్

హైదరాబాద్, జూన్ 5(నమస్తే తెలంగాణ): జపాన్ దేశం హిరోషిమా రాష్ట్రానికి చెందిన ప్రతినిధుల బృందం శుక్రవారం తెలంగాణ అసెంబ్లీ, మండలిని సందర్శించింది. వీరికి మండలి చైర్మన్, డిప్యూటీ చైర్మన్లు గుత్తా సుఖేందర్‌రెడ్డి, బండ ప్రకాశ్ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారితో సమావేశమై తెలంగాణ చట్ట సభల పనితీరు, ప్రాధాన్యతను వివరించారు. హైదరాబాద్ నగరం గొప్పతనాన్ని తెలియజెప్పారు. కార్యక్రమంలో మండలి విప్‌లు అద్దంకి దయాకర్, వెంకట నర్సింగరావు, ఎమ్మెల్సీలు దాసోజు శ్రావణ్‌కుమార్, అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు టీ రాంమోహన్‌రెడ్డి, పాల్వాయి హరీశ్, మండలి సెక్రటరీ నర్సింహాచార్యులు, శాసనసభ సెక్రటరీ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది జలసమాధి

- కామారెడ్డి, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఘటనలు
- బోలక్‌పల్లి, లింబాద్రిగుట్ట వద్ద ముగ్గురు చొప్పున, కిష్టంపల్లి చెరువులో మునిగి ఇద్దరు మృతి


అరవింద్ (ఫైల్)


వర్షిణి (ఫైల్)


హరీశ్ (ఫైల్)


సోహెల్(ఫైల్)


రెహమాన్(ఫైల్)

బాన్సువాడ రూరల్/పిట్లం/భీమ్‌గల్/జడ్చర్లటౌన్, జూన్ 5: నిజామాబాద్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో శుక్రవారం వేర్వేరుగా జరిగిన ఘటనల్లో ఎనిమిది మంది జల సమాధి అయ్యారు. కామారెడ్డి జిల్లా పిట్లం మండలం బోలక్‌పల్లి శివారులోని మంజీర తీరంలో తల్లి, కూతురితోపాటు మరో బాలిక, నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం లింబాద్రి గుట్ట సమీపంలో నీటి కుంటలో మునిగి ముగ్గురు, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం కిష్టంపల్లి చెరువులో ఇద్దరు మరణించారు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా పిట్లం మండలం కిష్టాపూర్‌కు చెందిన పండరి.. బోలక్‌పల్లి శివారులోని మంజీర నది వద్ద శుక్రవారం ఎల్లమ్మ పండుగ చేశారు. ఈ కార్యక్రమానికి తన ఇద్దరు అన్నలు, అక్కాచెల్లెళ్లు వచ్చారు. పండుగ ముగించుకుని సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్లే క్రమంలో పండరి కుమార్తె పవనశ్రీ (15), సోదరి అనిత (35), ఆమె కూతురు శివాని (13)తోపాటు భానుప్రసాద్, సుషాంత్ సరదాగా మంజీర నది నీటి వద్దకు వెళ్లారు. అందులో ఒకరు ప్రమాదవశాత్తు కాలి జారి నీటిలో పడిపోగా, కాపాడేందుకు ఒక్కొక్కరుగా నీటిలోకి దూకారు. వారంతా మునిగిపోతూ కేకలు వేయగా, మిగతా కుటుంబ సభ్యులు పరిగెత్తుకుంటూ వచ్చి వారిని బయటకు తీశారు. అంబులెన్స్‌లో హుటాహుటిన బాన్సువాడ దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షించి.. అనిత, శివాని, పవనశ్రీ అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. అపస్మారక స్థితిలో ఉన్న భానుప్రసాద్, సుషాంత్‌కు వైద్యం అందించడంతో ప్రాణాలతో బయటపడ్డారు.

కుంటలో పడి ముగ్గురు చిన్నారులు..

నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలంలోని ప్రముఖ పుణక్షేత్రం లింబాద్రి గుట్ట సమీపంలోని ఒడ్డెర కాలనీకి చెందిన ద్యారంగుల సురేశ్ కుమారుడు అరవింద్ (4), కంది మహేశ్ కూతురు వర్షిణి (5), కుమారుడు హరీశ్ (10) శుక్రవారం ఉదయం ఆడుకుంటూ సమీపంలోని బ్రాహ్మణ కుంట వద్దకు వెళ్లారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన చిన్నారులు ఎంతకూ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అటవీ ప్రాంతంలో వెతికినా ఆచూకీ లభించలేదు. పిల్లలు కనిపించడం లేదని సురేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు పరిసరాల్లో గాలించినా లాభం లేకపోయింది. చివరకు ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్ల సాయంతో బ్రాహ్మణ కుంటలో వెతుకగా ముగ్గురి మృతదేహాలు వెలుగుచూశాయి.

ఎర్రచెరువులో ఈతకు వెళ్లి ఇద్దరు బాలురు..

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని నిమ్మబావిగడ్డకు చెందిన సోహెల్ (14), అబ్దుల్ రెహమాన్(15) మరో ఇద్దరు మిత్రులతో కలిసి శివారులోని కిష్టంపల్లి గ్రామ ఎర్రచెరువులో ఈత కొట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో సోహెల్, అబ్దుల్ రెహమాన్‌కు ఈత రాకపోవటంతో కాలు జారి నీట మునిగారు. తోటి మిత్రులు వెంటనే వారి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వచ్చి చెరువులో గాలించగా ఇద్దరి మృతదేహాలను బయటకు తీశారు.


ఖమ్మం జిల్లా ఏదులాపురంలోని ఓ కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో 'చలో హైదరాబాద్' పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఏఐ నేతలు

18న కాంట్రాక్టర్ల చలో హైదరాబాద్

- బిల్లులు రాక గుత్తేదారుల గుండెలు ఆగుతున్నయ్
- ఉపాధిలేక వీధిన పడుతున్న కార్మికుల కుటుంబాలు
- రాష్ట్రవ్యాప్తంగా 20 వేల కోట్ల పెండింగ్ బకాయిలు
- బిల్లుల కోసం బిచ్చగాళ్లలా తిరుగుతున్నం : బీఏఐ నేతలు

ఖమ్మం, జూన్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్రవ్యాప్తంగా వందలాదిమంది గుత్తేదారులకు వేల కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో అనేకమంది గుండెలు ఆగిపోయాయని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఓ ప్రైవేట్ కన్వెన్షన్‌లో స్థానిక కాంట్రాక్టర్లతో కలిసి అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డీవీఎన్ రెడ్డి, రాష్ట్ర చైర్మన్ శ్రీనివాసరావు, కార్యదర్శి పవన్, కోశాధికారి సంతోష్‌రెడ్డి, కిసాన్ శ్రీనివాసరావు, ఖమ్మం సెంటర్ చైర్మన్ కిశోర్ మీడియా సమావేశం నిర్వహించారు. గుత్తేదారుల్లో భరోసా కల్పించేందుకు 18న చలో హైదరాబాద్‌కు పిలుపునిస్తూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వివిధ శాఖలకు సంబంధించిన కాంట్రాక్టర్లు బిల్లులు రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదనచెందారు. కొద్దిమందికి మాత్రమే బిల్లులు అందుతున్నాయని, ఆది నుంచి నిర్మాణ పనులు చేసిన వారికి తీవ్ర అన్యాయం జరుగుతున్నదని విమర్శించారు. ఇప్పటికే చాలామంది గుండెపోటుతో మృతిచెందగా, కొందరు ఆత్మహత్య చేసుకున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటివరకు ప్రభుత్వం రూ.20 వేల కోట్లు చెల్లించాల్సి ఉన్నదని సూచించారు. బిల్లుల కోసం కాంట్రాక్టర్లు బిచ్చగాళ్లలా తిరుగుతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని మండిపడ్డారు. చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అగ్ని ప్రమాదంలో ముగ్గురు సజీవ దహనం

- మంటల ధాటికి పేలిన సిలిండర్
- మృతుల్లో అమ్మమ్మ, మనుమడు, మనుమరాలు
- మిర్యాలగూడలో ఘటన


చంద్రకళ (ఫైల్)


ప్రణతి(ఫైల్)


లక్ష్మణ్ (ఫైల్)

మిర్యాలగూడ, జూన్ 5: ఓ ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదంలో ముగ్గురు సజీవ దహనమయ్యారు. మంటలు వ్యాపించడంతో గ్యాస్ సిలిండర్ కూడా పేలింది. ఈ విషాదకర ఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకున్నది. భర్త చనిపోయి సరిగ్గా నెలరోజులు కావస్తుండటం.. నెల మాసికానికి ఏర్పాట్లు చేసుకున్న తరుణంలో భార్య చనిపోవడం అందరిని కలిచివేసింది. స్థానికుల కథనం ప్రకారం.. వనం చంద్రకళ (45) పట్టణంలోని కలాల్ వాడలోని ఓ రేకుల ఇంట్లో నివాసం ఉంటున్నది. తన కూతురు ధనమ్మ పిల్లలైన లక్ష్మణ్ (16), ప్రణతి (14) కూడా ఆమెతోనే ఉంటున్నారు. చంద్రకళ పట్టణంలోని పలు ఇండ్లల్లో పనులుచేస్తూ జీవనం సాగిస్తున్నది. చంద్రకళ కూతురు ధనమ్మ భర్త పదేండ్ల క్రితమే మరణించాడు. అయితే ఆమె కొడుకు, కూతురిని తల్లి వద్ద ఉంచి హైదరాబాద్‌లో పనిచేసుకుంటూ అక్కడే ఉంటుంది. నెల రోజుల క్రితమే చంద్రకళ భర్త సైదులు మృతి చెందాడు. ధనమ్మ మిర్యాలగూడకు వచ్చి తండ్రి అంత్యక్రియలు పూర్తిచేసింది. కొద్దిరోజులపాటు ఇక్కడే ఉండి పని కోసం పుణెకు వెళ్లింది. తన ఇద్దరు పిల్లల్ని తల్లి వద్దే ఉంచి వెళ్లింది. శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. అదే గదిలో గ్యాస్ సిలిండర్ కూడా ఉండటంతో మంటల ధాటికి గ్యాస్ సిలిండర్ పేలిపోయింది. చంద్రకళతోపాటు ఆమె మనుమడు, మనుమరాలికి మంటలు అంటుకుని బయటికి వెళ్లే పరిస్థితి లేకపోవడంతో గదిలోనే సజీవ దహనమయ్యారు. మంటలు, పొగలు రావడాన్ని గమనించిన పక్కనే ఉండే చంద్రకళ బంధువులు వచ్చి చూసేసరికి వారు అప్పటికే చనిపోయి ఉన్నారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేశారు. డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ నాగభూషణరావు ఘటనా స్థలానికి వచ్చి మృతదేహాలను ఏరియా దవాఖానకు తరలించారు. శనివారం.. భర్త సైదులు నెల మాసికం ఉండగా చంద్రకళ అందుకోసం ఏర్పాట్లు చేసుకున్నది. ఇంతలోనే ఘోరం జరిగిందని బంధువులు ఆవేదన చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నాగభూషణరావు తెలిపారు.

కోస్గి ఇంజినీరింగ్ కాలేజీపై హ్యాండ్సప్!

- సీఎం సొంత నియోజకవర్గంలోని కాలేజీని నడుపలేని వైనం
- రెండేండ్లకే తమవల్ల కాదని చేతులెత్తేసిన రేవంత్ రెడ్డి సర్కార్
- జేఎన్‌టీయూహెచ్‌కి బదలాయింపు

హైదరాబాద్, జూన్ 5 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీ కోస్గి. రాష్ట్రంలోనే తొలి ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీ. పైగా సీఎం నియోజకవర్గంలోని కాలేజీ ఇది. ఈ కాలేజీని నడుపలేమని, తమ వల్ల కాదని సర్కార్ చేతులెత్తేసింది. సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలోని ఈ కాలేజీని జేఎన్టీయూహెచ్‌కు బదలాయించేందుకు రంగం సిద్ధం చేసింది. కొత్త విద్యాసంవత్సరం నుంచి కోస్గి ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కాలేజీగా వ్యవహరించనున్నారు. ఇదే జేఎన్టీయూ కాన్‌స్టిట్యూయంట్ కాలేజీ పేరుతో సీట్లు భర్తీచేస్తారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లోని కోస్గిలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీని ప్రభుత్వం 2024లో ఏర్పాటు చేసింది. సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తొలి ఇంజినీరింగ్ కాలేజీ ఇదే. మరో 10 ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీలు సైతం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. కానీ కాలేజీల ఏర్పాటుకు బ్రేక్‌లు పడ్డాయి. ఆ తర్వాత ఉన్న ఒక్క కాలేజీని నడుపలేమంటూ సాంకేతిక విద్యాశాఖ అశక్తతను వ్యక్తంచేసింది. జేఎన్టీయూకు అప్పగించడంలో భాగంగా సర్కార్ జేఎన్టీయూహెచ్ నుంచి ప్రతిపాదనలు కోరింది. భవనాలు, ల్యాబ్స్, రూ. 100కోట్లు, 40 వరకు టీచింగ్ ఫ్యాకల్టీ పోస్టులు మంజూరు చేయాలని జేఎన్టీయూ సర్కార్‌ను అభ్యర్థించింది. 516 పోస్టుల భర్తీకి అనుమతి ఇవ్వాలని కోరింది. జేఎన్టీయూ పాలేరు, మహబూబాబాద్, సిరిసిల్ల కాలేజీలు అనేక సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి.

చేరినవారు వెనక్కి..

కోస్గి ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీలో సీఎస్‌ఈ, సీఎస్‌ఈ ఏఐఎంఎల్, సీఎస్‌ఈ డాటా సైన్స్ వంటి మూడు కోర్సులు ప్రవేశపెట్టారు. ఒక్కో బ్రాంచిలో 60 చొప్పున 180 సీట్లున్నాయి. మొదటి బ్యాచ్‌లో 140 మంది చేరగా, రెండో బ్యాచ్‌లో విద్యార్థుల సంఖ్య 80కి పడిపోయింది. కొందరు కౌన్సెలింగ్‌లో సీట్లు పొంది.. ఆ తర్వాత రద్దుచేసుకుని, ఇతర కాలేజీల్లో చేరుతున్న ఉదంతాలున్నాయి.


డీజీపీ ఆనంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధులు

పోలీస్ అధికారుల సంఘం ఎన్నికలు నిర్వహించండి

అధికారులకు డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశం

హైదరాబాద్, జూన్ 5 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ స్టేట్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికలను త్వరితగతిన నిర్వహించాలని డీజీపీ సీవీ ఆనంద్ అధికారులను ఆదేశించారు. అసోసియేషన్ ప్రతినిధులు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నిక కావాల్సిన అవసరం ఉన్నదని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర అధ్యక్షుడు గోపిరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం డీజీపీని కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ మేరకు డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. పోలీస్ సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారంలో అసోసియేషన్ కీలక పాత్ర పోషించనున్నందున ఎన్నికలు త్వరగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

వెయిట్ లిఫ్టింగ్ విజేతలకు అభినందన

హర్యానాలోని మధుబన్‌లో నిర్వహించిన 3వ ఆలిండియా పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్-2026-27లో జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ పోలీస్ క్రీడాకారులు ప్రతిభ కనబరిచి 3 పతకాలను సాధించారు. మే 23 నుంచి 27 వరకు జరిగిన ఈ పోటీల్లో తెలంగాణ పోలీస్ జట్టు ఒక రజత, రెండు కాంస్య పతకాలు కైవసం చేసుకొన్నది. జాతీయ స్థాయిలో అద్భుత ప్రదర్శన కనబరిచి పతకాలు గెలిచినందుకు క్రీడాకారులను డీజీపీ సీవీ ఆనంద్ శుక్రవారం అభినందించారు.

పర్యావరణంపై చైతన్యం పెరుగాలి

- రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ ప్రియాంక

హైదరాబాద్, జూన్ 5 (నమస్తేతెలంగాణ): పాఠశాల విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం పెరుగాలని తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్, సీసీఎఫ్ ప్రియాంకా వర్గీస్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీ(టీజీఎస్ఎఫ్ఏ) ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ, వాతావరణ మార్పులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం వీడియోల ద్వారా ప్రదర్శన, ఉపన్యాస పోటీలు, పాములపై అవగాహన కల్పించారు. మొక్కలు నాటడం, నీటిని పొదుపుగా వినియోగించడంపై విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

బొల్లా బ్రహ్మనాయుడు అరెస్టు

- కాంచీపురంలో పట్టుకున్న హైదరాబాద్ పోలీసులు
- గండిపేట భూమి కబ్జా కుట్ర కేసులో కీలక పురోగతి సాధించిన పోలీసులు


నిందితుడు బొల్లా బ్రహ్మనాయుడు

మణికొండ, జూన్ 5: గండిపేట మండలంలోని 18వ సర్వే నంబర్‌లో 10 ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు కుట్ర పన్నిన కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఎట్టకేలకు హైదరాబాద్ పోలీసులకు పట్టుబడ్డాడు. నార్సింగి పోలీసులతోపాటు సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు తమిళనాడులోని కాంచీపురంలో ఆయనను అరెస్ట్ చేశారు. ప్రభుత్వ భూమిని రెగ్యులరైజ్ చేయించుకునేందుకు నకిలీ జీవోలు, తప్పుడు రెవెన్యూ రికార్డులు, నకిలీ పత్రాలు సృష్టించారన్న గండిపేట తహసీల్దార్ ఎన్ శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు నమోదైంది. ఆ ఆరోపణలు నిజమేనని దర్యాప్తులో తేలడంతో పోలీసులు ఇప్పటికే కొందరు నిందితులను అరెస్ట్ చేశారు. వారిని న్యాయస్థానం ముందు హాజరుపరచడంతో తదుపరి విచారణ కోసం పోలీస్ కస్టడీకి అప్పగించారు. ఈ కేసులో అరెస్టు నుంచి తప్పించుకునేందుకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని బ్రహ్మనాయుడు తెలంగాణ హైకోర్టును కోరాడు. కానీ, కేసు తీవ్రత దృష్ట్యా హైకోర్టు ఆయన బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. దీంతో పరారీలో ఉన్న బ్రహ్మనాయుడును పోలీసులు కాంచీపురంలో అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో మరికొందరి ప్రమేయంపై కూడా దర్యాప్తు జరుపుతున్నట్టు పోలీసులు వెల్లడించారు.

నత్తనడకన ఇంటర్ అఫిలియేషన్లు!

- 1,937 కాలేజీల్లో 1,089 కాలేజీలకు మాత్రమే గుర్తింపు
- ఇప్పటికీ 128 సర్కార్ కాలేజీలకు అఫిలియేషన్ దక్కని వైనం
- గురుకులాలు, కేజీబీవీలకు సైతం..
- అఫిలియేషన్లు పూర్తయితేనే కొత్త అడ్మిషన్లకు అవకాశం
- గుర్తింపు దక్కకపోవడంతో ప్రైవేట్ బాట పట్టిన విద్యార్థులు



హైదరాబాద్, జూన్ 5 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఇంటర్మీడియట్ కళాశాలల అఫ్లియేషన్ ప్రక్రియ నత్తనడకను తలపిస్తున్నది. పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఇంటర్‌బోర్డు గుర్తింపు పొందిన కాలేజీల్లో మాత్రమే చేరాలని, గుర్తింపు పొందిన కాలేజీల జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని ఊదరగొట్టే ఇంటర్మీడియట్ బోర్డు.. ఇంతవరకూ అఫిలియేషన్లు పూర్తి చేయలేదు. ఏకంగా 128 సర్కార్ జూనియర్ కాలేజీలు అఫిలియేషన్ గుర్తింపునకు నోచుకోలేదు. అనుబంధ గుర్తింపును జారీ చేయలేదు. దీంతో విద్యార్థులు అడ్మిషన్లు పొందలేని పరిస్థితిలో ఆందోళనకు గురవుతున్నారు. గురుకులాలు, కేజీబీవీలు, మాడల్‌స్కూళ్ల వంటి గవర్నమెంట్ సెక్టార్ కాలేజీలు 1,937 దరఖాస్తు చేయగా ఇప్పటి వరకు 1,089 కాలేజీలకు మాత్రమే గుర్తింపు దక్కింది. మరో 848 ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య కాలేజీలకు గుర్తింపు దక్కకపోవడం గమనార్హం.

302 సర్కార్ కాలేజీలకే అనుమతి..

ఇంటర్మీడియట్ జూనియర్ కాలేజీలకు అనుబంధ గుర్తింపు జారీలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. విద్యాసంవత్సరం ప్రారంభమైనా సగం కాలేజీలకు కూడా ఆఫిలియేషన్ జారీ చేయలేదు. ఫలితంగా ప్రవేశాలపై ప్రభావం పడుతున్నది. పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ప్రవేశాలు పొందలేకపోతున్నారు. రాష్ట్రంలో 430 ప్రభుత్వ జూనియర్ కాలేజీలుంటే, ఇప్పటి వరకు 302 కాలేజీలకు మాత్రమే అనుమతి లభించింది. మరో 128 కాలేజీలకు ఇంటర్ బోర్డు గుర్తింపునివ్వలేదు. సర్కార్ కాలేజీలకు అనుబంధ గుర్తింపు లాంఛనమే. అయినా గుర్తింపు లభించకపోవడం గమనార్హం. ఇక 194 మాడల్ స్కూల్స్ ఉంటే, ఇప్పటి వరకు 90 కాలేజీలకు అనుమతి లభించింది. 219 కేజీబీవీలు, 150 బీసీ వెల్ఫేర్ జూనియర్ కాలేజీలు, 82 గిరిజన గురుకులాలు, 105 సోషల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజీలకు మాత్రమే అనుమతి లభించింది. సర్కార్ జూనియర్ కాలేజీలు, గురుకులాలకు అనుబంధ గుర్తింపు దక్కకపోవడంతో విద్యార్థులు ప్రైవేట్ బాట పడుతున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

యాజమాన్యాల వారీగా కాలేజీలు

యాజమాన్యం	మొత్తం కాలేజీలు	ఇప్పటి వరకు గుర్తింపు పొందినవి
ప్రభుత్వ జూనియర్ కాలేజీలు	430	302
బీసీ వెల్ఫేర్	261	150
కేజీబీవీ	283	219
మాడల్ స్కూల్స్	194	90
ఎస్సీ వెల్ఫేర్	237	105
మైనారిటీ గురుకులాలు	204	113
గిరిజన గురుకులాలు	128	82

ప్రైవేట్‌లో 210 కాలేజీలే..


ఇక ప్రభుత్వ కాలేజీలు అలా ఉంచితే ప్రైవేట్ కాలేజీలకూ ఆఫిలియేషన్ దక్కలేదు. 1,424 కాలేజీలు దరఖాస్తు చేస్తే 210 కాలేజీలకు మాత్రమే అనుబంధ గుర్తింపునిచ్చారు. 347 కాలేజీల దరఖాస్తులను తిప్పి పంపినట్టు అధికారులు చెప్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో 247 కాలేజీలకు 47, మేడ్చల్ మల్కాజిగిరిలో 211 కాలేజీలకు 58 కాలేజీలకు అనుబంధ గుర్తింపునిచ్చారు. 13 జిల్లాల్లో ఒక్క కాలేజీకీ గుర్తింపునివ్వలేదు. కొన్ని జిల్లాల్లో ఒకటి, రెండు చొప్పున కాలేజీలకే గుర్తింపునిచ్చారు. సరైనపత్రాలు సమర్పించకపోవడంతో గుర్తింపు నివ్వలేదని అధికారులు చెప్తున్నారు. ముందే ప్రక్రియను చేపట్టి పూర్తిచేయాల్సిందని కాలేజీల యాజమాన్యాలు పేర్కొంటున్నాయి.

వడదెబ్బతో బీఆర్‌ఎస్ నాయకుడి మృతి

మందమర్రి, జూన్ 5 : వడదెబ్బతో బీఆర్‌ఎస్ నాయకుడు మృతి చెందిన ఘటన మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మందమర్రిలోని కోదండ రామాలయ కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు మారం రామకృష్ణ(45) పని నిమిత్తం రెండు రోజులపాటు ఎండలో తిరిగాడు. గురువారం సాయంత్రం ఇంటికి చేరిన రామకృష్ణ.. స్నేహితులు ఫోన్ చేస్తే స్పందించలేదు. దీంతో శుక్రవారం ఉదయం ఇంటికి వెళ్లి చూడగా నిర్జీవంగా కనిపించాడు. ఎస్సై గోపతి నరేశ్ అక్కడికి చేరుకొని రామకృష్ణ మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. రామకృష్ణ మృతిపట్ల బీఆర్‌ఎస్ నాయకులు సంతాపం తెలిపారు.

భూగర్భ, గనుల శాఖలో సీఐడీ సోదాలు

- గ్రానైట్ క్వారీలకు చెందిన రికార్డుల పరిశీలన
- రెండు గంటలపాటు కొనసాగిన తనిఖీలు


రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

మహబూబాబాద్, జూన్ 5 (నమస్తే తెలంగాణ) : మహబూబాబాద్ కలెక్టరేట్‌లోని భూగర్భ, గనుల శాఖ కార్యాలయంలో శుక్రవారం సీఐడీ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్త తనిఖీల్లో భాగంగా హైదరాబాద్ నుంచి నలుగురు సీఐడీ అధికారులు వచ్చి సోదాలు నిర్వహించారు. మొదట జిల్లాలోని పలు గ్రానైట్ క్వారీలను పరిశీలించారు. అనుమతి లేనిప్రాంతాల్లో ఏమైనా తవ్వకాలు జరిపారా? లీజు తీసుకున్న మేరకే తవ్వకాలు జరిపారా? అనే కోణంలో సోదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్‌లోని గనుల శాఖ కార్యాలయానికి వెళ్లి గ్రానైట్ క్వారీల నుంచి రవాణా అయిన మెటీరియల్ వివరాలు, సీనరేజ్ అంశాలను పరిశీలిస్తున్నట్టు తెలుస్తున్నది. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి.. ఏడీ రమణారెడ్డి, ఏజీ నిరంజన్‌తో మాట్లాడి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. అయితే, తనిఖీల వివరాలు వెల్లడించేందుకు సీఐడీ అధికారులు నిరాకరించారు.

75% కన్నా తక్కువ ఉన్నా కౌన్సిలింగ్‌కు అనుమతి

సీబీఎస్‌ఈ విద్యార్థులకు ఐఐటీ ప్రవేశంలో ఉపశమనం: ఐఐటీ రూర్కీ

న్యూఢిల్లీ, జూన్ 5: జేఈఈ అడ్వాన్స్‌డ్ 2026కు అర్హత సాధించి సీబీఎస్‌ఈ మార్కుల వివాదంలో బాధితులుగా ఉన్న విద్యార్థులకు ఐఐటీ రూర్కీ పెద్ద ఉపశమనం కల్పించింది. 12వ తరగతిలో ఉండాల్సిన 75 శాతం కనీస మార్కులతో సంబంధం లేకుండా సీబీఎస్‌ఈ విద్యార్థులందరినీ జోసా కౌన్సిలింగ్‌కు అనుమతిస్తామని, అయితే ప్రమాణాలకు అనుగుణంగా ఉండే సవరించిన స్కోర్ కార్డును ఈ ఏడాది జూలై 15లోగా సమర్పించాలని, అప్పుడే వారికి సీట్ల కేటాయింపు జరుగుతుందని పరీక్షలు నిర్వహించిన ఐఐటీ రూర్కీ శుక్రవారం ఎక్స్‌లో ప్రకటించింది. సీబీఎస్‌ఈ 12వ తరగతి పరీక్షల్లో ఈ ఏడాది ప్రవేశపెట్టిన ఆన్ స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం)లో జరిగిన అవకతకవల కారణంగా మార్కులు తక్కువ రావడం, ఫెయిల్ కావడం, ఒకరి మార్కులు ఒకరికి పడటం వంటివి చోటుచేసుకున్నాయి. దీంతో అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించినప్పటికీ 12వ తరగతిలో నిర్దేశిత కటాఫ్ 75% (జనరల్, ఓబీసీ-ఎన్‌సీఎల్, జనరల్-ఈడబ్ల్యూఎస్) లేదా 65%(ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ) కన్నా కొందరికి తక్కువ మార్కులు వచ్చాయి. సీబీఎస్‌ఈ తప్పిదం కారణంగా 12వ తరగతి సీబీఎస్‌ఈ విద్యార్థులు ఐఐటీ సీట్‌ను కోల్పోకూడదన్న లక్ష్యంతో వారికి మార్కులతో సంబంధం ఈ వెసులుబాటు కల్పించినట్టు ఐఐటీ రూర్కీ తెలిపింది. ర్యాంకు ఆధారంగా మీకు సీటు కేటాయిస్తారని పేర్కొన్నది. అయితే జూలై 15లోగా స్కోర్ కార్డును సమర్పించాలని, నాలుగో రౌండ్ చివరిలో వారికి ఎక్కడ సీటు వచ్చిందో తెలిపి అడ్మిషన్ కల్పిస్తామని వివరించింది.

ఇన్నయ్యకు మధ్యంతర బెయిల్

- ఫిజియోథెరపీ కోసం మంజూరు



హైదరాబాద్, జూన్ 5 (నమస్తే తెలంగాణ): జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) నమోదు చేసిన కేసులో నిందితుడు గాదె ఇన్నయ్యకు తెలంగాణ హైకోర్టు 2 నెలల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. శస్త్రచికిత్స అనంతరం ఫిజియోథెరపీ కోసం ఇన్నయ్య జైలు వెలుపల ఉండాల్సిన అవసరం ఉందన్న వైద్యుల సూచనల మేరకు కఠిన షరతులతో బెయిల్‌కు అనుమతించింది. ఈ మేరకు జస్టిస్ నగేశ్ భీమపాక, జస్టిస్ వాకిటి రామకృష్ణారెడ్డి ధర్మాసనం శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. జూన్ 5 నుంచి ఆగస్టు 4 వరకు ఇన్నయ్య కూకట్‌పల్లి శుభోదయ కాలనీలోని తన కుమార్తె నివాసంలోనే ఉండాలని ఆదేశించింది. దర్యాప్తులో జోక్యం చేసుకోరాదని, సాక్షులను ప్రత్యక్షంగా లేదా ఫోన్ ద్వారా సంప్రదించరాదని, దర్యాప్తు అధికారులకు పూర్తిగా సహకరించాలని స్పష్టం చేసింది. నిందితుడి నివాసంపై నిఘా ఉంచేందుకు ఇద్దరు కానిస్టేబుళ్లను నియమించుకోవచ్చని దర్యాప్తు అధికారికి అనుమతిచ్చింది. ఇన్నయ్యతో ఆయన భార్య, కుమార్తె, అల్లుడు, ముగ్గురు సోదరీమణులు మాత్రమే ఉండాలని పేర్కొన్నది.



ఢిల్లీ తెలంగాణ భవన్‌లో జగిత్యాల మామిడి

జగిత్యాల, జూన్ 5 (నమస్తే తెలంగాణ): జగిత్యాల జిల్లా మామిడికి మరోసారి దేశవ్యాప్త గుర్తింపు లభించింది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో జగిత్యాల మామిడి పండ్ల ప్రదర్శనతోపాటు విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జగిత్యాల జిల్లాలో దాదాపు 30 వేల హెక్టార్లలో వివిధ రకాల మామిడి తోటలు సాగుచేస్తున్నారు. కాగా, తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం జగిత్యాల మామిడి పండ్ల మాధుర్యాన్ని దేశవిదేశాలకు విస్తరించేందుకు చర్యలు తీసుకున్నది. ఆ చర్యలో భాగంగా జగిత్యాల బ్రాండ్ పేరిట మామిడిని దేశ విదేశాలకు ఎగుమతి చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. కేసీఆర్ హయాంలో తీసుకున్న చర్యల నేపథ్యంలో జగిత్యాల ప్రాంత మామిడి పండ్లు గల్ఫ్‌తోపాటు ఇతర దేశాలకు ఎగుమతి కావడం ఆరంభమైంది. కాగా, రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జగిత్యాలకు చెందిన బంగినిపల్లి, కేసర్, హిమావత్, అల్ఫోన్సో రకాలకు చెందిన మామిడి పండ్లు ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మూడు రోజులపాటు ప్రదర్శించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో కలిసి ఢిల్లీలోని అంతర్జాతీయ పండ్ల మార్కెట్‌లో జగిత్యాల మామిడి ప్రదర్శనను చేపట్టినట్టు ధుని ఎక్సిమ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి అనిల్‌కుమార్ తెలిపారు.

భూమి సర్వేకు పదివేలు లంచం

ఏసీబీకి చిక్కిన సైదాపూర్ సర్వేయర్


ఏసీబీకి చిక్కిన సర్వేయర్ కుమారస్వామి


సైదాపూర్, జూన్ 5: భూమి సర్వే కోసం రూ.పదివేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు కరీంనగర్ జిల్లా సైదాపూర్ సర్వేయర్. ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలం అమ్మనగుర్తికి చెందిన ఓ రైతు తన భూమి సర్వే చేయాలని మండల సర్వేయర్ కుమారస్వామిని సంప్రదించగా, రూ. 25 వేలు డిమాండ్ చేశాడు. దీంతో సదరు రైతు ఒకసారి రూ. 5 వేలు, రెండోసారి రూ.10 వేలు మొత్తం రూ.15 వేలు ఇచ్చాడు. మిగతా రూ. 10 వేలు ఇస్తేనే భూమి సర్వే చేస్తానని చెప్పడంతో విసిగిపోయిన రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. సర్వేయర్ కుమారస్వామికి డబ్బులు ఇస్తానని రైతు చెప్పడంతో శుక్రవారం తన ప్రైవేట్ అసిస్టెంట్ రాజేశ్‌తో కలిసి వచ్చాడు. సోమారం క్రాసింగ్ వద్ద రాజేశ్ సదరు రైతు నుంచి రూ.10 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ అధికారులు సర్వేయర్ కుమారస్వామితోపాటు ప్రైవేట్ అసిస్టెంట్లు రాజేశ్, విహిత్ రెడ్డిపై కేసు నమోదు చేసి, వారిని కరీంనగర్‌కు తరలించారు.

అక్రమ నిర్బంధానికి ఆధారాల్లేవు: హైకోర్టు

హైదరాబాద్, జూన్ 5 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పీఎస్‌లో నమోదైన ఓ కేసులో నిందితురాలిని పోలీసులు చిత్రహింసలు పెట్టారంటూ మీనాకుమారి అనే మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఈ వ్యవహారంపై దర్యాప్తు కోసం సిట్‌ను ఏర్పాటు చేయాలన్న ఆమె అభ్యర్థనను తోసిపుచ్చింది. అక్రమ నిర్బంధానికి ఎలాంటి ఆధారాల్లేవని పేర్కొన్నది. ఈ మేరకు జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ఇటీవల తీర్పు వెలువరించారు. పిటిషనర్ కోరినట్టు సీసీటీవీ ఫుటేజీ భద్రపరచేలా ఆదేశాలు జారీచేసేందుకు నిరాకరించారు.

పీజీఈసెట్ ఎంట్రెన్స్‌లో రీజనింగ్, అర్థమెటిక్

కమ్యూనికేటివ్ ఇంగ్లిష్ కూడా.. 19 సబ్జెక్టులకు మూడు పరీక్షలు ● ఉన్నత విద్యామండలికి జేఎన్టీయూహెచ్ ప్రతిపాదనలు



హైదరాబాద్, జూన్ 5 (నమస్తే తెలంగాణ) : ఎంఈ, ఎంటెక్, ఎం ఫార్మసీ వంటి కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్(పీజీఈసెట్) పరీక్ష విధానం సమూలంగా మారనున్నది. కొత్తగా అర్థమెటిక్ రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్ సబ్జెక్టులను ఈ పరీక్షలో అంతర్భాగం చేయనున్నారు. పీజీఈసెట్ పరీక్ష రాసే వారంతా ఈ రెండు సబ్జెక్టులకు పరీక్షలు రాయాల్సిందే. ఒక్కో సబ్జెక్టుకు 25% చొప్పున వెయిటేజీ ఇవ్వనున్నారు. సంబంధిత సబ్జెక్టులకు 50% వెయిటేజీ ఉంటుంది. పీజీఈసెట్ పరీక్షల్లో కీలక సంస్కరణలను ప్రతిపాదిస్తూ జేఎన్టీయూహెచ్ ఉన్నత విద్యామండలికి ప్రతిపాదనలు పంపించింది. ఇవి త్వరలోనే సర్కార్‌కు చేరుతాయి. ఈ ప్రతిపాదనలను సర్కార్ ఆమోదిస్తే 2027-28 విద్యాసంవత్సరంలో కొత్త విధానం అమల్లోకి వస్తుంది.

- పీజీఈసెట్‌లో మొత్తం 19 సబ్జెక్టులున్నాయి. ఈ సబ్జెక్టులను ఒకే గొడుగు కిందికి తీసుకొస్తారు. మూడు లేదా నాలుగు సబ్జెక్టులుగా విభజిస్తారు.
- సీఎస్ఈ, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్ సబ్జెక్టులను సర్క్యూట్ సబ్జెక్టులుగా పరిగణిస్తారు. వీటిల్లోని కామన్ సబ్జెక్టులకు పరీక్ష ఉంటాయి.
- మెకానికల్, సివిల్, కెమికల్, మెటలర్జీ వంటి సబ్జెక్టులను నాన్ సర్క్యూట్ బ్రాంచిలుగా పరిగణిస్తారు. వీటిల్లోని కామన్ సబ్జెక్టులకు ఒకే కామన్ ఎగ్జామ్ ఉంటుంది.
- ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, బయోమెడికల్ సైన్స్ సహా సైన్స్ సబ్జెక్టులన్నింటికి ఒకే ఎగ్జామ్ ఉంటుంది. ఫార్మసీ విభాగానికి ప్రత్యేక పరీక్ష ఉంటుంది. పేపర్లను కుదించడం ద్వారా పీజీఈసెట్ పరీక్షలను రెండు రోజుల్లోనే పూర్తిచేయవచ్చని అధికారులు భావిస్తున్నారు.

పీజీఈసెట్‌లో మహిళల హవా

హైదరాబాద్, జూన్ 5 (నమస్తే తెలంగాణ) : ఎంఈ, ఎంటెక్, ఎం ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన టీజీ పీజీఈసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. శుక్రవారం కూకట్‌పల్లిలోని జేఎన్టీయూహెచ్‌లో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వీ బాలకిష్టారెడ్డి, జేఎన్టీయూ వీసీ ప్రొఫెసర్ టీకేకే రెడ్డి ఫలితాలు విడుదల చేశారు. ఈ ఫలితాల్లో మహిళలు 13,468(94.31%) క్వాలిఫై అయ్యి సత్తాచాటారు. పురుషులు 10,169(91.02%) క్వాలిఫై అయ్యారు. ఈసారి ప్రాథమిక 'కీ' పై నాలుగు అభ్యంతరాలు రాగా, ఒక అభ్యంతరాన్ని పరిగణనలోకి తీసుకుని, ర్యాంకులు ఖరారుచేశారు. ఈ కార్యక్రమంలో మండలి వైస్ చైర్మన్లు ఎస్కే మహమూద్, ఇటికాల పురుషోత్తం, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, జేఎన్టీయూ రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్, పీజీఈసెట్ కన్వీనర్ కే వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విభాగాలవారీగా టాపర్లు

విభాగం	టాపర్
ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్	జీ రేఖ
మెకానికల్ ఇంజినీరింగ్	బల్ల సందీప్
సివిల్ ఇంజినీరింగ్	అనుముట్ల మనోజ్
ఈసీఈ	సరయు
ఏరోస్పేస్ ఇంజినీరింగ్	నల్లా అభినందన్
బయో టెక్నాలజీ	వింజ్రావత్ అనూష
ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్	మహ్మద్ సాద్ అలీ
ఫార్మసీ	న్యాలం మైత్రి

ఈవెనింగ్ బీటెక్ నాలుగేండ్లు

మూడేండ్ల నుంచి నాలుగేండ్లకు పెంచే యోచన
జేఎన్టీయూ, ఓయూ పరిధిలో
11 కాలేజీల్లో 500 సీట్లు
వారం రోజుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్
తొలిసారిగా కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్

హైదరాబాద్, జూన్ 5 (నమస్తే తెలంగాణ): ఉద్యోగులు/వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం నిర్వహిస్తున్న ఈవెనింగ్ బీటెక్ కోర్సు వ్యవధిని పొడిగించాలని అధికారులు భావిస్తున్నారు. మూడేండ్ల వ్యవధి గల ఈ కోర్సులను నాలుగేండ్లకు పెంచాలన్న ఆలోచనలో ఉన్నారు. పాలిటెక్నిక్(డిప్లొమా) కోర్సులు పూర్తిచేసి, ఉద్యోగాల్లో స్థిరపడ్డవారు బీటెక్ సెకండియర్‌లో అడ్మిషన్ పొందేందుకు బీటెక్ వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోర్సులు నిర్వహిస్తున్నారు. వర్కింగ్ డేస్‌లో సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు.. వారాంతాల్లో రోజంతా తరగతులు నిర్వహిస్తున్నారు. ఉస్మానియా, జేఎన్టీయూ పరిధిలోని 11 కాలేజీల్లో 500 సీట్లకు అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) అనుమతి ఇచ్చింది. ఇందుకు జేఎన్టీయూ, ఓయూ అంగీకరించినట్టు ఓ సీనియర్ ప్రొఫెసర్ వెల్లడించారు. త్వరలోనే నిర్ణయం ప్రకటిస్తామని సదరు అధికారి తెలిపారు. ఉస్మానియా ఇంజినీరింగ్ కాలేజీ, అబ్దుల్ కలాం, అనుబోస్, జయప్రకాశ్ నారాయణ, ఎంజీఐటీ, సిద్ధార్థ, సెయింట్ పీటర్స్, వీఎన్నార్ విజ్ఞాన జ్యోతి, ఎంవీఎస్సార్, మెథడిస్ట్, స్టాన్లీ కాలేజీల్లో ఈవెనింగ్ బీటెక్ కోర్సులు నిర్వహిస్తున్నారు. ఈ కోర్సుల్లోని సీట్ల భర్తీకి రాష్ట్రస్థాయిలో కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ నిర్వహించనున్నారు. ఇలా కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ నిర్వహించడం ఇదే తొలిసారి. ఈ ఎగ్జామ్ నిర్వహణ బాధ్యతలను ఉస్మానియా యూనివర్సిటీకి అప్పగించారు. ఈ ఎగ్జామ్ ఈసెట్ తరహాలో ఉంటుంది. 100 ప్రశ్నలకు నిర్వహించే ఎగ్జామ్‌లో 90% ప్రశ్నలు ఆయా సబ్జెక్టుల నుంచి, 10% గణితం నుంచి ఉంటాయి. వారంలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని అధికారులు అంటున్నారు.

ఉద్యోగుల కోరిక మేరకే..

ఈవెనింగ్ కోర్సుల్లో చేరినవారంతా ఉద్యోగులే కావడంతో అటు ఉద్యోగం.. ఇటు కోర్సులు పూర్తిచేయడం కష్టంగా మారింది. దీంతో వ్యవధి పెంపు విషయంలో కదలిక వచ్చింది. సివిల్, సీఎస్ఈ, ఈసీఈ, మెకానికల్, మెటలర్జీ కోర్సులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ప్రతి సెమిస్టర్‌లో నాలుగు సబ్జెక్టులు పూర్తి చేయాల్సి ఉండగా, ప్రోగ్రామ్ వ్యవధి పొడిగింపు తర్వాత ప్రతి సెమిస్టర్‌కూ సబ్జెక్టుల సంఖ్యను మూడింటికి తగ్గించాలన్న ఆలోచన చేస్తున్నారు. కోర్సుల వ్యవధిని పెంచినా ఫీజుల పెంపు ఉండదని అధికారులు అంటున్నారు.

స్త్రీనిధి ఎండీగా విద్యాసాగర్‌రెడ్డి ఔట్

దివ్యాదేవరాజన్‌కు పూర్తి అదనపు బాధ్యతలు
'నమస్తే తెలంగాణ' వరుస కథనాల ఎఫెక్ట్

హైదరాబాద్, జూన్ 5 (నమస్తే తెలంగాణ): తెలంగాణ స్త్రీ నిధి క్రెడిట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్(ఎండీ)గా కొన్నేండ్లుగా కొనసాగుతూ వస్తున్న విద్యాసాగర్‌రెడ్డిని ఎట్టకేలకు ప్రభుత్వం పక్కకు తప్పించింది. సెర్ప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో)గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఐఏఎస్ అధికారి దివ్యాదేవరాజన్‌కు స్త్రీనిధి ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ఇటీవలే రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిశోర్ ఉత్తర్వులు జారీచేశారు. 'స్త్రీ నిధిలో అంతా కాంట్రాక్ట్ యవ్వారమే!' 'పరీక్ష లేకుండా కొలువుల పందేరం!' ఇలా పలు శీర్షికలతో ఆ సంస్థలో జరుగుతున్న అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలు ప్రచురించింది. ఆర్థికశాఖ అనుమతి లేకుండా భారీ వేతనాలతో 20 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వేయడం, రోస్టర్ విధానం పాటించకపోవడం వంటి అంశాలను ప్రభుత్వం, ప్రజల దృష్టికి తీసుకెళ్లింది. సంస్థ ఎండీ తీరుపై నిరుద్యోగ జేఏసీ నేతల నుంచి తీవ్ర విమర్శలు రావడం, సంస్థలో చోటుచేసుకున్న నిబంధనల ఉల్లంఘనలపై 'నమస్తే తెలంగాణ' కథనాలతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగింది. విద్యాసాగర్‌రెడ్డిని పక్కనబెట్టి దివ్యాదేవరాజన్‌కు ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించింది.

▶▶ త్వరలో ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు

రిటర్నింగ్ అధికారిగా సునీతాగోపాల్‌దాస్

హైదరాబాద్, జూన్ 5 (నమస్తే తెలంగాణ): టీజీఎస్‌ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణకు కార్మికశాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. హైదరాబాద్ జంటనగరాల కార్మికశాఖ జాయింట్ కమిషనర్ సునీతాగోపాల్‌దాస్‌ను రిటర్నింగ్ అధికారిగా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా రిటర్నింగ్ అధికారి పర్యవేక్షించనున్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అర్హులైన ఓటర్ల జాబితా ప్రకటన, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, భద్రతా ఏర్పాట్లు, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి, ఎన్నికల ప్రక్రియలో తలెత్తే వివాదాలు, సమస్యల పరిష్కారం వంటివన్నీ నిబంధనల ప్రకారం ఆమె పర్యవేక్షణలోనే జరుగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎన్నికల పూర్తి షెడ్యూల్, పోలింగ్ కేంద్రాలు, ఓటరు అర్హత ప్రమాణాలు, ఇతర ప్రక్రియల వివరాలను రిటర్నింగ్ అధికారి త్వరలోనే విడిగా నోటిఫికేషన్ ద్వారా ప్రకటించనున్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, క్రమశిక్షణతో ముగిసేలా అన్ని కార్మికసంఘాలు, ఆర్టీసీ ఉద్యోగులు, భాగస్వామ్యపక్షాలు పూర్తి సహకారం అందించాలని కార్మిక శాఖ విజ్ఞప్తి చేసింది.

▶▶ విద్యుత్తు అంబుడ్స్‌మెన్ నియామకానికి దరఖాస్తులు

హైదరాబాద్, జూన్ 5 (నమస్తే తెలంగాణ) : విద్యుత్తు వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు విద్యుత్తు అంబుడ్స్‌మెన్ పోస్టుల భర్తీకి విద్యుత్తు నియంత్రణ మండలి(ఈఆర్సీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లా రిటైర్డ్ జడ్జి, రిటైర్డ్ లా సెక్రటరీ(రాష్ట్ర ప్రభుత్వ), క్వాసీ జ్యుడిషియల్ బాడీ సభ్యుడిగా, చైర్మన్‌గా మూడేండ్లు సేవలందించిన వారు ఈ నెల 22లోపు దరఖాస్తు చేసుకోవచ్చు.

▶▶ పది అడ్వాన్స్‌డ్ పరీక్షలు షురూ..

హైదరాబాద్, జూన్ 5 (నమస్తే తెలంగాణ) : పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు 1,411 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. మొదటి భాషా పేపర్‌కు పరీక్ష నిర్వహించగా 6,086 మంది విద్యార్థులకు 4,675(76.82%) మంది పరీక్ష రాశారని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కే లింగయ్య తెలిపారు.

▶▶ నేటి నుంచి డీఈఈసెట్ వెబ్ ఆప్షన్లు

హైదరాబాద్, జూన్ 5 (నమస్తే తెలంగాణ) : డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఎల్‌ఈడీ) కోర్సులో ప్రవేశాలకు నిర్వహించిన డీఈఈసెట్ వెబ్ ఆప్షన్లు శనివారం నుంచి ప్రారంభంకానున్నాయి. విద్యార్థులు ఈ నెల 8వ తేదీ నుంచి వెబ్ ఆప్షన్లు ఎంచుకోవచ్చని కన్వీనర్ జీ రమేశ్ తెలిపారు. 9న ఎడిట్ ఆప్షన్ అందుబాటులో ఉంటుందని, ఈ నెల 14న సీట్లు కేటాయిస్తామని, జూలై 1 నుంచి క్లాసులు ప్రారంభమవుతాయని వెల్లడించారు.

▶▶ డిప్యూటీ ఈవో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

హైదరాబాద్, జూన్ 5 (నమస్తే తెలంగాణ) : పాఠశాల విద్యాశాఖ పరిధిలో 24 డిప్యూటీ ఈవో/గ్రేడ్-1 హెచ్‌ఎం పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. మల్టీ జోన్-1లో 10, మల్టీజోన్-2లో 14 చొప్పున పోస్టులున్నాయి. మొత్తం 450 మార్కులకు పరీక్షలు నిర్వహిస్తారు. ఈ నెల 12 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుంది. జూలై 19 సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అక్టోబర్‌లో పరీక్షలు నిర్వహిస్తామని టీజీపీఎస్సీ వెల్లడించింది.

▶▶ పీజీ ప్రవేశాల దరఖాస్తుకు 10 వరకు గడువు

హనుమకొండ చౌరస్తా, జూన్ 5: 2026-27 విద్యాసంవత్సరానికి వివిధ విశ్వవిద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీజీ) కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న 'టీజీ సీపీగెట్-2026' ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతున్నదని టీజీ సీపీగెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ కట్ల రాజేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా నిర్ణీత దరఖాస్తు రుసుము చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 14వ తేదీ వరకు రూ.500 అపరాధ రుసుముతో, 18 వరకు రూ.2 వేల అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నదని సూచించారు. అభ్యర్థులకు ఏవైనా సందేహాలుంటే queries-tgcpget26@ gmail.comకు ఈ-మెయిల్ పంపవచ్చని, కార్యాలయ సమయాల్లో 0870-2934285 నంబర్‌కు సంప్రదించవచ్చని తెలిపారు. ఇప్పటివరకు వివిధ పీజీ కోర్సులకు 23,916 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్టు రాజేందర్ పేర్కొన్నారు.

▶▶ 9న నిట్‌లో జోసా అభ్యర్థులకు ఓపెన్‌హౌస్

హనుమకొండ చౌరస్తా, జూన్ 5: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ (జోసా) 2026 కౌన్సెలింగ్‌లో పాల్గొనే విద్యార్థులు వారి తల్లిదండ్రుల కోసం ఈ నెల 9న ఉదయం 10 గంటలకు హనుమకొండలోని నిట్‌లో అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించనున్నారు. కౌన్సెలింగ్‌లో పాల్గొనే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సంస్థ మౌలిక సదుపాయాలు, పరిశోధన, ఆవిష్కరణలు, ప్లేస్‌మెంట్ అవకాశాలు, విద్యార్థి సహాయక సేవలు, క్యాంపస్ జీవనంపై అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నది. తద్వారా విద్యార్థులు తమ ఉన్నత విద్యకు సంబంధించిన నిర్ణయాలను సమగ్ర సమాచారం తెలుసుకునే అవకాశం కలుగుతుంది. అధిక సంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొనేందుకు వీలుగా ఈ కార్యక్రమాన్ని వరంగల్ నిట్ అధికారిక యూట్యూబ్ చానల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. ప్రత్యక్షంగా హాజరుకాలేని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఇతర ఆసక్తిగలవారు live/HsrZFv7N_1M?feature=share లింక్ ద్వారా కార్యక్రమాన్ని వీక్షించవచ్చని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి తెలిపారు.



జూన్ అంటున్నది.. హ్యాపీ జర్నీ!

జర్నీ అనగానే ఉత్సాహం వస్తుంది. ఇక లాంగ్ జర్నీ అంటే ఆ థ్రిల్లే వేరుగా ఉంటుంది! ఇది లాంగ్ జర్నీ సీజన్. రోడ్ ట్రిప్ వేయాలని కోరుకునే బైకర్స్‌కే కాదు కార్ల ఓనర్లూ కూడా ప్రకృతిని చుట్టివచ్చేందుకు ప్రణాళికలు వేసుకుంటూ ఉంటారు. దేశంలో లాంగ్ జర్నీకి జూన్ అంత అనుకూలమైన కాలం మరోటి లేదు. హిమాలయ పర్వత ప్రాంతాల నుంచి దక్షిణాదిన ఉన్న పశ్చిమ కనుమలు, తూర్పు కనుమల వరకు అన్నీ చూసేందుకు ఇదే అనువైన సమయం. చిరు జల్లులు తప్ప వరదలు పోటెత్తే వర్షాలుండవు. వేసవికి ఆవిరైన మంచు తెరచిన దారులు హిమాలయ



పర్యాటకులను ఆహ్వానిస్తున్నాయి. సముద్ర మట్టానికి 16,040 అడుగుల ఎత్తుకు తీసుకుపోయే 'బరాలచ లా' రోడ్డు మార్గంలో మనాలి నుంచి లేహ్‌కు ప్రయాణించేందుకు ఎంతోమంది పర్యాటకులు ఈ నెలలో బయలుదేరతారు. బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ ఈ రోడ్లపై ఉండే మంచుని జూన్ మాసంలో పూర్తిగా తొలగిస్తుంది. పర్యాటకులు మనాలి నుంచి లేహ్‌కు ఎంతో ఆనందంగా ప్రయాణం చేసి రావొచ్చు. జూన్ మాసంలో రోజులో దాదాపు 12 గంటలపాటు పగటి వెలుతురు ఉంటుంది. కాబట్టి ఈ నెల రోడ్ ట్రిప్ వేసేవారికి అనువైనది. పశ్చిమ కనుమల్లో బెంగళూరు నుంచి కూర్గు, చిక్‌మంగళూరు ప్రాంతాల్లో రుతుపవనాలు చిరుజల్లులు కురిపిస్తుంటాయి. అడవి, మైదానాలు పచ్చబడి భలే అందంగా మారిపోయే కాలం ఇది. ఇక మలుపులతో ఉండే రోడ్డులో అప్ అండ్ డౌన్ ప్రయాణం వింతగా ఉంటుంది. ఈ ప్రయాణానికి కోయంబత్తూరు పొలాచ్చి మీదుగా వల్పరాయ్ ప్రయాణం కొత్తగా ఉంటుంది. తొందరగా ప్రయాణం పూర్తి చేయాలంటే ముంబై నుంచి లూనావాలా ఎంచుకుంటే ప్రయాణం సాఫీగా సాగిపోతుంది. మధ్యలో మహాబలేశ్వరం చూసిరావొచ్చు. ఇంకెందుకు ఆలస్యం విమానాల టికెట్స్ బుకింగ్ సమస్య లేదు, అనుమతులు అవసరమే లేని ప్రయాణం కదా! చలో...!!

ఆకుపచ్చని అద్భుతం..
దేవకీ వనం!

సృష్టిలో అమ్మను మించిన యోధులు లేరంటారు. ఆ అమ్మే ప్రకృతికి తల్లిగా మారితే? ఎడారిలో సైతం ఆకుపచ్చని ఆశలు చిగురిస్తాయి. కాంక్రీట్ జంగిల్ కూడా హరిత వనంగా మారిపోతుంది. ఈ మాటలు అక్షరాలా నిజమే అనిపిస్తుంది కేరళకు చెందిన 92 ఏండ్ల **దేవకీ అమ్మ** పెంచిన అడవిని చూస్తే. ఒకటో రెండో కాదు... ఏకంగా ఐదు ఎకరాల్లో ఆమె పెంచిన తపోవనం ప్రకృతికి ఓ వరం. పట్టుదల ఉంటే ప్రకృతిని సైతం మన ఇంటి చుట్టూ బంధించవచ్చని నిరూపించిన ఆమె కృషికి భారతావని ఇటీవల అత్యున్నత 'పద్మశ్రీ' పురస్కారంతో సలక్షణంగా ప్రణమిల్లింది. ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొంటూ సాగిన ఆమె ప్రయాణం ఈ తరానికి స్ఫూర్తిదాయకం!

పచ్చదనాన్ని ఇష్టపడటం వేరు దాన్నే జీవితంగా మలచుకోవడం వేరు. రెండో దారిలో నడిచారు కొల్ల కాయిల్ దేవకీ అమ్మ. ఒకరకంగా చెప్పాలంటే విధి విసిరిన సవాలులో ఆమె ఆ దారిని ఎన్నుకున్నారు. కేరళంలోని అలెప్పీ జిల్లా ముత్తుకుళం అనే గ్రామంలో పుట్టారు దేవకి. తాత నుంచి మొక్కల పెంపకం మీద ఆసక్తిని పుణికి పుచ్చుకున్నారు. తర్వాత గోపాలకృష్ణ పిళ్లయ్‌ని పెళ్లి చేసుకున్నా వాళ్ల వృత్తి వ్యవసాయమే అవడంతో పచ్చని పొలాల్లో పనిచేస్తూ గడిపేవారు. 1980వ సంవత్సరం ఆమె జీవితంలో ఒక పెద్ద చీకటిని మిగిల్చింది. ఒక ఘోరమైన రోడ్డు ప్రమాదం ఆమెను కోలుకోలేని దెబ్బతీసింది. వెన్నెముక, కాళ్లకు గాయాలు కావడంతో దాదాపు మూడు సంవత్సరాల పాటు ఆమె మంచానికే పరిమితమైంది. నడవడం కష్టమైంది. మానసిక వేదనతో నరకాన్ని చూశారు. వైద్యులు ఆమెను శారీరక శ్రమ చేయవద్దని, విశ్రాంతి తీసుకోమని చెప్పారు. కానీ, ఖాళీగా కూర్చుంటే మనసు మరింత కుంగిపోతుందని భావించారామె. మంచం దిగి అడుగులు వేయడం మొదలుపెట్టారు. పచ్చదనం వైపు తన ప్రాణం గుంజడం గమనించారు. అందుకే చేతికి దొరికిన ఒక మొక్కను ఇంటి వెనుక నాటారు. ఆ మొక్క ఎదుగుతుంటే ఆమెలోని నొప్పులు మాయమవడం ప్రారంభించాయి. అలా ఒక విపత్తు, ఒక అద్భుతమైన హరిత యాత్రకు నాంది పలికింది.

మూడువేల చెట్లు...

సొంతంగా నడవడమే కష్టమైన స్థితిలో ఆమె మొక్కలు నాటడం ప్రారంభించినప్పుడు సమాజం ఆమెను వింతగా చూసింది. ఎందుకొచ్చిన కష్టం ఇది, దీనివల్ల లాభం ఏముంది అనుకున్నారు. సొంత స్థలంలో వ్యవసాయం కాకుండా, లాభం లేని అడవిని పెంచడం చుట్టుపక్కల వాళ్లకు పెద్దగా రుచించలేదు. కానీ దేవకీ అమ్మ వెనకడుగు వేయలేదు. ఆరోగ్యానికి శ్రేయస్కరం కాదని వైద్యులు వారించినా, చిన్న చిన్న బిందెలతో దగ్గరలోని చెలిమెల్లోంచి నెమ్మదిగా నీరు తెచ్చి మొక్కలకు పోసేవారు. భర్త గోపాలకృష్ణ పిల్లనగ్రోవి వాయిస్తూ ఉంటే, ఆ సంగీతాన్ని వింటూ మొక్కలు మరింత వేగంగా పెరిగాయని ఆమె నమ్ముతారు. క్రమంగా పిచ్చి పని అనుకున్న నోళ్లే ఆశ్చర్యపోయేంత అందంగా పచ్చదనం విచ్చుకుందక్కడ. మూడువేలకు పైగా చెట్లను ఇక్కడ పెంచారామె.

జీవ వైవిధ్య నిధి...

దాదాపు నాలుగున్నర దశాబ్దాల నిరంతర శ్రమ ఫలితం... నేడు ఆమెకున్న ఐదు ఎకరాల భూమి ఒక దట్టమైన అడవిగా మారింది. ఇందులో కేవలం చెట్లు మాత్రమే లేవు, ప్రకృతి సమతుల్యత ఉంది. సంప్రదాయ పద్ధతులను పాటిస్తూ కంపోస్ట్ వాడటం, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ చేయడం ద్వారా ప్రకృతిలో మమేకమై చెట్లు పెంచడం అలవాటు చేసుకున్నారు దేవకి. ఎలాంటి ప్రత్యేక చదువులు, అగ్రికల్చర్ డిగ్రీలు లేకుండానే సుస్థిర అటవీ సంరక్షణకు శ్రీకారం చుట్టారు. పనిచేస్తూనే అక్కడ జీవవైవిధ్యాన్ని కాపాడటంలో పట్టు సాధించారు. ప్రస్తుతం అక్కడ కృష్ణనాల్ (కృష్ణ వటవృక్షం), చందనం, మహాగని, టేకు వంటి విలువైన వృక్షాలు సహా ఎన్నో రకాల ఆయుర్వేద మూలికలు, అంతరించిపోతున్న మొక్కల జాతులు ఉన్నాయి. సుమారు 200 జాతుల విభిన్న మొక్కలను సంరక్షిస్తున్నారామె. లెక్కకు మిక్కిలి ఔషధ మొక్కలు ఉన్నాయి. క్రమంగా అక్కడ ఏర్పాటు చేసిన సహజ సిద్ధమైన కొలనులో వివిధ రకాల చేపలు జీవిస్తున్నాయి. ఉడుతలు, కోతులు, విభిన్న రకాల పాములతో పాటు నెమళ్లు, గుడ్లగూబలు సహా ఎన్నో రకాల అరుదైన పక్షి జాతులు నివసిస్తున్నాయి. దీనికి ఆమె కొల్లకాయిల్ తపోవనం అనే పేరు పెట్టుకున్నారు. ప్రస్తుతం అది ఒక జీవవైవిధ్య వేదిక. ఈ అడవిని చూసేందుకు ఎవరైనా వెళ్లొచ్చు. దానికి ఆమె ప్రత్యేకంగా డబ్బులు కూడా తీసుకోరు. ఎందుకంటే పర్యావరణం అందరిదీ అని ఆమె నమ్ముతారు. ఎండకాలంలో చుట్టుపక్కల గ్రామాల్లోని బావులన్నీ ఎండిపోయినా, దేవకీ అమ్మ వనం వల్ల పరిసరాల్లో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండడం విశేషం. శాస్త్రవేత్తలు, పర్యావరణ ప్రేమికులు ఈ వనాన్ని సందర్శించి పరిశోధనలు చేస్తుంటారు.





నాకు మొక్కలు నాటడం అనేది ఒక వ్యాపకం కాదు, అది నా పునర్జన్మ. మొక్కలకు ప్రాణం పోస్తుంటే నాలో కొత్త రక్తం ప్రవహించినట్లు అనిపించింది.

• దేవకీ అమ్మ

పురస్కారాల పచ్చ తోరణం

దేవకీ అమ్మ నిశ్శబ్ద విప్లవం దేశవ్యాప్తంగా ప్రతిధ్వనించింది. ఆమె సాధించిన విజయాలు ఎందరికో ఆదర్శంగా నిలిచాయి. ఎన్నో అవార్డులు ఆమె కృషికి ఫలితంగా లభించాయి. అందులో భారత ప్రభుత్వం నుంచి ప్రతిష్ఠాత్మక 'నారీ శక్తి పురస్కారం', కేరళ ప్రభుత్వం అందించిన ఇందిరా ప్రియదర్శిని 'వృక్షమిత్ర' అవార్డుతో పాటు ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అత్యున్నత పౌర పురస్కారం 'పద్మశ్రీ' కూడా ఉంది. గ్లోబల్ వార్మింగ్ లాంటి వాతావరణ మార్పులతో తల్లడిల్లుతున్న ఇప్పటి తరాలకు ఆమె ఒక సజీవ దిక్సూచి. 'మీ పిల్లలకు ఆస్తులు ఇవ్వకపోయినా పర్వాలేదు... కానీ స్వచ్ఛమైన గాలినిచ్చే మొక్కలను ఇవ్వండి. ప్రకృతిని ప్రేమిస్తే, అది మనల్ని ప్రాణం కన్నా మిన్నగా కాపాడుతుంది' అని చెప్పే ఆమె తన తర్వాతి నాలుగు తరాలను కూడా మొక్కల పెంపకంలో నిమగ్నం అయ్యేలా ప్రభావితం చేశారు. ఇప్పుడు ఆమె ముని మనవళ్లు, మనవరాళ్లు కూడా తపోవనంలో విత్తనాలను మొక్కలుగా చేసే పనిలో ఆనందాన్ని పొందుతున్నారు. మరి ఆమె స్ఫూర్తితో మనమూ ఒక మొక్కను నాటుదాం... రేపటి ఆకుపచ్చని భవిష్యత్తుకు బాటలు వేద్దాం!

ఉక్కపోతకు గుడ్‌బై!

ఇంట్లో వేడి ఎక్కువగా ఉందా? భరించలేని ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తున్నదా? అయితే, బాల్కనీ తోటలకు జై కొట్టాలని అంటున్నారు నిపుణులు. ఇంట్లో వేడిని తరిమేయడంలో బాల్కనీలో పెంచుకునే మొక్కలు సమర్థంగా పనిచేస్తాయని చెబుతున్నారు.

మొక్కలు వేర్ల ద్వారా పీల్చుకున్న నీటిలో.. కేవలం ఒక్కశాతం మాత్రమే వాడుకుంటాయి. మిగిలిన 99 శాతం నీటిని.. ఆకులపై ఉండే సూక్ష్మ రంధ్రాల ద్వారా ఆవిరి రూపంలో గాలిలోకి విడుదల చేస్తాయి. ఈ నీటి ఆవిరి చుట్టుపక్కల ఉండే వేడిని గ్రహించి, బాల్కనీలోని గాలి ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది. ఇది ఇంట్లో వాడుకునే 'ఎయిర్ కూలర్' పని తీరులాగే ఉంటుంది. అంతేకాకుండా, కాంక్రీట్ గోడలు, సిమెంట్ ఫ్లోరింగ్.. సూర్యరశ్మిని ఎక్కువగా గ్రహిస్తాయి. ఆ వేడిని అలాగే పట్టి ఉంచుతాయి. అందుకే, సాయంత్రం బయట చల్లగా ఉన్నా ఇంట్లో ఉక్కపోస్తుంది. ఈ ప్రభావాన్ని తగ్గించడంలోనూ బాల్కనీ మొక్కలు ముందుంటాయి. సిమెంట్ స్లాబ్‌పై, గోడల పక్కన మొక్కలను పెంచడం వల్ల.. సూర్యరశ్మిని ఆ మొక్కల ఆకులే గ్రహిస్తాయి. కాంతిని కిరణజన్య సంయోగ క్రియకు వాడుకొని.. మిగిలిన కాంతిని పరావర్తనం చేస్తాయి. అలా, కాంక్రీట్ స్లాబ్స్, గోడలు వేడెక్కకుండా అడ్డుకుంటాయి. ఇక బాల్కనీలో ఎత్తుగా పెరిగే మొక్కల్ని పెంచడం వల్ల అవి సూర్యకిరణాలు నేరుగా గదిలోకి, కిటికీలపై పడకుండా అడ్డుకుంటాయి. ఇవి ఒక రకమైన గ్రీన్ కర్టెన్‌లా



పనిచేసి.. గది ఉష్ణోగ్రత పెరగకుండా చూస్తాయి. వివిధ పర్యావరణ అధ్యయనాల ప్రకారం.. దట్టమైన మొక్కలు ఉన్న బాల్కనీ, టెర్రస్ చుట్టుపక్కల ఉష్ణోగ్రత, సాధారణ కాంక్రీట్ ప్రాంతాల కంటే మూడు డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు తక్కువగా ఉంటుంది. ఇది ఏసీపై లోడ్‌ను తగ్గించి, విద్యుత్ బిల్లు ఆదా అవ్వడానికీ సహాయపడుతుంది.

ఈ మొక్కలు బెస్ట్!

మనీ ప్లాంట్, ఇతర తీగ మొక్కలు బాల్కనీ గ్రిల్స్‌కు అల్లుకుంటాయి. ఇంటికి చక్కని నీడనిస్తాయి. అరెకా పామ్/ స్నేక్ ప్లాంట్ లాంటివి గాలిలోని తేమ శాతాన్ని సమతుల్యంగా మారుస్తాయి. గాలినీ శుద్ధి చేస్తాయి. ఇక కలబంద లాంటి మొక్కల్ని పెంచుకుంటే.. రాత్రి వేళల్లోనూ అవి ఆక్సిజన్‌ను విడుదల చేస్తూ, చుట్టుపక్కల వాతావరణాన్ని చల్లబరుస్తాయి.

నిద్ర లయ తప్పకుండా..

మనం జీవించడానికి ఆహారం, నీరు ఎంత అవసరమో.. ప్రశాంతమైన నిద్ర కూడా అంతే ముఖ్యం. కునుకు తీస్తున్నప్పుడు మాత్రమే మన శరీరంలో అంతర్గతంగా దెబ్బతిన్న కణాలు మరమ్మత్తులకు నోచుకుంటాయి. రోజంతా సేకరించిన సమాచారాన్ని మెదడు ఆ సమయంలోనే క్రమబద్ధీకరిస్తుంది. ఇవన్నీ సక్రమంగా జరగాలంటే మనం రాత్రిపూట కనీసం 7 నుంచి 9 గంటలు... సగటున 8 గంటలపాటు కచ్చితంగా నిద్రపోవాలని ఆరోగ్య నిపుణులు సిఫార్సు చేస్తుంటారు. మన శరీరానికి ఒక అంతర్గత గడియారం ఉంటుంది. దీనినే సిర్కాడియన్ లయ అంటారు. సాధారణంగా మన శరీరం రాత్రి 11:00 గంటల నుంచి ఉదయం 7:00 గంటల మధ్య నిద్రపోవాలని ఆశిస్తుంది. ఒకవేళ ఈ సమయాన్ని కాదని అర్ధరాత్రి దాటాక ఆలస్యంగా నిద్రపోయి, ఉదయం ఎప్పుడో లేచి 8 గంటల కోటాను పూర్తి చేసినా శరీరానికి నష్టం తప్పదు. ఎందుకంటే బాడీ క్లాక్ మీ నిద్ర గంటలను కాకుండా మీరు ఏ సమయానికి నిద్రపోతున్నారనే అంశాన్ని మాత్రమే లెక్కిస్తుంది. ఈ లయ తప్పితే శరీరంలోని హార్మోన్లు, ఉష్ణోగ్రత, కణాల మరమ్మతు ప్రక్రియలన్నీ పూర్తిగా నిలిచిపోతాయి.



ఆలస్యంగా నిద్రిస్తే..

- నిరంతరం రాత్రివేళల్లో ఆలస్యంగా పడుకోవడం వల్ల గుండె ఆరోగ్యం దెబ్బతిని అధిక రక్తపోటు ప్రమాదానికి దారితీస్తుంది.
- శరీరంలో ఇన్సులిన్ సున్నితత్వం క్రమంగా తగ్గిపోతుంది. ఇది కొన్నిసార్లు నేరుగా ప్రీడయాబెటిక్ స్థాయిలకు దారితీస్తుంది.
- సిర్కాడియన్ లయ తప్పడం వల్ల మన శరీరంలోని సాధారణ లయబద్ధమైన జన్యువులలో 97 శాతం కంటే ఎక్కువ అంతరాయం కలుగుతుంది.
- నిద్రపోయే సమయం మారడం వల్ల తీవ్రమైన నిరాశ, ఆందోళన వంటి మానసిక రుగ్మతలు చుట్టుముడతాయి.

ఈ చిట్కాలు పాటించండి

ఆరోగ్యకరమైన బాడీ క్లాక్‌ను తిరిగి సొంతం చేసుకోవడానికి వైద్యులు పలు సూచనలు చేస్తుండటం విశేషం. నిద్ర సమయాన్ని దారిలోకి తెచ్చుకోవడానికి ఉదయం నిద్ర లేచిన 1–2 గంటల్లోపు కనీసం 30 నిమిషాల పాటు ఎండలో గడపడం శక్తిమంతమైన మార్గం. పడుకోవాలని అనుకునే సమయానికి 2–3 గంటల ముందే గదిలోని లైట్ల వెలుతురును తగ్గించుకోవాలి.

- వైద్యుల సలహా మేరకు చిన్న మొత్తంలో మెలటోనిన్ తీసుకోవాలనుకుంటే.. దానిని నిద్రపోయే ముందు కాకుండా, మీ ప్రస్తుత నిద్రవేళకు 1.5 నుంచి 6 గంటల ముందే తీసుకోవాలి.
- ఉదయం నిద్ర లేవడానికి ఒక నిర్దుష్ట సమయాన్ని సెట్ చేసుకుని, దానిని వారాంతాల్లో కూడా కచ్చితంగా పాటించాలి. మీకు రాత్రిపూట అంత త్వరగా నిద్రపట్టకపోతే.. పడుకునే ముందు ఒక మంచి పుస్తకం చదవడం లేదా మెలోడీ సంగీతం వినడం ద్వారా మెదడు నిశ్చలత్వాన్ని పొంది త్వరగా నిద్ర పడుతుంది.

ఖర్జూర హల్వా

కావలసిన పదార్థాలు: **ఖర్జూరాలు:** ఒక కప్పు, **నెయ్యి:** అర కప్పు, **డ్రైఫ్రూట్స్:** పావు కప్పు, **పాలు:** అర కప్పు.

తయారీ విధానం: ఖర్జూరాల్లోని గింజలను తీసి ఓ గ్లాసు గోరువెచ్చని నీళ్లుపోసి అరగంటపాటు నానబెట్టాలి. నానిన ఖర్జూరాలను నీటితో సహా మిక్సీ జార్లో వేసి మెత్తగా పేస్ట్ చేసుకోవాలి. నేతిలో డ్రైఫ్రూట్స్ వేయించి పక్కన పెట్టుకోవాలి. అదే పాన్‌లో ఖర్జూరాల పేస్ట్ వేసి సన్నని మంటపై ఐదు నిమిషాలు కలుపుతూ వేయించాలి. నీరంతా ఇగిరిపోయాక పాలు పోసి కలుపుతూ మరో ఐదు నిమిషాలు ఉడికించాలి. బాగా దగ్గర పడిన మిశ్రమంలో వేయించిన డ్రైఫ్రూట్స్ వేసి నెయ్యి రాసిన ప్లేట్లో వేసుకోవాలి. చల్లారాక ముక్కలుగా కోసుకుంటే నోరూరించే ఖర్జూర హల్వా సిద్ధం.





కాఫీతో ఆరోగ్యం సేఫ్

చాలామంది కప్పు కాఫీతోనే తమ రోజును ప్రారంభిస్తారు. అది కేవలం ఒక పానియం మాత్రమే కాదు. మన మైండ్ రిఫ్రెష్‌మెంట్‌కు, అలసటను దూరం చేసే ఓ ఔషధం. అయితే, రోజూ తాగే కాఫీని మరింత ఆరోగ్యకరంగా, పోషకాల గనిగా మార్చుకోవచ్చనే విషయం చాలామందికి తెలియదు. కాఫీలో చక్కెర, పాలు మాత్రమే కాకుండా కొన్ని రకాల సహజసిద్ధమైన పదార్థాలను జోడించడం వల్ల మెదడు పనితీరును మెరుగుపరచడంతో పాటు, జీర్ణక్రియను ఇంప్రూవ్ చేసుకోవచ్చు. ఆ ముఖ్యమైన పదార్థాలేమిటో తెలుసుకుందాం...

కోకో పౌడర్: మీ కాఫీకి కొద్దిగా కోకో పౌడర్ లేదా కాకో (రా) పౌడర్‌ను జోడించడం వల్ల అద్భుతమైన రుచితో పాటు ఆరోగ్యం కూడా లభిస్తుంది. కోకోలో పాలిఫెనాల్స్, ఫ్లేవనాయిడ్స్ వంటి శక్తిమంతమైన యాంటి ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. మెదడులోని రక్త ప్రసరణను మెరుగుపరిచి, జ్ఞాపకశక్తి, ఆలోచనా శక్తిని పెంచుతాయి.

ఏ2 నెయ్యి: ఇటీవలి కాలంలో బ్లాక్ కాఫీలో నెయ్యి లేదా వెన్న కలుపుకొని తాగే బుల్లెట్ కాఫీ ట్రెండ్ బాగా పెరుగుతున్నది. కాఫీలో ఒక టీస్పూన్ ఏ2 నెయ్యి కలపడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఇందులోని బ్యూటెరిక్ యాసిడ్ పేగుల ఆరోగ్యాన్ని సంరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. జీర్ణవ్యవస్థలో వచ్చే మంటను తగ్గించి, మలబద్ధకం సమస్యను నివారిస్తుంది.

దాల్చినచెక్క పొడి: షుగర్ వ్యాధి ఉన్నవారికి, బరువు తగ్గాలనుకునే వారికి దాల్చినచెక్క పొడి ఒక అద్భుతమైన ఆప్షన్. బ్లాక్ కాఫీలో ఒక చిటికెడు దాల్చినచెక్క పొడిని వేసుకోవడం వల్ల శరీరంలో ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది. ఇది గ్లూకోజ్ మెటబాలిజాన్ని క్రమబద్ధీకరించి, రక్తంలో చక్కెర స్థాయులు అకస్మాత్తుగా పెరగకుండా నియంత్రిస్తుంది.

రోజూ తాగే కాఫీ కేవలం కెఫిన్ కిక్ ఇవ్వడమే కాకుండా.. ఈ చిన్న చిన్న మార్పుల ద్వారా రోగనిరోధక శక్తిని పెంచే పానియంగా మారుతుంది. కాబట్టి ఈ రోజు నుంచే మీ కాఫీ కప్పులో మీకు నచ్చిన ఈ పదార్థాన్ని కలిపి ట్రై చేయండి.



కండ్లకు ఉపశమనం

కొంతమందికి ఉదయం నిద్ర లేవగానే కండ్లు కాస్త ఉబ్బినట్లుగా కనిపిస్తాయి. అయితే చల్లటి నీటితో ముఖం శుభ్రం చేసుకోగానే ఉబ్బిన అవి మామూలుగా అయిపోతాయి. అయితే ఇలా చేసిన తర్వాత కూడా కండ్లు ఉబ్బినట్లుగానే ఉంటే ఏదో సమస్య ఉందని భావించాలంటున్నారు నిపుణులు. ఈక్రమంలో కొన్ని చిట్కాలు పాటించడం ద్వారా ఈ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చని వారు సూచిస్తున్నారు.

- శరీరం డీహైడ్రేషన్‌కు గురైనా కండ్లు ఉబ్బినట్లుగా కనిపిస్తాయట! అందుకే తగినన్ని నీళ్లు తాగాలి.
- నీటి శాతం అధికంగా ఉండే కూరగాయలు, పండ్లను ఆహారంలో భాగం చేసుకోవాలి.
- టీ, కాఫీ, కార్బొనేటెడ్ ఎనర్జీ డ్రింకులు, ఆల్కహాల్... తదితర పానియాలను తరచుగా తీసుకోవడం వల్ల కండ్లు ఉబ్బిపోయి అందవిహీనంగా తయారవుతాయి. కాబట్టి వాటికి సాధ్యమైనంత దూరంగా ఉండటం మంచిది.
- కొత్తిమీరను డైట్‌లో చేర్చుకోవడం వల్ల ఈ సమస్య నుంచి బయటపడొచ్చు. సూప్స్, సలాడ్లలో కొత్తిమీరను కలిపి తీసుకుంటే మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు సొంతమవుతాయి.



ఈ చిట్కాలు పాటించినా సమస్య తగ్గకపోగా.. కండ్లలో దురద, మంట, ఎరుపెక్కడం.. లాంటి సమస్యలు ఎదురవుతుంటే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించడం మంచిది.


నిర్వాసితులతో సమావేశమైన మంత్రి అడ్లూరి లక్ష్మణ్, కలెక్టర్ సత్యప్రసాద్

‘ధర్మపురి’పై దిగొచ్చిన సర్కార్

- భూ నిర్వాసితులతో మంత్రి అడ్లూరి మొదటిసారి సమావేశం
- పరిహారం పెరిగే అవకాశం..
- బాధితుల్లో ఆశలు

నమస్తే ఎఫెక్ట్

ధర్మపురి, జూన్ 5: జగిత్యాల జిల్లా ధర్మపురి ఆలయ విస్తరణలో భాగంగా పరిహారం పెంపు విషయంలో కాంగ్రెస్ సర్కార్ దిగొచ్చింది. ధర్మపురి క్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామి దేవాలయ విస్తరణలో భాగంగా ఇండ్లు, స్థలాల కోల్పోతున్న నిర్వాసితులకు మెరుగైన పరిహారం ఇచ్చేందుకు సిద్ధమైంది. దేవస్థానం ఉత్తర దిశలో 14 ఇండ్లు, నాలుగు ఖాళీ స్థలాలకు అంగీకారం లేకపోయినా.. ఎంతో విలువైన స్థలాలను నామమాత్రపు ధరతో సర్కార్ స్వాధీనం చేసుకునేందుకు సన్నద్ధం కావడం, బాధితులు విజ్ఞప్తులు చేయడంపై గత నెల 28న ‘ధర్మపురిలో దౌర్జన్య కాండ!’ శీర్షికన నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితం కాగా సర్కార్ స్పందించింది. ఆ మేరకు అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. బాధిత కుటుంబాలకు గతంలో ప్రతిపాదించిన పరిహారం కంటే మెరుగైన ప్యాకేజీ ఇచ్చే దిశగా కసరత్తు చేసినట్టు తెలిసింది. అందులో భాగంగానే మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్ గురువారం నిర్వాసితులతో దేవస్థాన సమావేశం మందిరంలో మొదటిసారి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. భూ సేకరణతో తమకు జరుగుతున్న నష్టాన్ని బాధితులు.. మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుత మార్కెట్ విలువకు అనుగుణంగా పరిహారం చెల్లించాలని, జీవనాధారాన్ని కోల్పోతున్న కుటుంబాలకు న్యాయం చేయాలని వేడుకున్నారు. గతంలో గజానికి రూ.2,100 ధర నిర్ణయించగా.. దీనికి మూడు రెట్లు (రూ.6,300) అదనంగా ఇస్తామని చెప్పిన అధికారులు, ఇప్పుడు ఐదు రెట్ల వరకు (గజానికి రూ.10,500) పెంచే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. అలాగే పునరావాసం కింద (ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ) గతంలో కుటుంబానికి రూ.12 లక్షలు ప్రకటించగా.. ఇప్పుడు రూ.18 లక్షల వరకు పెంచే ప్రతిపాదన చర్చకు వచ్చినట్టు తెలిసింది. అయితే పరిహారం పెంపుపై ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. దీనిపై స్పష్టమైన నిర్ణయం వెలువడిన తర్వాతే బాధితుల డిమాండ్లకు పూర్తిస్థాయిలో పరిష్కారం లభించే అవకాశం ఉన్నది. ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడకపోవడం, అధికార యంత్రాంగం నుంచి స్పష్టత లేకపోవడంతో బాధితులు అయోమయ పరిస్థితిలో ఉన్నారు.

చట్టప్రకారం ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నది

ధర్మపురి లక్ష్మీనరసింహస్వామివారి ఆలయ అభివృద్ధిలో భాగంగా భూములు కోల్పోతున్న నిర్వాసితుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటాం. ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా ముందుకు సాగుతాం. 2017-18 భూసేకరణ చట్ట ప్రకారం.. నిర్వాసితులకు పరిహారం చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నది. భూనిర్వాసితులతో మరోసారి చర్చలు జరుపుతాం. వారిని పూర్తిస్థాయిలో తృప్తి పరిచిన తర్వాతే భూసేకరణ జరుగుతుంది. ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని దేవస్థాన అభివృద్ధికి పట్టణ ప్రజలు, భూనిర్వాసితులు సహకరించాలి.

- అడ్లూరి లక్ష్మణ్, మంత్రి

మట్టిని మింగేస్తున్నారు!

జయశంకర్ జిల్లాలో నేషనల్ హైవే పనులకు ట్రక్కుల్లో వేలాది టన్నుల మొరం తరలింపు

- కరిగిపోతున్న నవాబ్‌పేట, గిద్దెముత్తారం గుట్టలు
- మైనింగ్‌శాఖ అనుమతి ఉందా? అనే అనుమానం
- స్థానికుల ఫిర్యాదులతో రెవెన్యూశాఖ నోటీసులు
- అయినా రూటు మార్చి కొనసాగుతున్న దందా
- ఇందిరమ్మ ఇండ్లు, ఇతర అవసరాలకు ట్రాక్టర్ మట్టిని రూ.1,000 నుంచి 2,000 వరకు విక్రయిస్తున్న వైనం
- దందాలో ఇద్దరు అధికార పార్టీ నేతల హస్తం ఉన్నట్టు ప్రచారం

జయశంకర్ భూపాలపల్లి, జూన్ 5 (నమస్తే తెలంగాణ)/చిట్యాల : జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలో మట్టి మాఫియా పెచ్చు మీరుతున్నది. టేకుమట్ల, చిట్యాల, మొగుళ్లపల్లి మండలాల మీదుగా ఏర్పాటుచేస్తున్న గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవేకు వేలాది టన్నుల మొరాన్ని నవాబ్‌పేట, గిద్దెముత్తారం గుట్టల నుంచి రేయింబవళ్లు తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడని దుస్థితి. దీంతో అసలేం జరుగుతున్నది? మైనింగ్ శాఖ అనుమతులున్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విషయం తెలుసుకునేందుకు ప్రజాప్రతినిధులు, ఇతరులు ఆ శాఖ అధికారులకు ఫోన్లు చేసినా లిఫ్ట్ చేయని పరిస్థితి. దీంతో మైనింగ్‌శాఖ అధికారుల కనుసన్నల్లోనే మొరం తరలింపు జరుగుతుందనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు కాంట్రాక్టర్‌కు మొరం తరలింపు ఆపాలని నోటీసులిచ్చారు. అయినప్పటికీ మొరం తరలింపు ఆగలేదని స్థానికులు చెప్తున్నారు.

అడ్డగోలుగా దందా

చిట్యాలం మండలం నవాబుపేట రెవెన్యూ పరిధిలోని శాంతినగర్ సమీప గుట్టలు, గిద్దెముత్తారం సమీప రాఘవాపూర్ గుట్టల నుంచి అక్రమంగా మొరం దందా రూ.లక్షల్లో కొనసాగుతున్నది. గుట్టల చుట్టూ సుమారు 30 ఎకరాల నుంచి అక్రమార్కులు మొరాన్ని తరలిస్తున్నారు. గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే కోసం కాంట్రాక్టర్ నామమాత్రంగా గనులశాఖ అనుమతులు తీసుకుని పరిధి దాటి మొరాన్ని తరలిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇదే అదునుగా ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వ అవసరాల పేరుతో ఒక్కో ట్రాక్టర్ మొరాన్ని రూ.1,000 నుంచి రూ.2,000 వరకు విక్రయిస్తున్నారు. దందా వెనుక ఇద్దరు అధికార పార్టీ నేతలున్నట్టు జోరుగా ప్రచారం జరుగుతున్నది. శాంతినగర్ గుట్టలకు పట్టాలు సృష్టించి సుమారు 80 ఎకరాలకు పాస్‌బుక్స్ పొందారు. ఇందులో కొంతమంది పంటలు వేస్తుండగా, పంటలు వేయని భూముల నుంచి మొరం రవాణా జరుగుతున్నది. రెవెన్యూ, మైనింగ్‌శాఖ అధికారుల అనుమతులు తీసుకోవాలనే సోయి మరిచి పట్టపగలే పోలీస్ స్టేషన్ ముందు నుంచే దందా కొనసాగడం గమనార్హం.


జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నవాబుపేట గుట్టల నుంచి మొరాన్ని తరలిస్తున్న టిప్పర్లు

కొరవడిన పర్యవేక్షణ

మొరం అక్రమ దందాపై మైనింగ్ అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గుట్టల నుంచి హైవేకు కొంతవరకు మొరం తరలింపునకు అనుమతినిచ్చిన అధికారులు.. అనుమతికి మించి మొరం తరలిస్తున్నా తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. లెక్కా పత్రం లేకుండా లక్షలాది రూపాయల మొరం దందాతో ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని ఆ ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు. ఈ మట్టి భూపాలపల్లి, పరకాల, హనుమకొండకు సైతం తరలివెళ్తుందని, ఇందులో అధికారుల వాటా ఎంత అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

కాంట్రాక్టర్‌కు నోటీసులు పంపాం

నవాబ్‌పేట గుట్టల నుంచి నేషనల్ హైవేకు మొరం తరలివెళ్తున్నది. నవాబుపేట, రాఘవాపూర్ గుట్టల నుంచి మొరం తరలింపునకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. మొరం అక్రమంగా తరలిస్తున్నారని మాకు ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో మొరం తరలింపును ఆపాలని కాంట్రాక్టర్‌కు నోటీసులిచ్చాం. మొరం తరలింపునకు అనుమతి తీసుకున్నారా? ఎన్ని టన్నులకు తీసుకున్నారు? ఇప్పటి వరకు ఎంత తరలించారనే విషయమై రిపోర్టు ఇవ్వాలని కోరాం.

-వసంతరావు, తహసీల్దార్, చిట్యాల

పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

- ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై అక్రమకేసులు ఎత్తివేయాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్



ఖైరతాబాద్, జూన్ 5 (నమస్తే తెలంగాణ): ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాష్ట్ర పర్యటనలో తెలంగాణ నీ అయ్య జాగీరా అంటూ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, తక్షణమే వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. తెలంగాణ, ఏపీలో బీసీల పరిస్థితి దారుణంగా ఉన్నదని చెప్పారు. గతంలో ఉన్న కొన్నిసీట్లు కూడా ఇప్పుడు దక్కడం లేదని, అగ్రవర్ణ పాలకులే రాజ్యమేలుతున్నారని అన్నారు. బీసీలకు బడ్జెట్ కేటాయింపులోనూ తీవ్ర అన్యాయం జరుగుతున్నదని, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో సైతం బీసీ నేతల పేర్లు వాడటం లేదని తెలిపారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యాఖ్యలను వక్రీకరించి లేనిపోని ఆరోపణలు చేస్తూ తప్పుడు కేసులు పెట్టారని, దీనిని ఖండిస్తున్నామన్నారు. ఇరు రాష్ట్రాలకు చెందిన బీసీలు చైతన్యవంతులై రాజ్యాధికారం సాధించుకోవాలని పిలుపు ఇచ్చారు. సమావేశంలో బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, కోచైర్మన్ కుల్కచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

నేటి నుంచి యథావిధిగా వైద్య సేవలు


జీవో-38 ప్రకారం బదిలీలు చేపడుతాం • టీజీజీడీఏ ప్రతినిధులకు మంత్రి దామోదర హామీ

హైదరాబాద్, జూన్ 5(నమస్తే తెలంగాణ): తమ డిమాండ్లపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సానుకూలంగా స్పందించడంతో సమ్మెను విరమిస్తున్నట్టు తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రకటించింది. నేటి నుంచి ప్రభుత్వ దవాఖానల్లో యథావిధిగా సేవలు కొనసాగుతాయని స్పష్టంచేసింది. శుక్రవారం బంజారాహిల్స్‌లోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి దామోదరను కలిసిన అసోసియేషన్ ప్రతినిధులు.. బదిలీలు, ఇతర సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఒకే స్టేషన్‌లో నాలుగేండ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న వారితోపాటు 3 ఏండ్ల సర్వీస్ ఉన్న ప్రయారిటీ క్యాటగిరీ డాక్టర్లు, జీరో స్పౌజ్ క్యాటగిరీ అభ్యర్థులకు ఆర్డర్ వారీగా బదిలీలు నిర్వహించాలని విజ్ఞప్తిచేశారు. దీనికి మంత్రి సానుకూలత వ్యక్తం చేసినట్టు నేతలు తెలిపారు. సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ ఇచ్చారని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నరహరి, సెక్రటరీ జనరల్ లాలుప్రసాద్ తెలిపారు.

నిబంధనలు సవరించాలి: టీజీవో డాక్టర్స్ ఫోరం

వైద్య ఆరోగ్యశాఖలో బదిలీల ప్రక్రియలో నిబంధనలను సవరించి అర్హులకు అవకాశం కల్పించాలని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ డాక్టర్స్ ఫోరం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం సెక్రటేరియట్ మీడియా పాయింట్ వద్ద ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు జనార్దన్ మాట్లాడారు. ఈ ఏడాది జనవరి 1 నాటికి మూడేండ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బందికి ఆప్షన్లు ఇచ్చుకునే వెసులుబాటు కల్పించాలని, నాలుగేండ్ల సర్వీస్ నిండిన వారికే పరిమితం చేయొద్దని కోరారు. నాలుగేండ్ల కంటే తక్కువ సర్వీస్ ఉన్న నాన్ స్పౌజ్ అభ్యర్థులకు కూడా ఆప్షన్లు ఇచ్చుకునే వెసులుబాటు కల్పించాలని, అప్పుడే అర్హులకు న్యాయం జరుగుతుందని తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసి యేషన్(టీటీజీడీఏ) ప్రభుత్వాన్ని కోరింది. బదిలీ ఆప్షన్ల తర్వాత ఏర్పడే అరైజింగ్ ఖాళీలను కూడా పోర్టల్‌లో ప్రదర్శించాలని సూచించింది.

‘ఎబోలా’ ఐసోలేషన్‌లో సుడాన్ దేశస్తులకు చికిత్స



బన్సీలాల్‌పేట్, జూన్ 5 : నగరంలోని గాంధీ దవాఖాన ‘ఎబోలా’ ఐసోలేషన్ కేంద్రంలో ఇద్దరు అనుమానితులకు చికిత్స అందిస్తున్నారు. ఆఫ్రికాలోని సుడాన్ దేశం నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి ఇటీవల వచ్చిన ఇద్దరు యువకులను జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రి నుంచి అధికారులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. అందులో ఓ యువకుడి ఆరోగ్యం బాగుండటంతో అతడిని హోమ్ ఐసోలేషన్ కేర్ కోసం ఇంటికి పంపించారు. మరో సుడాన్ దేశస్తుడికి కూడా గాంధీ ఐసోలేషన్ కేంద్రంలో చికిత్స అందిస్తున్నారు. అతడి రక్త నమూనాలు సేకరించి సీసీఎంబీలోని ప్రయోగశాలకు పంపించామని, ప్రాథమిక పరీక్షల ఫలితాల ఆధారంగా పుణెలోని జాతీయ వైరాలజీ ల్యాబొరేటరీకి పంపించే అవకాశం ఉన్నదని గాంధీ ఆస్పత్రి జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ ప్రొఫెసర్ ఎల్ సునీల్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం ఇద్దరి ఆరోగ్య పరిస్థితిని గురించి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ఎబోలా అనుమానిత కేసులుగా పరిగణించి అన్ని జాగ్రతలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు.

చిత్రం



‘దూత-2’ వెబ్‌సిరీస్ ప్రారంభం

సూపర్‌నేచురల్ మిస్టరీ థ్రిల్లర్ ‘దూత’ వెబ్‌సిరీస్‌తో ఓటీటీ వేదికపై తొలి ప్రయత్నంలోనే మంచి విజయాన్ని అందుకున్నారు హీరో నాగచైతన్య. తాజాగా ఈ సిరీస్‌కు సీక్వెల్‌ను తెరకెక్కిస్తున్నారు. విక్రమ్ కె కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్, నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై నాగచైతన్య, శరత్‌మరార్ నిర్మిస్తున్నారు. శుక్రవారం పూజా కార్యక్రమాలతో ‘దూత’ సీక్వెల్‌ను లాంఛనంగా ప్రారంభించారు. దీనికి అగ్రనటుడు నాగార్జున క్లాప్‌నిచ్చారు. ఈ సీక్వెల్‌కు నాగచైతన్య నిర్మాతగా వ్యవహరిస్తుండటం విశేషం. ఈ సందర్భంగా తన సోషల్‌మీడియా ఖాతాలో సిరీస్ తాలూకు ఓపెనింగ్ ఫొటోలను పంచుకున్నారు నాగచైతన్య. ‘నిర్మాతగా తొలి అడుగు వేస్తున్నా. మరోసారి మ్యాజిక్‌ని వీక్షించడానికి సిద్ధంగా ఉండండి’ అని నాగచైతన్య తన పోస్ట్‌లో పేర్కొన్నారు. పార్వతీ తిరువోతు, ప్రియా భవానీ శంకర్ తదితరులు నటిస్తున్న ఈ సిరీస్‌కు కెమెరా: ముఖేశ్వరణ్, సంగీతం: ఈషాన్ ఛాబ్రా, ప్రొడక్షన్ డిజైన్: ప్రవళ్ల డి, రచన-దర్శకత్వం: విక్రమ్ కె కుమార్.

తుపానులా ‘పెద్ది’ వసూళ్లు



‘పెద్ది’ చిత్రానికి ప్రీమియర్స్ నుంచే అద్భుతమైన స్పందన లభించిందని, తొలిరోజు హీరో రామ్‌చరణ్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా నిలిచిందని ఆనందం వ్యక్తం చేశారు చిత్ర నిర్మాత వెంకట సతీష్ కిలారు. రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వృద్ధి సినిమాస్ పతాకంపై ఆయన నిర్మించిన ‘పెద్ది’ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా శుక్రవారం ‘బాక్సాఫీస్ ఛాంపియన్’ పేరుతో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట సతీష్ కిలారు మాట్లాడుతూ ‘ఈ చిత్రం తొలిరోజే 135 కోట్లకుపైగా వసూళ్లను సాధించింది. ప్రేక్షకులు ఈ సినిమాను బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలబెట్టారు. పిల్లలతో కలిసి థియేటర్లలో ఈ సినిమా చూడండి. ప్రతి ఒక్కరికి స్ఫూర్తివంతంగా అనిపిస్తుంది’ అన్నారు. ఈ సినిమా వసూళ్లపరంగా ఓ తుపాను సృష్టించిందని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాత వై.రవిశంకర్ ఆనందం వ్యక్తం చేశారు. విడుదలైన ప్రతీ కేంద్రం నుంచి పాజిటివ్ రిపోర్ట్స్ వస్తున్నాయని, ఉభయ తెలుగు రాష్ర్టాల్లో అదే ఊపు కనిపిస్తున్నదని ఆయన చెప్పారు. థియేటర్లలో చూసి ఆనందించాల్సిన సినిమా ఇదని, ఈ వారాంతంలో వసూళ్లు మరింత జోరుగా ఉంటాయని, వచ్చే వారం షాకింగ్ కలెక్షన్ నెంబర్లతో ముందుకొస్తామని వై.రవిశంకర్ తెలిపారు. ఈ సినిమా చూసి స్ఫూర్తిపొందామని చాలా మంది తనతో చెబుతున్నారని, రామ్‌చరణ్ పర్‌ఫార్మెన్స్ గురించి అందరూ మాట్లాడుకుంటున్నారని దర్శకుడు బుచ్చిబాబు సానా అన్నారు. రానున్న రోజుల్లో ఈ సినిమా మరిన్ని రికార్డులను బద్దలుకొట్టబోతున్నదని మైత్రీ డిస్ట్రిబ్యూటర్ శశిధర్ చెప్పారు.



అగ్ని.. విశ్వం త్యాగం వెరసి రాకా

‘పుష్ప’ ఫ్రాంచైజీతో పానిండియా ఇమేజ్‌ని సొంతం చేసుకున్నారు అల్లు అర్జున్. ప్రస్తుతం ఆయన అట్లీ దర్శకత్వంలో ‘రాకా’ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ‘పుష్ప2’ తర్వాత వస్తున్న సినిమా కావడంతో, ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, అత్యంత ప్రతిష్ఠాత్మకంగా సన్ పిక్చర్స్‌వారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దర్శకుడు అట్లీ తనదైన శైలి మాస్ ఎలిమెంట్స్‌కు ఎమోషన్స్, భారీ యాక్షన్ సీక్వెన్స్, సైన్స్ ఫిక్షన్‌ను జోడించి ఈ కథను తయారు చేసినట్టు ఇన్‌సైడ్ టాక్. ఫస్ట్‌లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలు పెంచింది. త్వరలో గ్లింప్స్ కూడా విడుదలయ్యే అవకాశం ఉంది. రాకా ప్రపంచాన్ని, దాని విజువల్ స్కేల్‌ని ఈ గ్లింప్స్ ద్వారా పరిచయం చేయనున్నారు. ఇదిలావుంటే.. తాజాగా ఈ సినిమా గురించి ఆసక్తికరమైన విషయం వెలుగు చూసింది. ‘రాకా’ కథ పునర్జన్మల నేపథ్యంలో సాగుతుందట. మూడు కాలాల్లో నడిచే ఈ కథలో అల్లు అర్జున్ మూడు రకాల భిన్నమైన పాత్రల్లో కనిపిస్తారట. ‘అగ్ని.. విశ్వం.. త్యాగం..’ ఈ మూడింటి చుట్టూనే ఈ సినిమా కాన్సెప్ట్ నడుస్తుందని తెలిసింది. షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా సమాంతరంగా జరుగుతున్నాయి. వీఎఫ్‌ఎక్స్ కీ రోల్ పోషించే ఈ చిత్రంలో దీపిక పదుకోణ్ కథానాయిక కాగా, మృణాల్ ఠాకూర్, రష్మిక మందన్నా ప్రత్యేక పాత్రల్లో మెరవనున్నారని సమాచారం.

ఇలాంటి అవకాశం మళ్లీ రాదు!

‘ఓ గ్రామం మొత్తం మాట్లాడలేక, కేవలం పాటల రూపంలో సంభాషించే కథ ఇప్పటివరకూ రాలేదు. నా కెరీర్‌లోనే ఇదొక సవాలు. ఈ సినిమా స్క్రిప్ట్ చదివిన తర్వాత ప్రతీ డైలాగ్‌ను సంగీతంగా మార్చాల్సి వచ్చింది’ అన్నారు అగ్ర సంగీత దర్శకుడు, రాక్‌స్టార్ దేవిశ్రీప్రసాద్. లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు రూపొందిస్తున్న ‘సింగ్ గీతం’ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ సంగీతాన్నందిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు నాగ్‌అశ్విన్ నిర్మిస్తున్న ఈ సినిమా ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా శుక్రవారం చిత్ర స్వరకర్త దేవిశ్రీప్రసాద్ విలేకరులతో సినిమా విశేషాల్ని పంచుకున్నారు.



- నేను సింగీతంగారికి వీరాభిమానిని. మా నాన్నగారిని కలవడానికి ఇంటికి తరచుగా వచ్చేవారాయన. ఆయన మాట్లాడుతుంటే ఆరాధన భావంతో చూసేవాడిని. చాలా ఏళ్ల క్రితం పవన్‌కల్యాణ్‌తో జీసస్ జీవితంపై ఓ సినిమా అనుకున్నాం. కానీ కొన్ని కారణాల వల్ల అది కార్యరూపం దాల్చలేదు. ఆ సమయంలోనే సింగీతంగారు ఈ సినిమా ఐడియా గురించి చెప్పారు. వినగానే థ్రిల్లింగ్‌గా అనిపించింది.
- సింగీతంగారు ట్రెండ్‌ను దాటి కథల గురించి ఆలోచిస్తారు. పుష్పకవిమానం, భైరవద్వీపం, ఆదిత్య 369 ఆ కోవలో వచ్చినవే. ఆయన ఓ ఐడియా అనుకున్నారంటే అది అంతకుముందు ఎప్పుడూ రానిది, భవిష్యత్తులో కూడా రాలేనిది అయి ఉంటుంది. ‘సింగ్ గీతం’ కాన్సెప్ట్ కూడా చాలా కొత్తగా ఉంటుంది. ఈ సినిమా చూసిన ప్రేక్షకులు మాటల్ని కూడా పాటల్లా పాడుకుంటూ వెళ్తారని అనుకుంటున్నా.
- ఈ సినిమాలో మాటలన్నీ పాటల రూపంలో వినిపిస్తాయి. అందుకే నా కెరీర్‌లోనే అత్యంత చాలెంజింగ్ సినిమాగా భావిస్తా. చిన్నప్పటి నుంచి ప్రతీ అక్షరాన్ని సంగీతంగా మార్చే అలవాటు ఉండటంతో అది ఈ సినిమాకు బాగా ఉపయోగపడింది. ఓ సన్నివేశాన్ని మ్యూజికల్‌గా చేసి వినిపించాను. అది విని సింగీతంగారు చాలా సంతోషించారు. ‘మనకు కావాల్సిన మ్యూజిక్ ఇదే’ అన్నారు. నాకది పెద్ద కాంప్లిమెంట్‌లా అనిపించింది.
- ఇది మ్యూజికల్ సినిమా కాబట్టి ప్రతి విషయానికి నేనే బాధ్యత వహించాల్సి వచ్చింది. 24 గంటలూ పనిచేసేవాడిని (నవ్వుతూ). సింగీతంగారి సినిమాలో నేనూ భాగం కావడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నా. ఇదొక బ్లెస్సింగ్. ఇలాంటి అవకాశం మళ్లీ రాదు. నాగ్‌అశ్విన్‌కు సింగీతంగారంటే అమితమైన ప్రేమ. అందుకే అందరం ప్రాణం పెట్టి ఈ సినిమా కోసం పనిచేశాం.
- ప్రస్తుతం ‘ఎల్లమ్మ’ చిత్రంలో హీరోగా నటించడంతో పాటు మ్యూజిక్ కూడా చేస్తున్నా. ఇప్పటికే కొన్ని పాటలు చేశాను. ఒక ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌కు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కంపోజ్ పూర్తయింది. ఈ సినిమా కోసం నెలకు పదిరోజులు కేటాయించమని నిర్మాత దిల్‌రాజు చెప్పారు. ‘ఎల్లమ్మ’ విషయంలో చక్కటి ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. నేను తెలంగాణ యాసపై పట్టుసాధించే ప్రయత్నం చేస్తున్నా.

అదే అలవాటుగా మారింది!



వింత పోకడలు, విచిత్రమైన అభిరుచులు మనుషుల్లో కామన్. బాలీవుడ్ బ్యూటీ మృణాల్ ఠాకూర్ ఆహారపు అలవాట్లు వింటే మరీ విడ్డూరం అనిపించక మానదు. ఈ ముద్దుగుమ్మ అన్నంలో ఐస్‌క్రీమ్ కలుపుకొని తింటుందట. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని తానే స్వయంగా చెప్పింది. ‘ఈ అలవాటు నా ఫ్రెండ్ నుంచి నాకు వచ్చింది. తను ఓ సారి రైస్‌లో ఐస్‌క్రీమ్ కలుపుకొని తినడం చూశాను. చూసిన దాన్ని చూసినట్టుగా ఉండక, ఇంటికెళ్లి ట్రై చేశాను. నిజం చెబుతున్నాను.. ఆ టేస్ట్ చాలా కొత్తగా అనిపించింది. నిదానంగా అది అలవాటుగా మారింది. నాకు నచ్చిందని అందరికీ నచ్చాలని లేదు’ అంటూ చెప్పుకొచ్చింది మృణాల్ ఠాకూర్. ఇది విన్నవారంతా ‘అన్నంలో ఐస్‌క్రీమ్ కలుపుకొని తినడమేంటి?.. పిచ్చికాకపోతే..’ అంటూ కామెంట్లు పెడుతున్నారు. కొందరైతే.. ‘ట్రై చేస్తే తప్పేంటి?’ అని కూడా అంటున్నారు. జిహ్వాకో రుచి, పుర్రెకో బుద్ధి అని ఊరికే అనలేదు!

ప్రేమకంటే గొప్ప యుద్ధం లేదు



రాయలసీమ విలేజ్ యాక్షన్ డ్రామా ‘లెనిన్’తో ఈ నెల 26న ప్రేక్షకుల ముందుకురాబోతున్నాడు అక్కినేని అఖిల్. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాల్ని పెంచాయి. సామాజికాంశాల నేపథ్యంలో రూపొందిస్తున్న ఈ చిత్రంలో తన వారిని, ప్రేమను గెలిపించుకోవడానికి ప్రతీపశక్తులతో యుద్ధం చేసే యువకుడిగా అఖిల్ కనిపిస్తారని సమాచారం. తాజాగా ‘పెద్ది’ ప్రదర్శిస్తున్న థియేటర్లలో ‘సోల్ ఆఫ్ లెనిన్’ పేరుతో ఓ పాటను చూపిస్తున్నారు. ఇందులో నాయకానాయికలు అఖిల్, భాగ్యశ్రీ బోర్సే మధ్య ఉండే అనుబంధాన్ని హృద్యంగా ఆవిష్కరించారు. ‘ప్రేమకంటే గొప్ప యుద్ధం లేదు’అనే క్యాప్షన్‌తో తమన్ స్వరకల్పనలో రూపొందిన ఈ పాట ప్రేక్షకుల్ని ఎంతగానో ఆకట్టుకుంటున్నదని మేకర్స్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: లియోన్ బ్రిట్టో, సంగీతం: తమన్, సమర్పణ: అన్నపూర్ణ స్టూడియోస్, రచన-దర్శకత్వం: మురళీకిషోర్ అబ్బూరు.

జెన్‌జీ ప్రేమకథగా మొహబ్బత్



సంతోష్ కల్వచర్ల, శ్రేయాసి సేన్ జంటగా రూపొందుతున్న యువతరం ప్రేమకథ ‘మొహబ్బత్’. మ్యాక్ దర్శకత్వంలో అఫ్రోజ్ షేక్ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభోత్సవం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి శాసనసభ్యుడు నవీన్ యాదవ్ క్లాప్‌నివ్వగా, చిత్రనిర్మాత అఫ్రోజ్ షేక్ కెమెరా స్విచాన్ చేశారు. నవీన్ యాదవ్, చిన్న శ్రీశైలం యాదవ్ సినిమాకు సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని లాంచ్ చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. ఎమోషనల్ యూత్‌ఫుల్ జెన్‌జీ సినిమా ఇదని దర్శకుడు మ్యాక్ తెలిపారు. నిర్మాతగా తన తొలి ప్రయత్నం తప్పక సఫలం అవుతుందనే నమ్మకాన్ని నిర్మాత అఫ్రోజ్ షేక్ వ్యక్తం చేశారు. ఇంకా హీరోహీరోయిన్లతో పాటు రచయిత కలాం కూడా మాట్లాడారు. అజయ్ ఘోష్, సాత్విక్ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: వైఎస్ కృష్ణ, సంగీతం: సునీల్ కశ్యప్, నిర్మాణం: ఏబీఎస్ ప్రొడక్షన్స్.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

మహిళల సింగిల్స్ ఫైనల్ | హాలిన్‌స్కా X అంద్రీవా | సా: 6.30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో

టెస్టు పోరుకు వేళాయె..

నేటి నుంచి భారత్, ఆఫ్ఘనిస్థాన్ ఏకైక టెస్టు • మూడో స్థానంలో సుదర్శన్‌కు అవకాశం



గిల్

ముల్లాన్‌పూర్: క్రికెట్ అభిమానులను అలరించేందుకు మరో పోరు సిద్ధమైంది. మండువేసవిలో దాదాపు రెండు నెలల పాటు ఐపీఎల్ హోరులో మునిగితేలిన ఫ్యాన్స్‌కు సంప్రదాయక టెస్టు సమరం మజాను అందించనుంది. ఐపీఎల్ ముగిసిన ఆరు రోజుల వ్యవధిలోనే భారత్, ఆఫ్ఘనిస్థాన్ జట్ల మధ్య శనివారం నుంచి ఏకైక టెస్టు పోరుకు తెరలేవనుంది. చివరిసారి గత నవంబర్‌లో సొంతగడ్డపై దక్షిణాఫ్రికాతో తలపడ్డ టీమ్‌ఇండియా మళ్లీ ఇన్ని రోజులకు ఆఫ్ఘన్‌తో టెస్టు మ్యాచ్‌కు సిద్ధమైంది. గత వారం ఐపీఎల్ సందడితో కనిపించిన ముల్లాన్‌పూర్ స్టేడియం తొలిసారి టెస్టుకు ఆతిథ్యమివ్వబోతున్నది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ)లో ఈ మ్యాచ్ భాగం కాకపోయినా ఇరు జట్లు సత్తాచాటేందుకు పట్టుదలతో ఉన్నాయి. యువ బ్యాటర్ శుభ్‌మన్‌గిల్ సారథ్యంలో టీమ్‌ఇండియా బరిలోకి దిగుతుంటే..హష్మతుల్లా షాహిది..ఆఫ్ఘన్ టీమ్‌ను ముందుకు నడిపించనున్నాడు. దిగ్గజ ద్వయం విరాట్ కోహ్లీ, రోహిత్‌శర్మ రిటైర్మెంట్ తర్వాత కొత్త రూపు సంతరించుకున్న టెస్టు టీమ్ యువకులతో కళకళలాడుతున్నది. అయితే ఐపీఎల్ ద్వారా పొట్టి ఫార్మాట్‌లో బిజీగా గడిపిన క్రికెటర్లు ఇప్పుడు ఎర్రబంతితో పోటీకి దిగేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. టెస్టు జట్టుకు ఎంపికైన 15 మందిలో ఎనిమిది మంది సంప్రదాయక పోరుకు పూర్తిస్థాయిలో సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా 40 డిగ్రీల ఎండకాచే ముల్లాన్‌పూర్‌లో ప్రతిభ చాటేందుకు నెట్స్‌లో చెమటోడ్చారు. ఇదిలా ఉంటే 2018లో టెస్టుల్లో అరంగేట్రం చేసిన ఆఫ్ఘనిస్థాన్ టీమ్‌కు ఇది 13 మ్యాచ్ కాగా స్టార్ స్పిన్నర్ రషీద్‌ఖాన్ లేకుండానే పోటీకి దిగనుంది. మొత్తంగా రాబోయే సీజన్‌కు ఆరంభంగా భావిస్తున్న ఆఫ్ఘన్ టెస్టు మ్యాచ్‌ను తమ తేలికగా తీసుకోవడం లేదని టీమ్‌ఇండియా చీఫ్ కోచ్ గంభీర్ స్పష్టం చేసిన నేపథ్యంలో జట్టు కూర్పుపై ఆసక్తి నెలకొన్నది.

'మూడు'లో సుదర్శన్:

ఆఫ్ఘనిస్థాన్‌తో ఏకైక టెస్టు మ్యాచ్‌కు టీమ్‌ఇండియా పటిష్టమైన జట్టుతో బరిలోకి దిగుతున్నది. దిగ్గజ బ్యాటర్ విరాట్ కోహ్లీ రిటైర్మెంట్ తర్వాత ఆ స్థానాన్ని భర్తీ చేయడం కోసం టీమ్ మేనేజ్‌మెంట్ ప్రయోగాలు చేస్తూనే ఉంది. గత ఇంగ్లండ్ పర్యటనలో సాయిసుదర్శన్, కరణ్ నాయర్ లాంటి బ్యాటర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు అవకాశం కల్పించింది. కీలకమైన మూడో స్థానం కోసం తీవ్ర పోటీ నెలకొనగా..ఐపీఎల్‌లో మెరుపులు మెరిపించిన సాయిసుదర్శన్ వైపు మేనేజ్‌మెంట్ మొగ్గుచూపుతున్నది. లీగ్‌లో 700కు పైగా పరుగులు చేసిన సుదర్శన్ నిలకడ కనబరుస్తుండగా, ఇదే బెర్తు కోసం దేవదత్ పడిక్కల్ నుంచి పోటీ ఉంది. అయితే మూడులో సుదర్శన్ బ్యాటింగ్‌కు వస్తాడని గంభీర్ స్పష్టతనిచ్చిన నేపథ్యంలో పడిక్కల్‌కు నిరాశే ఎదురుకానుంది. బౌలింగ్ విషయానికొస్తే స్పిన్ దళానికి కుల్దీప్‌యాదవ్ నాయకత్వం వహించనుండగా, స్పిన్ ఆల్‌రౌండర్ కోటాలో సుందర్ జట్టులోకి రానున్నాడు. మూడో స్థానం కోసం దేశవాళీలో రాణించిన హర్ష్ దూబే, మానవ్ సుతార్‌లో ఒకరికి చాన్స్ దక్కనుంది. మహమ్మద్ సిరాజ్‌కు జతగా ప్రసిద్ధ్ కృష్ణ పేస్ బాధ్యతలు పంచుకోనున్నాడు.

రెహ్మత్ షాపైనే:

స్టార్ బ్యాటర్ రెహ్మత్‌షాపై ఆఫ్ఘనిస్థాన్ భారీ ఆశలు పెట్టుకుంది. ఆఫ్ఘన్ తరఫున టెస్టుల్లో రెహ్మత్‌షా అత్యధిక పరుగులతో కొనసాగుతున్నాడు. దీనికి తోడు టెస్టుల్లో ఎక్కువ సెంచరీలకు తోడు 50 పరుగులకు పైగా చేయడం ద్వారా రెహ్మత్..ఆఫ్ఘన్‌కు కీలకంగా మారాడు. జట్టు బ్యాటింగ్‌కు వెన్నెముకగా భావిస్తున్న షా రాణించడంపైనే ఆఫ్ఘన్ గెలుపు, ఓటములు ఆధారపడి ఉన్నాయి. ఓపెనర్ ఇబ్రహీం జద్రాన్ గైర్హాజరీ నేపథ్యంలో షా రాణించడంపై జట్టు స్కోరు అవకాశాలు ఆధారపడి ఉన్నాయి. షాకు తోడు కెప్టెన్ హష్మతుల్లా షాహిది నిలదొక్కుకుంటే జట్టు బ్యాటింగ్ కష్టాలు తీరినట్లే.

157 టెస్టుల్లో 3వేల పరుగుల మైలురాయిని అందుకునేందుకు గిల్‌కు కావాల్సిన పరుగులు

50 వికెట్‌కీపర్, బ్యాటర్ పంత్‌కు ఇది 50వ టెస్టు మ్యాచ్. భారత్ తరఫున అత్యధిక మ్యాచ్‌లు ఆడిన కీపర్లలో ధోనీ(90), కిర్మాణి(88) ముందంజలో ఉన్నారు.

జట్ల అంచనా :

భారత్: జైస్వాల్, రాహుల్, సుదర్శన్, గిల్(కెప్టెన్), పంత్, జురెల్, సుందర్, దూబే-సుతార్, కుల్దీప్, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ

ఆఫ్ఘనిస్థాన్: సెదికుల్లా అటల్, రెహ్మనుల్లా గుర్బాజ్, రెహ్మత్‌షా, షాహిది (కెప్టెన్), అజ్మతుల్లా ఒమర్జాయ్, రెహ్మనుల్లా, జజాయ్, అష్రఫ్, కరొతె, క్వాయిస్ అహ్మద్, జియావుర్ రెహమాన్



ఫైనల్లో యువ భారత్

- సెమీస్‌లో పాకిస్థాన్‌పై ఉత్కంఠ విజయం

కకామిగహర(జపాన్): అండర్-18 ఆసియాకప్ ఫైనల్లోకి యువ భారత్ దూసుకెళ్లింది. శుక్రవారం ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన సెమీఫైనల్లో యువభారత్ 5-3 తేడాతో పాకిస్థాన్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. అశిష్ తనీ పూర్తి(12ని, 49ని, 53ని, 56ని) నాలుగు గోల్స్‌తో జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించాడు. ఆఖరి క్వార్టర్ వరకు 2-3తో వెనుకంజలో ఉన్న భారత్..చివరి క్షణాల్లో అద్భుతంగా పుంజుకుని వరుస గోల్స్‌తో చిరకాల ప్రత్యర్థిపై పాక్‌పై విరుచుకుపడింది. మ్యాచ్ మొదలైన మొదటి నిమిషం నుంచే ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. 12వ నిమిషంలో పాక్ డిఫెన్స్ లోపాన్ని అనుకూలంగా మలుచుకుంటూ అశిష్..యువ భారత్‌కు తొలి గోల్ అందించాడు. అయితే రెండో క్వార్టర్‌లో పుంజుకున్న పాక్..భారత్ గోల్‌పోస్ట్‌పై దాడులకు దిగింది. ఈ క్రమంలో 27వ నిమిషంలో అదిల్ గోల్‌తో స్కోరు 1-1తో సమమైంది. మూడో క్వార్టర్ 35వ నిమిషంలో షారుఖ్ అలీ గోల్‌తో భారత్ ఆధిక్యం 2-1కి చేరగా, పాక్..ఫర్హాన్ అస్లాం(37ని), ఉజైర్ అహ్మద్(42ని) వరుస గోల్స్‌తో ఆధిక్యం 3-2కు చేరుకుంది. అయితే ఆఖరి క్వార్టర్‌లో యువ భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. ఈ క్రమంలో అశిష్ (49ని, 53ని, 56ని) వరుస గోల్స్ చేయడంతో భారత్ ఫైనల్ బెర్తు ఖరారైంది. శనివారం జరిగే ఫైనల్లో జపాన్‌తో యువ భారత్ తలపడుతుంది.

ఫైనల్లో జ్వెరెవ్

- సెమీస్‌లో మెన్సెక్‌పై విజయం
- ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో అలెగ్జాండర్ జ్వెరెవ్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో జ్వెరెవ్ 7-5, 6-2, 3-6, 6-3తో యాకుబ్ మెన్సెక్(చెక్ రిపబ్లిక్)పై అద్భుత విజయం సాధించాడు. మూడు గంటల పాటు సాగిన పోరులో జ్వెరెవ్ తనదైన శైలిలో ప్రత్యర్థిపై ఆధిపత్యం ప్రదర్శించాడు. టోర్నీలో నిలకడగా ఆడుతున్న ఈ జర్మన్ ప్లేయర్..సెట్ సెట్‌కు తన ఆటతీరును మెరుగుపర్చుకుంటూ తుదిపోరుకు అర్హత దక్కించుకున్నాడు. తొలి సెట్ నుంచే ఇద్దరి మధ్య హోరాహోరీ పోరు జరిగింది. ఓవైపు జ్వెరెవ్ పదునైన సర్వ్‌లతో చెలరేగితే మరోవైపు 18 ఏండ్ల యాకుబ్ అంతే దీటుగా బదులిచ్చాడు. దీంతో ఓ దశలో 5-5తో సెట్ సమమైన సమయంలో మెన్సెక్ అవకాశాలను దుర్వినియోగం చేసుకున్నాడు. మూడు బ్రేక్ పాయింట్లను కాపాడుకోవడంలో మెన్సెక్ విఫలం కావడం, అదే సమయంలో జ్వెరెవ్ ఒత్తిడిని అధిగమిస్తూ 7-5తో సెట్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. రెండో సెట్‌లో ఏ మాత్రం వెనుకకు తగ్గని జ్వెరెవ్.. దాన్నీ దక్కించుకున్నాడు. అయితే మూడో సెట్‌లో ఒక్కసారిగా పుంజుకున్న మెన్సెక్.. జ్వెరెవ్‌కు ఝలక్ ఇచ్చాడు. తన శక్తినంతా కూడదీసుకుంటూ జ్వెరెవ్‌కు చెమటలు పట్టించిన మెన్సెక్ 6-3తో సెట్ కైవసం చేసుకోవడం పోరు ఆసక్తికరంగా మారింది. పోటీ తీవ్రతను గమనించిన జ్వెరెవ్.. 2-0తో ఆధిక్యం కనబరిచి అదే దూకుడు కనబరుస్తూ 3-0, 4-2తో సెట్‌తో పాటు మ్యాచ్‌ను తన వైపునకు తిప్పుకున్నాడు. మ్యాచ్‌లో జ్వెరెవ్ 8 ఏస్‌లు సంధిస్తే మెన్సెక్ నాలుగుకు పరిమితమయ్యాడు. ఐదు సార్లు డబుల్‌ఫాల్ట్స్ చేయడం మెన్సెక్ కొంప ముంచగా, జ్వెరెవ్ రెండుతో సరిపెట్టుకున్నాడు. 7 బ్రేక్ పాయింట్లలో జ్వెరెవ్ 4 కాపాడుకుంటే మెన్సెక్‌కు 4లో ఒకటే దక్కింది.

కెప్టెన్‌గా అయ్యర్!

జట్టులోకి సూర్యవంశీ



ముంబై: టీమ్‌ఇండియా టీ20 జట్టుకు కొత్త సారథి రాబోతున్నాడు. పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న సూర్యకుమార్ యాదవ్‌ను తప్పిస్తూ అతని స్థానంలో శ్రేయాస్ అయ్యర్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించేందుకు రంగం సిద్ధమైంది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా జట్టులో మార్పులు, చేర్పులు చేసేందుకు బీసీసీఐ రూట్‌మ్యాప్ ఎంచుకుంది. రానున్న ఇంగ్లండ్ పర్యటనతోపాటు జపాన్‌లో జరిగే ప్రతిష్టాత్మక ఆసియా గేమ్స్ కోసం జట్లను ప్రకటించనుంది. శనివారం సమావేశం కానున్న బీసీసీఐ సీనియర్ సెలెక్షన్ కమిటీ పలు కీలక నిర్ణయాలు తీసుకోనుంది. ఐపీఎల్‌లో నిలకడగా రాణించిన శ్రేయాస్ అయ్యర్‌ను కెప్టెన్‌గా చేసే వీలుండగా, చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ అరంగేట్రం ఖాయామేననిపిస్తున్నది. హైదరాబాదీ తిలక్ వర్మను వైస్‌కెప్టెన్‌గా నియమించే అవకాశాలు ఉన్నాయి.

భారత్ పాంచ్ పటాకా



అహ్మదాబాద్: తొలి ప్రపంచ యోగాసన చాంపియన్‌షిప్‌లో ఆతిథ్య భారత్ అదరగొడుతున్నది. పోటీల మొదటి రోజు శుక్రవారం వేర్వేరు విభాగాల్లో ఐదు పసిడి పతకాలతో మెరిసింది. ఏకా ఎరీనా వేదికగా జరుగుతున్న పోటీల్లో భారత యోగాసన ప్లేయర్లు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. భారత్ తరఫున అభయ్ బర్మన్, రితూ మొండల్ తొలి స్వర్ణాలు అందించారు. మహిళల సీనియర్-ఏ విభాగంలో రీతూ ఠాకూర్, పురుషుల సీనియర్-బీ కేటగిరీలో రోషన్ తాపా, మహిళల సీనియర్-బీలో జ్యోతి దేవుర్కర్ స్వర్ణా లు కైవసం చేసుకున్నారు.

పాక్‌దే వన్డే సిరీస్

లాహోర్: ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌ను పాకిస్థాన్ కైవసం చేసుకుంది. శుక్రవారం జరిగిన మూడో వన్డేలో పాక్ 4 వికెట్ల తేడాతో ఆసీస్‌పై ఘన విజయం సాధించి 2-1తో సిరీస్ దక్కించుకుంది. ఆసీస్ నిర్దేశించిన 158 పరుగుల లక్ష్యాన్ని పాక్ 41.5 ఓవర్లలో 161-6 స్కోరు చేసింది. బాబర్ ఆజమ్(40), షాదాబ్‌ఖాన్(29 నాటౌట్), మాజ్ సదాఖత్(27) రాణించారు. మాథ్యూ కున్హెమన్(3-38) మూడు వికెట్లు తీశాడు. తొలుత షాహిన్ షా అఫ్రిది(3-30), అబ్రార్ అహ్మద్(2-19), షాదాబ్‌ఖాన్(2-28) ధాటికి ఆసీస్ 42 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. పాక్ స్పిన్నర్ల ధాటికి ఆసీస్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. కెప్టెన్ జోష్ ఇంగ్లిస్(65) మినహా మిగతావారు ఘోరంగా విఫలమయ్యారు.

టైటిల్ రేసులో ప్రజ్ఞానంద

నార్వే చెస్ టోర్నీ



ఒస్లో: నార్వే చెస్ టోర్నీలో పోటీ రసవత్తరంగా మారింది. టోర్నీ ఆదిలో ఒకింత ఒడిదుడుకులు ఎదుర్కొన్న భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద అద్భుతంగా పుంజుకుని టైటిల్ రేసులోకి దూసుకొచ్చాడు. ఆఖరి రౌండ్ మిగిలున్న టోర్నీలో ప్రజ్ఞానంద ప్రస్తుతం 15 పాయింట్లతో టేబుల్ టాపర్ అమెరికా జీఎం వెస్లె సో(15.5) తర్వాత రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. శుక్రవారం జరిగిన ఓపెన్ విభాగం తొమ్మిదో రౌండ్‌లో ప్రజ్ఞానంద 1-0తో ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్‌పై అద్భుత విజయం సాధించాడు. తద్వారా మూడు పాయింట్లు ఖాతాలో వేసుకున్న ప్రజ్ఞానంద రెండో స్థానంలోకి దూసుకొచ్చాడు. ఫ్రాన్స్‌కు చెందిన అలీ రెజా ఫిరౌజా(14.5) మూడులో కొనసాగుతున్నాడు. ఈ ముగ్గురిలో ఎవరూ గెలిచిన వారికి ఇది తొలి నార్వే టైటిల్ కానుంది. గుకేశ్‌తో పోరు విషయానికొస్తే..నల్లపావులతో బరిలోకి దిగిన ప్రజ్ఞానంద పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగుతూ నిమ్జో-ఇండియన్ సామ్మిచ్ వ్యూహంతో ముందుకు సాగాడు. గత గేమ్‌లో చేసిన తప్పులను పునరావృతం చేయకుండా జాగ్రత్తపడ్డ ప్రజ్ఞానంద..గుకేశ్ పుంజుకునేందుకు ఎలాంటి అవకాశమివ్వలేదు. తన ఆఖరి పోరులో జర్మనీకి చెందిన విన్సెంట్ కెయ్‌మర్‌తో ప్రజ్ఞానంద తలపడనున్నాడు. మహిళల విభాగంలో కజకిస్థాన్ జీఎం బిబిసారా అసబయేవా మరో రౌండ్ మిగిలుండగానే టైటిల్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఆఖరి గేమ్‌లో అన్నా ముజుచుక్ చేతిలో ఓడినా బిబిసారా స్పష్టమైన ఆధిక్యంతో విజేతగా నిలిచింది.

అగ్రస్థానంలో రవికుమార్

జాతీయ మాన్‌సూన్ రెగెట్టా చాంపియన్‌షిప్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ హుసేన్‌సాగర్ వేదికగా జరుగుతున్న జాతీయ మాన్‌సూన్ రెగెట్టా చాంపియన్‌షిప్‌లో తెలంగాణ సెయిలర్లు అదరగొడుతున్నారు. అండర్-16 అప్టిమిస్టిక్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ రవికుమార్ అద్భుత ప్రదర్శనతో అగ్రస్థానంలోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన రేసులో ఆరంభం నుంచి పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన రవికుమార్ చిరస్మరణీయ విజయం సాధించాడు. ఇదే రేసులో రాష్ర్టానికి చెందిన నరసింహ ఓవరాల్‌గా రెండో స్థానంలో నిలిచాడు. శనివారం చివరి రెండు రేసులు మిగిలి ఉన్నందున ప్రతిష్టాత్మక టైటిల్ కోసం రవికుమార్, నరసింహ మధ్య పోటీ నెలకొన్నది. అండర్-15 బాలికల విభాగంలో యువ సెయిలర్ రమీజా భాను ఓవరాల్‌గా మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇతర విభాగాల్లో ప్రీత్ సివాల్, కౌశిక్(లేజర్), ఇంటర్నేషనల్ 420 విభాగంలో బద్రీనాథ్, రిశ్విక జోడీ ఒక్క పాయింట్ ఆధిక్యంతో చంద్రలేఖ, ధనుష్ ద్వయంపై ఆధిక్యం కనబర్చగా, 29ఈఆర్ స్కిఫ్స్ విభాగంలో వినోద్, ఆరవింద్ జోడీకి తోడు శరణ్య జాదవ్, శివం వాల్మికి ద్వయం సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు.

వాణిజ్య

ఐదు ఐపీవోలకు గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ, జూన్ 5: దేశీయ స్టాక్ మార్కెట్లోకి మరో ఐదు సంస్థలు అడుగుపెట్టడానికి సిద్ధమవుతున్నాయి. ఓయో అనుబంధ సంస్థయైన ప్రిస్మ్, వార్‌బర్గ్ పింకస్‌కు చెందిన తృహోమ్ ఫైనాన్స్, రియల్ ఎస్టేట్ డెవలపర్ వీగాలాండ్ డెవలపర్స్‌తోపాటు మరో రెండు సంస్థల ఐపీవోకి సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మిగతా రెండు సంస్థల్లో అగ్రికల్చరల్ సొల్యూషన్స్ కంపెనీ అడ్వాంటా ఎంటర్‌ప్రైజెస్, మెహతా హైటెక్ ఇండస్ట్రీస్ ఉన్నట్టు సెబీ పేర్కొంది. ఈ నెల 1 నుంచి ఐదులోపల ఆయా సంస్థలు దాఖలు చేసిన దరఖాస్తులపై కులంకుషకంగా చర్చించిన తర్వాత అనుమతినిచ్చినట్టు సెబీ వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు దరఖాస్తు చేసుకున్న ఐదు కంపెనీలు మొత్తంగా రూ.10 వేల కోట్ల వరకు నిధులు సమీకరించనున్నాయి. వీటిలో ఓయోకు చెందిన ప్రిస్మ్ అత్యధికంగా రూ.6,650 కోట్ల వరకు నిధులు సమీకరించనుండగా, తృహోమ్ ఫైనాన్స్ రూ.1,500 కోట్లు, వేగాల్యాండ్ డెవలపర్స్ రూ.250 కోట్లు నిధులు సేకరించనున్నాయి.

సీఎమ్మార్ గ్రీన్‌టెక్‌కు అపూర్వ స్పందన

సీఎమ్మార్ గ్రీన్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఐపీవోకి పెట్టుబడిదారుల నుంచి విశేష స్పందన లభించింది. సంస్థ జారీ చేసిన షేర్ల కంటే 127 రెట్ల అధిక బిడ్డింగ్‌లు దాఖలయ్యాయి. క్యాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ బయ్యర్లు, నాన్-ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు అత్యధికంగా కొనుగోళ్లు జరిపారు. రూ.631 కోట్ల నిధుల సేకరణకు సంబంధించి 2,30,43,930 షేర్లను జారీ చేయగా..2,92,75,44,594 షేర్ల బిడ్డింగ్‌లు వచ్చాయి.

మార్కెట్లకు రుచించని ఆర్బీఐ నిర్ణయం

ముంబై, జూన్ 5: దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లోకి జారుకున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశ వృద్ధి రేటు మందగించనున్నదని, అలాగే ధరల సూచీ పుంజుకునే అవకాశం ఉన్నదని రిజర్వు బ్యాంక్ అంచనా మదుపరులను అమ్మకాల వైపు నడిపించాయి. వీటికి తోడు పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, విదేశీ మదుపరులు భారీగా పెట్టుబడులను తరలించుకుపోవడం కూడా సూచీలపై ప్రతికూల ప్రభావం చూపాయి. ఫలితంగా వెయ్యి పాయింట్ల శ్రేణిలో కదలాడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 116.67 పాయింట్లు నష్టపోయి 74,243.34 పాయింట్ల వద్ద ముగిసింది. సూచీల్లో 2 వేల షేర్లు నష్టపోగా, 2 వేల షేర్లు లాభాల్లో ముగియడం విశేషం. మరోవైపు, 50 షేర్ల ఇండెక్స్ సూచీ ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 49.85 పాయింట్లు కోల్పోయి 23,366.70 వద్ద స్థిరపడింది. మొత్తం మీద ఈ వారంలో సెన్సెక్స్ 532.40 పాయింట్లు నష్టపోగా, నిఫ్టీ 181 పాయింట్లు పతనం చెందింది. సూచీల్లో ట్రెంట్ షేరు 2.21 శాతం తగ్గి టాప్‌లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు టీసీఎస్, టాటాస్టీల్, ఎన్‌టీపీసీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, భారతీ ఎయిర్‌టెల్, కొటక్ బ్యాంక్, రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, ఇండిగో, బీఈఎల్, బజాజ్‌ఫైనాన్స్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, ఎస్బీఐ, మారుతి షేర్లు నష్టపోయాయి. కానీ, హెచ్‌యూఎల్, అదానీ పోర్ట్స్, బజాజ్‌ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, టైటాన్, ఎల్‌అండ్‌టీ, పవర్‌గ్రిడ్, సన్‌ఫార్మా, ఐటీసీ షేర్లు లాభాల్లో ముగిశాయి.

1.60 లక్షల దిగువకు పుత్తడి

న్యూఢిల్లీ, జూన్ 5: బంగారం ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ లేకపోవడంతోపాటు దేశీయంగా అంతంత మాత్రంగానే ఉండటంతో గత మూడు రోజులుగా దిగువ ముఖం పట్టింది. శుక్రవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన గోల్డ్ ధర రూ.400 తగ్గి రూ.1.60 లక్షల దిగువకు రూ.1,59,900కి దిగొచ్చింది. అంతకుముందు ఇది రూ.1,60,300గా ఉన్నది. కానీ, వెండి ధరలు మాత్రం భారీగా పెరిగాయి. వెండి ఏకంగా రూ.5 వేలు ఎగబాకి రూ.2,60,700 పలికింది.

క్యూ4 జీడీపీ 7.8 శాతం

న్యూఢిల్లీ, జూన్ 5: గడిచిన ఆర్థిక సంవత్సరంలో దేశ ఆర్థికరంగం పరుగులు పెట్టింది. గతేడాది చివరి త్రైమాసికంలో భారత్ 7.8 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నట్టు కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. అలాగే 2025-26 ఆర్థిక సంవత్సరం మొత్తానికి 7.7 శాతం వృద్ధిని సాధించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో స్థిర ధరల వద్ద రూ.299.89 లక్షల కోట్లుగావున్న జీడీపీ..ఆ మరుసటి ఏడాదికిగాను రూ.323.12 లక్షల కోట్లకు పెరిగినట్టు వెల్లడించింది.

దేశ ఆర్థిక వ్యవస్థకు ముప్పే

గల్ఫ్ యుద్ధంతో భారత జీడీపీ పడిపోవచ్చు • ఈ ఆర్థిక సంవత్సరం 6.6 శాతానికే పరిమితం కావొచ్చు

ద్రవ్య సమీక్షలో ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అంచనాలు • ఇప్పటికైతే కీలక వడ్డీరేట్లు యథాతథం



ముంబై, జూన్ 5: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2026-27)గాను దేశ జీడీపీ వృద్ధిని 6.6 శాతంగానే అంచనా వేసింది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ). 3 రోజుల ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష శుక్రవారం ముగిసిన అనంతరం తీసుకున్న నిర్ణయాలు, వేసిన అంచనాలను గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. ఈ క్రమంలోనే ఏప్రిల్ సమీక్షలో దేశ ఆర్థిక వృద్ధికి సంబంధించి చేసిన 6.9 శాతం లెక్కను సవరించింది. అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం.. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరల్ని ఎగదోస్తున్న విషయం తెలిసిందే. దేశీయ ఇంధన అవసరాలు దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్న నేపథ్యంలో భారత్‌కు ఆ సెగ గట్టిగానే తగులుతున్నది. ఇప్పటికే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరుగగా.. రవాణా ఖర్చుల భారంతో అన్ని వస్తూత్పత్తుల రేట్లూ ఎగిసిపడుతున్నాయి. ఈ క్రమంలోనే వీటి ప్రభావం దేశ ఆర్థిక వృద్ధిపై పడుతుందని ఆర్బీఐ అంటున్నది. అందుకే ఈసారి జీడీపీ అంచనాలకు కోత పెట్టింది. మొత్తంగా మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతలు పెరుగుతున్నకొద్దీ.. భారతీయ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావమూ ఎక్కువవుతుందని హెచ్చరించింది. దీనికితోడు అంతర్జాతీయ మార్కెట్లలో ఒడిదుడుకులు, వర్షాభావ పరిస్థితులతో ఈ ఆర్థిక సంవత్సరం.. ఆర్థిక ప్రగతికి అవకాశాలు అంతంతమాత్రంగానే ఉండొచ్చన్న ఆందోళనల్ని కనబర్చింది.

రెపోరేటు 5.25 శాతంగానే..

ద్రవ్య సమీక్ష సందర్భంగా రెపోరేటును 5.25 శాతం వద్దే యథాతథంగా ఉంచాలని ఆర్బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ)లోని సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానించారు. దీంతో ఇప్పటికైతే గృహ, వాహన, వ్యక్తిగత రుణాలపై వడ్డీరేట్లు ఎక్కడివక్కడే ఉండనున్నాయి. దాంతో రుణగ్రహీతలకు ఊరట దక్కింది. లేనిపక్షంలో ఈఎంఐలు భారంగా మారేవి. నిజానికి ఊహించినట్టుగానే ఆర్బీఐ ఈసారి వడ్డీరేట్ల జోలికి వెళ్లలేదు. ద్రవ్యోల్బణం ముప్పు పొంచి ఉన్నప్పటికీ.. ఆర్థిక వృద్ధికే సెంట్రల్ బ్యాంక్ అధిక ప్రాధాన్యతనిచ్చింది.


ద్రవ్యోల్బణం విజృంభణే..

గల్ఫ్ యుద్ధం.. దేశ జీడీపీ అంచనాల్ని తగ్గిస్తే, ద్రవ్యోల్బణం అంచనాల్ని పెంచింది. ఈ ఏడాది ఏప్రిల్‌తో మొదలైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.1 శాతంగా నమోదు కావచ్చని ఆర్బీఐ పేర్కొన్నది. ఇంతకుముందు 4.6 శాతంగానే ఉండొచ్చన్న అంచనాలున్నాయి. అయితే పెరుగుతున్న పెట్రో ధరలు, ఆ ప్రభావంతో కూరగాయలు, కిరాణా సరుకులు, ఇతరత్రా అన్ని వస్తూత్పత్తులకు పెరిగే రేట్ల దృష్ట్యా ద్రవ్యోల్బణం అంచనా మరో అర శాతం పెంచక తప్పలేదు ఆర్బీఐకి. మే 15 నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు దాదాపు రూ.8 పెరిగిన సంగతి విదితమే. మరోవైపు ఎల్‌నినో ప్రభావంతో ఈసారి వర్షాలు తక్కువేనన్న వాతావరణ శాఖ అంచనాలూ గుబులు పుట్టిస్తున్నాయి. దేశీయ వ్యవసాయం ఎక్కువగా వర్షాధారమైనదే కావడంతో పంట దిగుబడులు తగ్గితే ఆహార ద్రవ్యోల్బణం పరుగులు పెట్టడం ఖాయమే. ఇప్పటికే రిటైల్, హోల్‌సేల్ ద్రవ్యోల్బణాల్లో పెరుగుదల మొదలైంది చూస్తూనే ఉన్నాం. ఇదిలావుంటే రిటైల్ ద్రవ్యోల్బణం కట్టడి లక్ష్యం 4 శాతంగానే ఉందని ఆర్బీఐ స్పష్టం చేసింది. తాజా ద్రవ్య సమీక్షలో ద్రవ్యోల్బణం విజృంభిస్తున్నప్పటికీ.. వృద్ధికి ఊతమిచ్చేలా కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచడంతో వచ్చిన అనుమానాలపై గవర్నర్ మల్హోత్రా స్పష్టతనిచ్చారు. రాబోయే ద్రవ్య సమీక్షల్లో వడ్డీరేట్లు.. ధరల స్థిరీకరణే ధ్యేయంగా ఉంటాయంటూ పరోక్షంగా వడ్డింపులకు సంకేతాలిచ్చారు. ఇక ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 4.2 శాతంగా, జూలై-సెప్టెంబర్‌లో 5.1 శాతంగా, అక్టోబర్-డిసెంబర్‌లో 5.9 శాతంగా, జనవరి-మార్చిలో 5.4 శాతంగా ఉండొచ్చని ఆర్బీఐ అంచనా వేసింది.

చలామణిలోకి ప్లాస్టిక్ నోట్లు?

త్వరలో చలామణిలోకి ప్లాస్టిక్ నోట్లు రాబోతున్నాయి. ఈ మేరకున్న ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని ఆర్బీఐ తెలిపింది. అయితే దీనిపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని ద్రవ్య సమీక్ష అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గవర్నర్ మల్హోత్రా స్పష్టం చేశారు. పాలీమర్ కరెన్సీతో ఉన్న లాభాలు, నష్టాలను బేరీజు వేస్తున్నామని చెప్పారు. వాటిని చలామణిలోకి తెస్తే ఎటువంటి పరిస్థితుల్ని చూడాల్సి వస్తుందన్నదాన్నీ పరిశీలిస్తున్నామన్నారు. నిజానికి 2014 ఫిబ్రవరిలోనే కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో వంద కోట్ల రూపాయల విలువైన రూ.10 ప్లాస్టిక్ నోట్లను కొచ్చి, మైసూర్, జైపూర్, సిమ్లా, భువనేశ్వర్‌లలో చలామణిలోకి తేవాలనుకుంటున్నట్టు ప్రకటించింది. ప్రస్తుత కాగితపు నోట్లతో పోల్చితే పాలీమర్ కరెన్సీ త్వరగా పాడైపోకుండా, చిరిగిపోకుండా ఎక్కువకాలం మన్నికగా ఉంటుందని వివరించింది. అయితే వివిధ కారణాలతో ఆ పైలట్ ప్రాజెక్టు కార్యరూపం దాల్చలేదు.

మల్హోత్రా మాటల్లో..



- ఎల్‌నినో ప్రభావంతో ఈసారి ఆశించిన స్థాయిలో వర్షపాతం ఉండబోదన్న అంచనాలు నిజమైతే గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్, వినియోగదారుల కొనుగోలు శక్తి ప్రభావితం కాగలవు.
- డిపాజిట్లను ఆకర్షించడానికి ఆర్బీఐ ప్రకటించిన వడ్డీరేట్ల కంటే ఎక్కువగా బ్యాంకులు డిపాజిటర్లకు ఆఫర్ చేయడానికి వీల్లేదు. అయితే కాలపరిమితి, సీనియర్ సిటిజన్లను బట్టి కొంత ఎక్కువ వడ్డీ ఇచ్చేందుకు అనుమతి ఉన్నది.
- ఈ ఏడాది మే 29నాటికి దేశంలో ఫారెక్స్ రిజర్వులు 682.3 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. వారం కిందటితో పోల్చితే స్వల్పంగా పెరిగాయి. ఇవి 11 నెలలపాటు దేశీయ దిగుమతులకు సరిపోగలవు.

"

ఎఫ్‌సీఎన్‌ఆర్ (బీ) డిపాజిట్లు, ప్రభుత్వ సెక్యూరిటీలు, విదేశీ రుణాలు, ఈక్విటీ పెట్టుబడుల ద్వారా విదేశీ పెట్టుబడులను ఆకట్టుకోవడానికి చేపట్టిన చర్యలు స్వాగతించదగినవి. ఇప్పుడున్న పరిస్థితుల్లో అవసరమైనవి కూడా. ప్రభుత్వం, ఆర్బీఐ తీసుకున్న నిర్ణయాలతో దేశంలోకి విదేశీ పెట్టుబడుల ప్రవాహం పెరుగగలదు. బాండ్ మార్కెట్లను, రూపాయిని కూడా బలోపేతం చేయగలవు.

-సీఎస్ శెట్టి, ఎస్బీఐ చైర్మన్

ద్రవ్యోల్బణం అంచనాల దృష్ట్యా రాబోయే నెలల్లో వడ్డీరేట్ల పెంపు ఉంటుందని స్పష్టమవుతున్నది.

- మదన్ సబ్నవీజ్, బీవోబీ ప్రధాన ఆర్థికవేత్త

వడ్డీరేట్లను మార్చకుండా వ్యాపారాలకు, ఆర్థిక వృద్ధికి ఆర్బీఐ ఊతమిచ్చింది.

- సన్యాల్, అసోచామ్ ప్రధాన కార్యదర్శి

ఆర్బీఐ ద్రవ్య సమీక్ష నిర్ణయాలను స్వాగతిస్తున్నాం. గృహ రుణాలపై వడ్డీరేట్లు స్థిరంగా ఉంటే హౌసింగ్ డిమాండ్ నిలకడగా ఉంటుంది.

- నిర్మాణ రంగ సంఘాలు క్రెడాయ్, నరెడ్కో

ఎఫ్‌ఐఐలకు ఎల్‌టీసీజీ రద్దు

ఓవైపు కరెన్సీ మార్కెట్‌లో డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠాలకు పడిపోతున్నది. ఇంకోవైపు పెరుగుతున్న దిగుమతుల విలువతో దేశంలో ఫారెక్స్ రిజర్వులు నానాటికీ క్షీణిస్తున్నాయి. మరోవైపు యుద్ధ భయాలు, అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితుల నడుమ భారతీయ క్యాపిటల్ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్లు తమ పెట్టుబడులను వేగంగా వెనుకకు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రూపీపై ఒత్తిడిని తగ్గించాలని, డాలర్లను మరింతగా పోగేయాలని అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు ఆర్బీఐ శుక్రవారం పలు నిర్ణయాలు, చర్యలను చేపట్టాయి. ఇందులో భాగంగానే మోదీ సర్కార్.. ప్రభుత్వ సెక్యూరిటీల్లో విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్‌ఐఐలు) పెట్టే పెట్టుబడులపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీ)ను ఎత్తేసింది. ఈ మేరకు ఓ ఆర్డినెన్స్‌ను కూడా జారీ చేసింది. కాగా, ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్లు 27.6 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్న నేపథ్యంలో కేంద్రం నిర్ణయం ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. ఇక ఇందుకు తగ్గట్టుగానే ఆర్బీఐ సైతం విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి విదేశీ మదుపర్ల కోసం కొన్ని ప్రభుత్వ బాండ్ల పరిధిని విస్తరించింది. పూర్తిగా అందుబాటులో ఉండే మార్గం (ఎఫ్‌ఏఆర్) కింద ప్రభుత్వ బాండ్ల కోసం.. 15, 30, 40 ఏండ్ల కాలపరిమితితో కొత్త సర్కారీ బాండ్లను ప్రకటించింది. అంతేగాక జనరల్ రూట్ ద్వారా విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్ల (ఎఫ్‌పీఐ) పెట్టుబడుల కోసం వ్యక్తిగత సెక్యూరిటీలు, ఏకాగ్రత, స్వల్పకాలిక పెట్టుబడులకు సంబంధించి ఉన్న పరిమితుల్ని తొలగించింది. అలాగే భారతీయ పౌరసత్వం ఉండి విదేశాల్లో ఉంటున్నవారు (ఎన్నారైలు), విదేశాల్లోనే స్థిరపడ్డ భారతీయ మూలాలున్నవారి (ఓసీఐలు) కోసం లిస్టెడ్ ఈక్విటీ సాధనాల్లో సెబీ ఆమోదం లేకుండానే పెట్టుబడుల్ని పెంచుకొనే వెసులుబాటును కల్పించింది.